ఈనాడు

కరీంనగర్ 13-1-2019 ఆదివారం సిటీ సంపుటి 45 సంచిక 154
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 8-00. పేజీలు 16+16+32 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



చలి మంచు తెరల మధ్య నుంచి నులివెచ్చటి సంక్రాంతి సూరీడు కొద్దిగా పైకొస్తూనే.. వాకిట్లో పేద్ద ముగ్గు వేస్తున్న పెద్దమ్మ కొంగుపట్టుకుని గుమ్మడి పూలు గుచ్చిన గొబ్బెమ్మలు పెట్టటం..

లోపల పిల్లలంతా కలిసి కూర్చుని.. అత్త నయగారంగా చెబుతున్న చిన్ననాటి కబుర్లు వింటూ కరకరలాడే అరిసెల్నీ, సకినాలనీ ఓ పట్టుపడుతుండటం...

వంటింట్లోంచి వస్తున్న పండగ వంటల ఘుమఘుమల మధ్య వరండాలో తోడికోడళ్లంతా కూర్చుని గలగలా కబుర్లాడుకుంటూ వైనవైనాలుగా కూరగాయలు కోస్తుండటం..

పెరట్లో తాతాబామ్మలు హడావుడి పడుతూ.. పిల్లలందరికీ కొత్తబట్టలు ఎప్పుడివ్వాలా అని గుసగుసలాడుకుంటుండటం..

ఇంట్లో అక్కలూ, బావలూ, పిన్నులూ, బాబాయిలంతా ఒకళ్ల మీద ఒకళ్లు చెణుకులేసుకుంటూ చెతుర్లాడుతుంటే.. ఇంతలో బయట డోలు సన్నాయి మోగుతూనే.. పిల్లగ్యాంగ్ అంతా పోలోమంటూ వాకిట్లోకి పోయి.. ముఖం విప్పార్చుకుని గంగిరెద్దు ముందు నిలుచోటం...

ఆదిత్య కిరణం



కలిసే.. కలిసే..
అద్భుత క్షణాలు..!

వహ్... ఇదో కళకళలాడుతున్న తెలుగింటి సంక్రాంతి సంబర దృశ్యం! పండగకు అందరం కలుస్తున్నామని అనుకుంటున్నాం. కానీ నిజానికి అందరూ కలవటమే పెద్ద పండగ! కుటుంబం మొత్తం కలవటమే గొప్ప అనుభూతి. అప్పుడప్పుడైనా కుటుంబం ఇలా కలవటం.. మన ఆనందానికే కాదు.. ఆరోగ్యానికీ, ఆయుర్దాయానికీ, ముఖ్యంగా రేపటి తరం అభ్యున్నతికి కూడా అవసరమని గుర్తిస్తోంది యావత్ ప్రపంచం! మరి పండగలూ పబ్బాల్లో ఇలా కుటుంబం కలవటానికి ఉన్న ప్రాభవం ఏమిటి? దీంతో దక్కే లాభం ఏమిటి?

భోగిమంటల వైభోగ భాగ్యాల్లో.. సువర్ణ కాంతుల సంక్రాంతులు చూడటానికి తెలుగు కుటుంబాలన్నీ సిద్ధమవుతున్న తరుణంలో..

...అంతా కలవటమే పండగ 5లో!



లఖ్‌నవూలో శనివారం ఏర్పాటుచేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో చిరునవ్వులు చిందిస్తున్న బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్

సైకిల్, ఏనుగు కలిసి సవారీ

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీల పొత్తు

- చెరి 38 లోక్‌సభ స్థానాల్లో పోటీ
- కాంగ్రెస్‌కు చోటీయని ఇరు పార్టీలు
- నిర్ణయాన్ని వెల్లడించిన అఖిలేశ్ యాదవ్, మాయావతి

లఖ్‌నవూ, దిల్లీ: ఒకప్పటి బద్ధశత్రువులు చేతులు కలిపారు. సైకిల్, ఏనుగు కలిసి సవారీ చేయనున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంటున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లు ప్రకటించాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలు ఉండగా, చెరి 38 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించాయి. ఈ కూటమిలో కాంగ్రెస్‌కు చోటీయకుండా దూరం పెట్టడం గమనార్హం.

లఖ్‌నవూలోని ఓ విలాసవంతమైన ...మిగతా 2లో




భాజపా జాతీయ సమ్మేళనంలో శనివారం ప్రసంగిస్తున్న నరేంద్ర మోదీ

విపక్షాలది అవినీతి ఆరాటం

- అవినీతి, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రోత్సహించేందుకు తపిస్తున్నాయి
- మహాకూటమి ఒక విఫల ప్రయోగం
- భాజపా జాతీయ సమ్మేళనంలో ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

14లో

10% కోటాకు రాష్ట్రపతి ఆమోదం



14లో

ఎన్నాళ్లీ వివక్ష?

- రాష్ట్రాలపై కేంద్రం అడుగడుగునా చిన్నచూపు
- అధికారాలు, హక్కుల పంపిణీలో అగౌరవం
- కేంద్రంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు
- కాంగ్రెస్, భాజపాలే దానికి కారణం



ఆర్థిక సంఘం పనితీరు మారాలి	నివేదిక రూపకల్పనలో రాష్ట్రావసరాలు ప్రతిబింబించాలి	ప్రజాకోణంలో తెలంగాణ బడ్జెట్	సమీక్షలో సీఎం కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

అధికారాలు, హక్కుల పంపిణీలో కేంద్ర ప్రభుత్వం వివక్షతో రాష్ట్రాలను అగౌరవపరుస్తోందని ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రాలకు అప్పగించాల్సిన అధికారాలను తమ గుప్పిట్లో పెట్టుకుందని, ప్రజావసరాలను గుర్తించలేని విధంగా కేంద్ర విధానాలున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ప్రజల అవసరాలు తీర్చలేకపోయాయన్నారు. కేంద్రంలోని ...మిగతా 2లో

13, 16 తేదీల్లో టోల్ వసూళ్ల రద్దు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజల ప్రయాణాల దృష్ట్యా... 13, 16 తేదీల్లో జాతీయ రహదారులపై టోల్‌గేట్ల వద్ద రుసుముల వసూళ్లను రద్దుచేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు, జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.



శనివారం తెల్లవారు జామున పొగమంచు కారణంగా రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలో జాతీయరహదారిపై ఒకదానితో ఒకటి ఢీకొన్న 16 వాహనాలు



పొగ మంచు మధ్య యాదాద్రి బాలాలయం

కమ్మేసిన పొగ మంచు

- మార్గం కనిపించక 16 వాహనాలు ఢీ
- జాతీయరహదారి-44 పై ఘటన.. ఐదుగురికి గాయాలు

ఈనాడు - హైదరాబాద్

రాత్రి, తెల్లవారుజాము సమయాల్లో పొగ మంచు దట్టంగా కురుస్తోందని, ప్రయాణాలు చేయవద్దని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచించింది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి లోనే ఉన్నా మంచు అధికంగా కురుస్తోంది. కర్ణాటక నుంచి విదర్భ, మధ్యప్రదేశ్‌ల మీదుగా రాజస్థాన్ వరకూ 900 మీటర్ల ఎత్తున ఉపరి తల ద్రోణి ఉంది. ఉత్తర కోస్తాంధ్ర నుంచి విదర్భ వరకూ 'తుపాను వ్యతిరేక గాలులు' న్నాయి. బంగాళాఖాతం నుంచి తెలంగాణ వైపు వీస్తున్న తేమ గాలులు విదర్భ వద్ద నుంచి వంపు తిరుగుతున్నాయని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. రాత్రిపూట భూమి వాతావరణం బాగా చల్లబడుతోంది. దీనివల్ల గాలిలో తేమ నీటి బిందువుల్లా మారి మంచులా కురుస్తోంది. పలు ప్రాంతాల్లో తేమ 90 శాతాన్ని మించుతోంది. దీంతో పొగమంచు అధికంగా కురుస్తోంది.

హైదరాబాద్‌లో శనివారం తెల్లవారుజామున విపరీతంగా పొగమంచు కమ్ముకోవడానికి తేమ శాతం భారీగా పెరగడమే కారణమని ఆయన వివరించారు. ఇదే తరహా వాతావరణం ఆది, సోమవారాల్లో కూడా కొనసాగుతుందని తెలిపారు. శనివారం ఉదయం ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 14, మెదక్‌లో 15, నల్గొండలో 16, హైదరాబాద్‌లో 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఢీకొన్న వాహనాలు

నందిగామ, న్యూస్‌టుడే: దట్టంగా కురుస్తున్న పొగమంచుతో వాహనదారులు భీతిల్లుతున్నారు. జాతీయ రహదారులపై కనులు చించుకున్నా కాన రాని పరిస్థితి నెలకొంటోంది. ముందు వెళ్తున్న వాహనాలు కనిపించక ఢీకొంటూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం జరిగిన ఇలాంటి ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధి జాతీయరహదారి-44పై ఉదయం వేళ 16 వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయి. మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న వాహనదారులకు పొగమంచు వల్ల తమ ముందు వెళ్తున్నవి కనిపించలేదు. కిలోమీటరులోపు 6 చోట్ల ప్రమాదాలు జరిగాయి. ఒకదానినొకటి ఢీకొనడంతో 4 కార్లు, 4 బస్సులు, 4 లారీలు, 2 ఆటోలు, లారీక్రేన్, మినీవ్యాన్ దెబ్బతిన్నాయి. 12 వాహనాలకు భారీగా, నాలుగు వాహనాలకు పాక్షికంగా నష్టం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరు, బస్సులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. మరో వైపు శంషాబాద్ పరిధిలోని అమ్మపల్లి ఆలయ సమీపంలో బస్సు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.

హిమగిరి కాదు.. యాదగిరి

సంక్రాంతికి ముందస్తు మంచు తెరలు కమ్ముకోవడంతో శనివారం యాదాద్రి పుణ్య క్షేత్రం హిమగిరిలా మారింది. ఉదయం 7 గంటల నుంచి 9:30గంటల మధ్య పొగ మంచు దట్టంగా వ్యాపించడంతో ఆలయదారులు కనిపించక యాత్రికులు ఇబ్బందులకు గురయ్యారు. కనుమదారులు.. ఆలయ వీధులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురాలు ఇలా సాక్షాత్కరించాయి.

-న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

జాతీయ గీతాన్ని ఆలపిస్తున్నారా?

గాంధీజీకి విద్యార్థులతో కలిసి ఉండటమంటే మహా ప్రీతి. 1919లో దక్షిణదేశ పర్యటనకు వచ్చిన ఆయనను మద్రాసు విద్యార్థులు ఏప్రిల్ 27న వైఎంసీఏ హాలుకు ఆహ్వానించి, ప్రత్యేకంగా సన్మానించారు. ఆ రోజున సభాప్రారంభ సూచకంగా కొందరు విద్యార్థులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. అనంతరం గాంధీజీ వారిని ఉద్దేశించి చేసిన ప్రసంగం నుంచి..

"మనోహరమైన మన జాతీయగీతంలో భరతమాతను వర్ణించేందుకు కవి తనకు తెలిసిన విశేషణాలన్నింటినీ కురిపించారు. భరతమాత స్వరూపాన్ని తెలిపేందుకు కవి వాటిని వాడిన మాట వాస్తవమేగానీ.. నిజానికి ఆ గీతాన్ని ఆలపించే అర్హత మనకుందా? మన మాతృదేశాన్ని వర్ణించటంలో మహాకవి ప్రయోగించిన ప్రతి మాటనూ వాస్తవం చేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉంది. నేడు మీరు అభ్యసిస్తున్న విద్య ఆ ఆదర్శాలను చేరుకునేందుకుగానీ, మీలోని ఉత్తమ లక్షణాలను ఉత్తేజపరిచేందుకుగానీ ఉపయోగపడుతోందా? లేక మీ విద్యాసంస్థలన్నీ కేవలం ప్రభుత్వోద్యోగులను, వ్యాపార కార్యాలయాల్లో గుమాస్తాలను తయారుచేసే కర్మాగారాల పాత్రనే పోషిస్తున్నాయా? ఆలోచించండి. మీ చదువులకు సార్థకత ఉద్యోగాలను చేజిక్కించుకోవటమేనని మీరు భావిస్తుంటే.. మీ ఆదర్శం కూడా అంతకు మించి లేకుంటే.. ఆ కవి చిత్రించిన ఆ భరతమాత మనోహర దృశ్యాన్ని మనం ప్రత్యక్షంగా చూడగలగటం దుర్లభం! నేను ఆధునిక నాగరికతకు వ్యతిరేకినని మీకు తెలుసు. నేడు ఐరోపా దేశాలు ఆ నాగరికత ఇనప పదఘట్టనల కింద నలిగిపోతున్న తీరు చూస్తే మీరా నాగరికతను ఎలాగైనా అనుకరించాలని తహతహలాడరు. బ్రిటీషువారు ఆ సంస్కృతిని మన మీద రుద్దుతుంటే మనమేం చెయ్యగలమని మీరు అనొచ్చుగానీ.. మనం వద్దనుకుంటే ఎవరూ ఆ సంస్కృతిని మన మీద రుద్దలేరు. మనం మనవైన సత్సంప్రదాయాలను అనుసరించగలిగితే ఈ దేశం ప్రపంచానికి ఒక సందేశంగా నిలవటం తథ్యం. అది భౌతిక బల సందేశం కాదు. ప్రేమ సందేశం. అందుకు మిమ్మల్ని మీరు ఆత్మపరీక్ష చేసుకోండి. స్వతంత్రంగా ఆలోచించండి. మీ స్వాతంత్ర్యానికి భంగం కలిగించే ప్రతి పరిస్థితిని ప్రతిఘటించి తీరండి. జాతీయ గీతం మన కళ్ల ముందు ఆవిష్కరిస్తున్న సర్వాంగ సుందర భారతావనిని ఆవిష్కరించడంలో ప్రముఖ పాత్ర మీదేనని గ్రహించండి.

- మహాత్మా గాంధీ

వానాకాలం నుంచి పంటల కాలనీలు

- ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాల్లో ఏర్పాటు
- సీఎం కేసీఆర్ ఆదేశాలు
- వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి సమీక్ష
- వరిసాగు పెరగకుండా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచన

ఈనాడు - హైదరాబాద్



ఏ ప్రాంతాల్లో ఏయే పంటలు పండించడానికి అనువుగా ఉంటుందో గుర్తించి వాటి సాగుకోసం పంటల కాలనీల ఏర్పాటుకు వచ్చే జూన్‌లో ప్రారంభమయ్యే వానాకాలం(ఖరీఫ్) సీజన్ నుంచే శ్రీకారం చుట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇందుకోసం యుద్ధప్రాతిపదికన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, ఉద్యానశాఖలకు ఆయన శనివారం సూచించారు. దీంతో ఈ రెండు శాఖల ముఖ్య కార్యదర్శి పార్థసారథి వెంటనే సచివాలయానికి వచ్చిన ఉన్నతాధికారులతో పంటలకాలనీలు, ఆహారశుద్ధి అంశాలపై శనివారం తన కార్యాలయంలో సమీక్ష జరిపారు. వ్యవసాయ కమిషనర్ రాహుల్ బొజ్జా, ఉద్యాన, మార్కెటింగ్, ఆహారశుద్ధి శాఖల సంచాలకులు వెంకట్రాంరెడ్డి, లక్ష్మీబాయి, భగవాన్ ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. ప్రజల ఆహార తలసరి వినియోగం ఆధారంగా ఏ పంటలకు కొరత ఉంటే వాటి ఉత్పత్తి తీరును పరిశీలించి సాగు పెంచేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. పండిన పంటలకు శుద్ధి ద్వారా విలువ పెంచేందుకు స్వయం సహాయక సంఘాల వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రయోగాత్మకంగా కొన్ని జిల్లాలను ఎంపిక చేసి తొలుత ఈ కార్యక్రమాలను అమలు చేయాలని తెలిపారు. కొత్త సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే నీటి లభ్యత పెరుగుతుందని..దీనివల్ల వరి సాగు విస్తీర్ణం పెరగకుండా ఇతర పంటల సాగును ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

ఉద్యాన పంటల లెక్కలు సేకరించాలి

రాష్ట్రంలో సాగుచేసే పండ్ల తోటలు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఉద్యాన పంటల లెక్కలను పక్కాగా సేకరించాలని పార్థసారథి ఆదేశించారు. జీడిమెట్లలోని ఉద్యానశాఖ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ)లో జరిగిన ఉద్యాన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పండ్లు, కూరగాయల తలసరి వినియోగం ఎంత అనే వివరాలతో పంటల దిగుబడి, సాగు లెక్కలను పోల్చాలన్నారు. వాటిని బట్టి రాష్ట్రంలో ఇంకా ఏ పంటలు ఎంత పండించాలో తెలుస్తుందన్నారు. సూక్ష్మసేద్య పథకం అమలుపైనా ఆయన సమీక్ష జరిపారు. ఈ పథకంలో ఏమైనా పొరపాట్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్నాళ్లీ వివక్ష?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో నిరసన వ్యక్తం చేస్తున్నారని.. కాంగ్రెస్, భాజపా అనే రెండు రాజకీయ వ్యవస్థలే దీనికి మూలకారణమని సీఎం మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు ఆర్థిక సంఘం తన పాత్రను వినూత్నంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ బడ్జెట్ ప్రజల కోణంలో, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేసేలా ఉండాలని ఆకాంక్షించారు. సీఎంగా తనను ఎన్నుకున్న ప్రజలకు ఎంత సేవ చేయగలనో ఆలోచన చేయాలన్నారు. త్వరలో రాష్ట్రంలో 15వ ఆర్థిక సంఘం పర్యటన, ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రూపకల్పన నేపథ్యంలో శనివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ఆర్థిక, పంచాయతీరాజ్ శాఖల ముఖ్యకార్యదర్శులు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు నర్సింగ్‌రావు, స్మితా సబర్వాల్, సందీప్ సుల్తానియా, మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు. 'దేశానికి విశాలమైన ఆర్థిక విధానం ఉంది. కానీ, అధికారాలన్నీ కేంద్రం గుప్పిట్లోనే ఉన్నాయి. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాల విధానాల్లో జోక్యం చేసుకోవద్దని నేను నీతిఆయోగ్ సమావేశాల్లో స్పష్టం చేశాను. రాష్ట్ర ప్రగతిని దేశ ప్రగతిగా పరిగణించాలి. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాలను నిరుత్సాహపరచొద్దు. చిన్న చిన్న నిధుల విడుదలకు కూడా అనేక నిబంధనలు విధిస్తున్నారు.

ఆర్థిక సంఘం తీరు మారాలి

ఆర్థిక సంఘం రాష్ట్రాల్లో పర్యటించి, అక్కడి ప్రభుత్వాలతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, పర్యటనకు ముందే విధివిధానాలను రూపొందిస్తున్నారు. ఇది సరి కాదు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సాంస్కృతిక, ఆర్థిక జీవన విధానం ఉంటుంది. రాష్ట్రాల అవసరాల రీత్యా సంక్రమణల (డివల్యూషన్) అంశం రాష్ట్రాల హక్కుగా పరిగణించి, విధానాల రూపకల్పనకే ఆర్థిక సంఘం పరిమితమైతే మంచిది. తెలంగాణ ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకుని ఆర్థిక శాఖ నివేదిక రూపొందించాలి.

అయిదేళ్ల అవగాహనతో బడ్జెట్

ఆదరాబాదరాగా కాకుండా స్పష్టమైన అవగాహనకు వచ్చాకే బడ్జెట్ రూపకల్పన జరగాలి. మన బలాలు, బలహీనతలను అంచనా వేసుకోవాలి. అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రజల అవసరాలను పరిశీలించిన తర్వాతే తుదిబడ్జెట్‌కు రూపకల్పన చేయాలి. కేవలం ఈ ఏడాదికే కాకుండా, వచ్చే అయిదేళ్లకు తగ్గట్లు బడ్జెట్ విధివిధానాలుండాలి. అయిదేళ్లలో రాష్ట్రానికి ఎంత డబ్బు వస్తుంది? ఎంత ఖర్చవుతుందనే అంచనా ఉండాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా రానున్న ఐదేళ్ల కాలానికి నీటిపారుదల శాఖకు రూ. రెండు లక్షల కోట్లు ఖర్చవుతుంది. కేంద్రం నుంచి అన్ని సాగునీటి ప్రాజెక్టులకూ అనుమతులు సాధించినందున బడ్జెట్ వాటికి పెద్దపీట వేయాలి. గొర్రెల పంపిణీ ప్రజాదరణ పొందింది. చేపల పెంపకం, చేనేత రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంది. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తోంది. వారి కళను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. విద్యుత్ సగటు వినియోగంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. బడ్జెట్ ప్రతిపాదనల్లో ఈ అంశాలన్నీ పరిగణించాలి.

మంత్రులకు శిక్షణ

మంత్రివర్గ విస్తరణ తర్వాత మంత్రులు, అన్ని శాఖల కార్యదర్శులకు వారి విధులు, అధికారాలు, పాత్రలు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థల్లో వారి పరిధులు, నిబంధనలపై అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ (ఆస్కి) ద్వారా శిక్షణ ఇప్పిస్తాం.

హైదరాబాద్‌పై బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్ విశ్వనగరం. ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. దేశంలోని 5 ప్రధాన నగరాల్లో ఒకటి. ఇందులో వంద పార్కులుఉండాలి. భవిష్యత్తు తరాల కోసం బృహత్తర ప్రణాళికను రూపొందించాలి. హైదరాబాద్‌ను వచ్చే అయిదేళ్లలో ప్రపంచ స్థాయికి ఎలా తీర్చిదిద్దనున్నామో బడ్జెట్‌లో ప్రతిబింబించాలి" అని సీఎం సూచించారు.

పర్యాటక కేంద్రంగా కాళేశ్వరం

కాళేశ్వరం ప్రాజెక్టును ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలి. అక్కడి త్రివేణి సంగమం అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మారబోతోంది. ఈ దిశగా బడ్జెట్‌లో దృష్టి కేంద్రీకరించాలి. విశ్వవిద్యాలయాల పరిశోధనలు, వ్యవసాయాన్ని నవీకరించడం, ఆహార శుద్ధి రంగానికి అవకాశాలు కల్పించడంపై విధివిధానాలు రూపొందించాలి. మన విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలసపోకుండా, దేశవిదేశాల విద్యార్థులను కూడా ఆకర్షించేలా రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయాలి. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ప్రయోజనాలను పరిశీలించాలి. ఆరోగ్య తెలంగాణ దిశగా మానవీయ కోణంలో బడ్జెట్ విధానాలు ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా శుద్ధి చేసిన పరిశుభ్రమైన తాగునీరు లభిస్తుండడం రాష్ట్రాభివృద్ధికి సూచిక. పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అవసరాలు దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ అంచనాలు రూపొందించాలి.

సైకిల్, ఏనుగు కలిసి సవారీ



(మొదటి పేజీ తరువాయి)

హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రెండు పార్టీల అధ్యక్షులు అఖిలేశ్ యాదవ్, మాయావతి పొత్తు కుదిరిన విషయాన్ని వెల్లడించారు. కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకోనప్పటికీ రాహుల్, సోనియాలు పోటీ చేసే అమేథీ, రాయ్‌బరేలీల్లో అభ్యర్థులను నిలబెట్టబోమని తెలిపారు. మరో రెండు స్థానాలను చిన్న భాగస్వాములకు కేటాయిస్తామని చెప్పారు. ఆ పార్టీలు ఏవన్నది ప్రకటించకపోయినప్పటికీ అజిత్ సింగ్ ఆధ్వర్యంలోని రాష్ట్రీయ లోక్‌దళ్ వంటి పార్టీలకు ఇచ్చే అవకాశం ఉంది.

కాషాయ పార్టీని కుమ్మేస్తాం

తమ కూటమి భాజపాను ఓడిస్తుందన్న దృఢ విశ్వాసం ఉందని అఖిలేశ్, మాయావతి చెప్పారు. ఉపఎన్నికల్లో ఓడించామని, రానున్న ఎన్నికల్లోనూ కాషాయ పార్టీని కుమ్మేస్తామని తెలిపారు. "ఈ విలేకరుల సమావేశం తరువాత గురుశిష్యులు నరేంద్ర మోదీ, అమిత్ షాలకు నిద్ర పట్టదు" అని వ్యాఖ్యానించారు. బోఫోర్స్‌తో కాంగ్రెస్ పతనమయిందని, రఫేల్‌తో భాజపాకూ అదే గతి పడుతుందని అన్నారు. ఈవీఎంలను దుర్వినియోగం చేయకుండా ఉంటే.. రామమందిరం పేరుతో రెచ్చగొట్టకుండా ఉంటే తమదే విజయమని మాయావతి తెలిపారు.

కాంగ్రెస్ ఓట్లు మాకు బదిలీ కావు: మాయావతి

కూటమిలో కాంగ్రెస్‌ను చేర్చుకోకపోవడానికి గల కారణాలను మాయావతి వివరించారు. గతంలో ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నా ఎలాంటి ప్రయోజనం కలగలేదని అన్నారు. తమ ఓట్లు ఆ పార్టీకి బదిలీ అవుతున్నా, వారి ఓట్లు తమకు రావని చెప్పారు. ఎస్పీ-బీఎస్పీల మధ్య ఓట్ల బదలాయింపు జరుగుతుందని తెలిపారు. "మాది సహజసిద్ధమైన పొత్తు. ఎన్నికల తరువాత కూడా కొనసాగుతుంది" అని వివరించారు. తాము గతంలో కలిసి పోటీ చేసి విజయాలు సాధించామని అన్నారు. అఖిలేశ్ బాబాయి శివపాల్ యాదవ్‌ను భాజపా ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఆయన ఇటీవల ప్రారంభించిన ప్రగతిశీల్ సమాజ్‌వాదీ పార్టీ-లోహియా (పీఎస్‌పీఎల్)ను భాజపాయే నడిపిస్తోందని అన్నారు. ఆయనపై వెచ్చిస్తున్న డబ్బు మురికికాలువలో కలిసినట్టేనని వ్యాఖ్యానించారు. 1995లో తనపై ఎస్పీ కార్యకర్తలు దాడి చేసిన అంశాన్ని దేశ ప్రయోజనాల దృష్ట్యా పక్కనపెట్టానని చెప్పారు.

ఉత్తర్‌ప్రదేశ్ ప్రధానిని ఇస్తే సంతోషమే: అఖిలేశ్

ప్రధాని అభ్యర్థిగా మాయావతిని సమర్థిస్తారా అన్న ప్రశ్నకు అఖిలేశ్ సూటిగా సమాధానం ఇవ్వలేదు. "నేను ఎవరికి మద్దతిస్తానో మీకు తెలుసు. ఉత్తర్‌ప్రదేశ్ ఎంతో మంది ప్రధానులను ఇచ్చింది. మరోసారి ఇస్తే సంతోషమే" అని వ్యాఖ్యానించారు. "మాయావతి గౌరవం నా గౌరవం. ఆమెను అవమానపరిస్తే నన్ను అవమానపరిచినట్టే" అని అంటూ శ్రేణులకు సందేశం పంపారు.

ఉనికి కోసమే పొత్తు: భాజపా

ఉనికి కోసమే ఆ రెండు పార్టీలు పొత్తుపెట్టుకున్నాయని భాజపా సీనియర్ నేత, కేంద్ర మంత్రి రవి శంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు. దీనివల్ల ఉత్తర్‌ప్రదేశ్‌కుగానీ, దేశానికిగానీ ఎలాంటి ప్రయోజనం లేదని అన్నారు. మోదీ వ్యతిరేకత అన్న ఒక్క అంశం ఆధారంగానే పొత్తు పెట్టుకున్నాయని తెలిపారు.

నేడు కాంగ్రెస్ సమావేశం

ఎస్పీ-బీఎస్పీల పొత్తు ప్రకటన వెలువడిన నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించడానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం లఖ్‌నవూలో సమావేశం కానున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం నబీ ఆజాద్, పీసీసీ అధ్యక్షుడు రాజ్ బబ్బర్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొననున్నారు. కాంగ్రెస్‌ను కలుపుకొని వెళ్లకుండా ఆ పార్టీలు పెద్ద ప్రమాదకరమైన తప్పిదాన్ని చేశాయని ఆ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రస్తుతం కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, నిరంకుశ భాజపాను ఓడించడానికి ప్రతిపక్షాలు ఏకం కావాల్సి ఉందని అన్నారు. పొత్తుపై ఇదే చివరి మాట కాకపోవచ్చని, ఎన్నికలు సమీపించే కొద్దీ విస్తృత కూటమి ఏర్పాటయ్యే అవకాశం ఉందని సీనియర్ నేత చిదంబరం అన్నారు. ఒంటరి పోరుకూ సిద్ధమేనని చెప్పారు.

ఇతర పార్టీల స్పందనలు

కూటమిలో తమకు చోటు దక్కుతుందని రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ) ఆశాభావం వ్యక్తం చేసింది. కూటమి ఏర్పాటును పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ నేత డి.రాజా స్వాగతించారు. ఇది ప్రతిపక్షాల ఐక్యతకు ఆటంకం కాబోదని రాజా అన్నారు. ఈ పొత్తును శివసేన ఖండించింది. దీనివల్ల మహాకూటమి ఏర్పాటు ప్రశ్నార్థకంగా నిలుస్తుందని వ్యాఖ్యానించింది. శివపాల్ యాదవ్‌ను భాజపా నడిపిస్తోందంటూ మాయావతి చేసిన వ్యాఖ్యను పీఎస్‌పీఎల్ అధికార ప్రతినిధి సి.పి.రాయ్ ఖండించారు. భాజపాతో పొత్తు పెట్టుకున్నది ఎవరో అందరికీ తెలుసని అన్నారు. అధికారంలో ఉండగా మాయావతి పెట్టించిన కేసులను సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలెవరూ మరచిపోలేదని చెప్పారు. తమ పార్టీ కాంగ్రెస్‌తో చేతులు కలుపుతుందని అన్నారు.

పొత్తు ప్రస్థానం ఇలా...

- రామమందిరం ఉద్యమంతో విజయపథంలో ఉన్న భాజపాకు ఎస్పీ-బీఎస్పీల కూటమి అడ్డుకట్ట వేసింది. 1993లో ఆ రెండు పార్టీల వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్, కాన్షీరాంలు పొత్తుపెట్టుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీకి 67, ఎస్పీకి 109. . మొత్తం 167 సీట్లు వచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.
- 1995లో మీరాబాయి మార్గ్ అతిథి గృహంలో మాయావతి పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తుండగా ఎస్పీ కార్యకర్తలు ఆమెపై దాడి చేశారు. బీఎస్పీ ఎమ్మెల్యేలు ఆమెను కాపాడలేకపోయారు. అక్కడికి వచ్చిన భాజపా ఎమ్మెల్యే బ్రహ్మదత్ ద్వివేదీ ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దాంతో ఆమె భాజపాకు మద్దతు ఇచ్చారు. 1996లో ఆ రెండు పార్టీల కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- మళ్లీ ఎస్పీతో పొత్తు కోసం కాన్షీరాం ప్రయత్నించినా మాయావతి అంగీకరించలేదు. 23 ఏళ్ల తరువాత పొత్తు కుదిరింది.
- 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీకి అయిదు స్థానాలు రాగా, బీఎస్పీ ఖాతా తెరవలేదు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలకు చెరి 22 శాతం ఓట్లు వచ్చాయి.
- రెండు పార్టీలు ఉమ్మడిగా పోటీ చేసి యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రాతినిధ్యం వహించిన గోరఖ్‌పుర్, ఫూల్‌పుర్ లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకున్నాయి. అప్పటి నుంచి రెండు పార్టీల్లో పొత్తుపై ఆసక్తి నెలకొంది.
- యూపీలో 22 శాతం మంది దళితులు, 45 శాతం మంది ఓబీసీలు, 19 శాతం మంది ముస్లింలు ఉన్నారు. రెండు పార్టీలూ తమ సంప్రదాయ ఓటు బ్యాంకును కాపాడుకొనే ప్రయత్నాలు చేస్తున్నాయి. ముస్లిం ఓట్లు చీలకుండా ఉంటాయని, ఇది ఫలితాలపై ప్రభావం చూపుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

భాజపాను గద్దె దింపగలగాలి!

- మమ్మల్ని పక్కన పెట్టినా ఫర్వాలేదు: రాహుల్‌గాంధీ

దుబాయ్: లోక్‌సభ ఎన్నికలను సమష్టిగా ఎదుర్కోవడానికి ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్పీ-బీఎస్పీ కూటమి కట్టిన నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. భాజపాను గద్దె దింపడంలో కూటమి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ ప్రయత్నంలో తమ పార్టీని కూటమి పక్కన పెట్టినా తనకు అసంతృప్తిగా లేదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో తమ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, తాము పూర్తి శక్తి-సామర్థ్యాలతో ఎన్నికల్లో విజయం సాధించడానికి కృషి చేస్తామన్నారు. అఖిలేష్, మాయావతిలపై తనకు అపార గౌరవం ఉందని, వారికి సంబంధించినంత వరకు ఎలాంటి నిర్ణయమైనా తీసుకునే హక్కు వారికుందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

13-1-2019 ఆదివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
సప్తమి: సా. 6.49 తదుపరి అష్టమి
ఉత్తరాభాద్ర నక్షత్రం: ఉ. 7.20 తదుపరి రేవతి
అమృత ఘడియలు: తె. 6.14 నుంచి
వర్జ్యం: రా. 8.03 నుంచి 9.45 వరకు
దుర్ముహూర్తం: మ. 4.11 నుంచి 4.55 వరకు
రాహుకాలం: మ. 4.30 నుంచి 6.00 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-39

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	13.6	30.0
రామగుండం	14.6	29.8
హన్మకొండ	15.0	27.0
కరీంనగర్	15.0	29.0
నల్గొండ	15.4	24.4

ఇదీ సంగతి!



మరీ చలిగా ఉంది. నేను రాను నువ్వెళ్లు!

అంచనాలకు మించి స్పందన

- ఓటు హక్కు నమోదు, సవరణలకు వెల్లువలా దరఖాస్తులు
- ఈ నెల 25 వరకు అవకాశం
- 20న పోలింగ్ కేంద్రాల్లోనూ..
- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గడువు పెంచాలని ఈసీ లేఖ

ఈనాడు - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్ల జాబితా సవరణను తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టింది. ఓటు హక్కు నమోదుకు సంబంధించి రాష్ట్రంలో అధికారుల అంచనాలకు మించి స్పందన లభిస్తోంది. ఓటర్ల జాబితా సవరణకు, ఓటు హక్కు నమోదుకు ఈ నెల 25వ తేదీతో గడువు ముగియనుంది. ఓటర్ల నమోదులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఫిబ్రవరి 22వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు గడువు పొడిగించాలన్న ప్రతిపాదనకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతి లభించాల్సి ఉంది. ఓటు హక్కు నమోదుకు గడువు ముగిసినా ఏడాది పొడవునా ఎప్పుడైనా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

12 లక్షలకు పైగా దరఖాస్తులు

ఓటర్ల నమోదు కోసం భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. గడిచిన పది రోజుల నుంచి ఇప్పటి వరకు 12 లక్షలకు పైగా దరఖాస్తులు అందినట్లు సమాచారం. వీటిలో అత్యధికంగా కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించినవే ఉన్నాయి. శాసనసభ ఎన్నికల ముందు నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా సుమారు 35 లక్షల దరఖాస్తులు వచ్చాయి. మళ్లీ కొద్ది రోజులకే చేపట్టిన సవరణకు ఇంత భారీగా స్పందన రావటం విశేషం. ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉన్నందున మరో పది లక్షల వరకు దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున ఓట్లు గల్లంతైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే దరఖాస్తులు భారీగా వస్తున్నట్లు తెలుస్తోంది.

ఆన్‌లైన్‌లో అవస్థలు

ఆన్‌లైన్ ద్వారా ఓటు హక్కు నమోదులో పలువురు ఇబ్బందులు పడుతున్నారు. ఒకటికి రెండు దఫాలు నమోదు చేయాల్సి వస్తోంది. నమోదు ప్రక్రియ పూర్తి కాగానే దరఖాస్తు ఎన్నికల సంఘానికి అందినట్లు, దాని స్థితిగతులను తెలుసుకునేందుకు వీలుగా 12 అంకెలతో నంబరు వస్తుంది. కొన్ని సందర్భాల్లో ఎలాంటి నంబరు రావటం లేదు. దరఖాస్తు ఎన్నికల సంఘానికి చేరిందా? లేదా? అని దరఖాస్తుదారులు అయోమయంలో పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. వెబ్‌సైట్ సకాలంలో స్పందించకపోవటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గతంలో వేసినవి ఇంకా అపరిష్కృతంగానే..

శాసనసభ ఎన్నికల ముందు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్న దరఖాస్తులు ఇప్పటికీ పరిశీలనలో ఉన్నట్లుగానే చూపుతున్నాయి. ఓటరు నమోదు సందర్భంగా ఇచ్చిన నంబరుతో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పరిశీలిస్తే ఆమోదం పొందినట్లు కనిపిస్తోన్నా ఓటర్ల జాబితాలో మాత్రం పేరు కనిపించటం లేదు. కొన్ని దరఖాస్తులు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నట్లు చూపిస్తోంది. జాబితాలో పేరు లేనందున మరోదఫా దరఖాస్తు చేయాలా? వేచి ఉండాలా? అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పోలింగు కేంద్రాల వద్ద నమోదుకు అవకాశం..

ఓటర్ల నమోదులో భాగంగా వచ్చే ఆదివారం (20న) ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలతో పోలింగ్‌కేంద్రం స్థాయి అధికారులు (బీఎల్‌వో) అన్ని పోలింగు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారు. ఆ జాబితాలో పేరు ఉందా? లేదా? అన్నది ఓటర్లు తనిఖీ చేసుకోవచ్చు. ఓటు లేదని గుర్తించిన పక్షంలో అక్కడికక్కడే దరఖాస్తు చేసేందుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో మాత్రం ఈ నెల 23న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఓటర్ల జాబితా సవరణపై అన్ని రాజకీయ పార్టీలతో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ ఇటీవల సమావేశం నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల కారణంగా ఓటర్ల జాబితాపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేదని, సవరణకు గడువు పొడిగించాలని ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు కోరాయి. దీంతో ఓటర్ల నమోదు గడువును పొడిగించాలని అధికారులు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.



నిర్మాణం తుదిదశలో ఉన్న 111.2 అడుగుల శివలింగం

ప్రపంచంలోనే ఎత్తైన శివలింగం

తమిళనాడు-కేరళ సరిహద్దుల్లో నిర్మాణం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శివలింగంగా ఉదయకుళంగర ప్రాంతంలోని లింగానికి గుర్తింపు లభించింది. తమిళనాడు-కేరళ సరిహద్దుల్లోని చెంగల్ మహేశ్వర శివపార్వతి ఆలయ ప్రాంగణంలో శివలింగం నిర్మాణాన్ని 2012లో ప్రారంభించారు. 111.2 అడుగుల ఎత్తుతో ఎనిమిది అంతస్తులుగా నిర్మిస్తున్న ఈ శివలింగం వ్యయ అంచనా రూ.10 కోట్లు. ప్రతి అంతస్తులోనూ ధ్యానమండపాలు కలిగిన ఈ శివలింగం లోపలి భాగం గుహలను తలపిస్తోంది. అందులో పరశురాముడు, అగస్త్యుడు తదితరులు తపస్సు చేస్తున్నట్లు కొన్ని ప్రతిమలు ఏర్పాటు చేశారు. కింది అంతస్తులో భక్తులు అభిషేకం, ఆరాధనలు చేసేందుకు అనువుగా శివలింగం, ఎనిమిదో అంతస్తులో కైలాసగిరిలో శివపార్వతులు ఉన్నట్లు ప్రతిమలు కొలువుదీర్చారు. ప్రస్తుతం 80 శాతం పనులు ముగిసిన నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శివలింగంగా దీనికి గుర్తింపు లభించింది. 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్' ఈ మేరకు గుర్తించింది. మహాశివరాత్రి నాటికి మిగిలిన పనులను కూడా పూర్తి చేయాలని ఆలయ ప్రతినిధులు నిర్ణయించారు.



యువజన దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

వివేకానందుడి ఆశయ సాధనకు కదలాలి

- యువతకు ఉపరాష్ట్రపతి పిలుపు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన స్వామి వివేకానంద ఆశయ సాధన కోసం యువత నడుం బిగించాలని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శంషాబాద్ పరిధి ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్ కేంద్రంలో ఆయన విగ్రహానికి ఉపరాష్ట్రపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ పొందిన యువతీ యువకులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. ట్రస్ట్ సామాజిక సేవల విధివిధానాల్లో ఏమైనా మార్పు చేర్పులు చేయాలా అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. పోటీ వాతావరణాన్ని యువత ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడానికి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 39 ఏళ్లకే తనువు చాలించిన వివేకానంద ఆచరించిన ధర్మం, నిజాయతీ, నిబద్ధత నేటికి చెక్కు చెదరలేదంటే ఆయన సంకల్పం ఎలాంటిదో ఊహించుకోవచ్చున్నారు. స్వార్థం, ద్వేషాన్ని వదిలి నిస్వార్థంగా పని చేసినవారు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. మన మతాన్ని గౌరవిస్తూనే అన్య మతాల్లోని మంచిని ఆస్వాదించాలని సూచించారు. కులమతాలనే అడ్డుగోడలను తొలగించుకుని 'ఒకే జాతి.. ఒకే దేశం' అన్న నినాదంతో ముందుకు సాగినపుడే దేశం అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు.

ధాన్యం సేకరణలో తెలంగాణ విధానం బాగుంది

- కేంద్ర ఆహార- ప్రజాపంపిణీ శాఖ కార్యదర్శి ప్రశంస

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ధాన్యం సేకరణకు సంబంధించి తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల... రైతులకు నేరుగా కనీస మద్దతు ధర లభిస్తోందని కేంద్ర ఆహార- ప్రజాపంపిణీ శాఖ కార్యదర్శి రవికాంత్ అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ధాన్యం డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమచేయడంతో పాటు ఐరిస్, బయో మెట్రిక్ వంటి తెలంగాణ పద్ధతులూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయన్నారు. ప్రజాపంపిణీ, ధాన్యం సేకరణ విధానాలను పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన ఆయన శనివారం హైదరాబాద్‌లో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఖరీఫ్‌లో తెలంగాణ పౌరసరఫరాల శాఖ 208 శాతం అధికంగా ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులు, సకాలంలో వర్షాలు, 24 గంటల విద్యుత్తు, రైతుబంధు వంటి పథకాల అమలుతో ధాన్యం దిగుబడి పెరిగిందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే 38లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన మార్కెట్ రుసుం, ఆర్‌డీ సెస్ కమీషన్, ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిన బకాయిలనూ వెంటనే విడుదల చేయాలని కోరారు. గత పదినెలల్లో 1,13,74,658 పోర్టబిలిటీ (ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకోవడం) వంటి లావాదేవీలు జరిగాయని రవికాంత్ దృష్టికి తెచ్చారు. 16 జిల్లాల్లోని 5186 రేషన్ దుకాణాల్లో ఐరిస్ పద్ధతి అమలుచేస్తున్నామని, త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు. అనంతరం ఖమ్మం, కొత్తగూడెం, సిద్దిపేట, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లా రైతులతో వీడియోకాల్ ద్వారా రవికాంత్ మాట్లాడారు. మద్దతు ధర లభిస్తోందా, కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయా, ధాన్యం విక్రయించాక ఎన్ని రోజులకు డబ్బులు వస్తున్నాయి, ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు.



వీడియో కాల్‌లో ఓ రైతుతో మాట్లాడుతున్న రవికాంత్. పక్కనే అకున్ సబర్వాల్

ముగ్గురు ఎమ్మెల్సీలపై ముగిసిన విచారణ

రిజర్వ్‌లో మండలి ఛైర్మన్ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెరాస నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని తెలంగాణ రాష్ట్ర సమితి చేసిన ఫిర్యాదుపై శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ నిర్వహించిన విచారణ శనివారం ముగిసింది. ఇరుపక్షాల వాదనలు పూర్తవడంతో స్వామిగౌడ్ తన నిర్ణయాన్ని రిజర్వ్‌లో పెట్టారు. తెరాసకు చెందిన నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, అదే పార్టీ తరఫున శాసనసభ్యుల కోటా, గవర్నర్ కోటాలో నియమితులైన యాదవరెడ్డి, రాములునాయక్‌లు ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై చర్య తీసుకోవాలని తెరాస శాసనమండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేసింది. దీనిపై స్వామిగౌడ్ వారి సంజాయిషీ కోరుతూ నోటీసులు ఇచ్చారు. వాటికి సమాధానం వచ్చిన తర్వాత విచారణ చేపట్టారు. శుక్రవారం రాములునాయక్, భూపతిరెడ్డిలపై.. శనివారం యాదవరెడ్డిపై విచారణ నిర్వహించారు. యాదవరెడ్డి తరఫున, మరోవైపు తెరాస తరఫున వారి న్యాయవాదులు హాజరై వాదనలు వినిపించారు. ఆధారాలు సమర్పించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం మండలి ఛైర్మన్ తమ నిర్ణయాన్ని రిజర్వ్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన దాన్ని వెలువరిస్తారని భావిస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆధారాలు సమర్పించామని తెరాస విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు చెప్పారు. చట్టప్రకారం వారిపై అనర్హత వేటు పడుతుందనే భావిస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదు

ఎల్బీనగర్, పాలేరు ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి

హైదరాబాద్, కూసుమంచి, న్యూస్‌టుడే: తాము తెరాసలో చేరబోతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. వారిద్దరూ శనివారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కావాలనే అధికార పార్టీ తెరాస మైండ్ గేమ్ ఆడుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ శాసనసభ్యులపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. కాంగ్రెస్‌లో 1984 నుంచి పని చేస్తున్నానని, పార్టీలో తనకు సముచిత స్థానం, గౌరవం దక్కాయని సుధీర్‌రెడ్డి వివరించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా అంటిపెట్టుకునే ఉన్నానని, ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నానని గుర్తు చేస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెను వీడేది లేదని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బ తీయాలనే ఉద్దేశంతో తెరాస ఆడుతున్న నాటకం ఇదని ఉపేందర్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ మారుతున్న విషయాన్ని తాను గతంలోనే ఖండించినప్పటికీ ఇలాంటి అసత్య ప్రచారాలతో తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నిస్తే సహించేది లేదన్నారు.

రజత్ కుమార్ ఆస్తులపై విచారణ జరిపించాలి

కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం: కోదండరాం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) రజత్‌కుమార్ ఆస్తులపై విచారణ చేయించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తీరుపై పలు అనుమానాలున్నాయని వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఎన్నికలకు ముందే సీఈవోపై కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని తెజస రాష్ట్ర కార్యాలయంలో శనివారం కోదండరాం విలేకరులతో ముచ్చటించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీకి దిగాలా? వద్దా? అనే విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ అంశాన్ని పార్టీలోనూ చర్చించలేదని చెప్పారు. దీనిపై కాంగ్రెస్ తీసుకునే నిర్ణయాన్ని బట్టి స్పందిస్తామన్నారు. సర్పంచులకు శిక్షణ మాత్రమే ఇస్తే సరిపోదని, పంచాయతీలకు నిధులు, విధులు కావాలన్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలతో చర్చిస్తున్నామని.. జాతీయ రాజకీయాల్లో మార్పుకోసం తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఓటమితో నిరాశ లేదన్నారు. తమ పార్టీని ఇతర పార్టీల్లో విలీనం చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈబీసీ కోటా ఆహ్వానించదగిన పరిణామమే అయినా.. రాజ్యాంగ కూర్పునకు నష్టం కలిగించేలా ఉండకూడదన్నారు. ఏపీ ఎన్నికల్లో జోక్యం చేసుకోవాలనే ఉత్సాహం లేదని, అక్కడున్న మిత్రులతో తన ఆలోచనలు పంచుకుంటానని చెప్పారు.

మన మామిడికి 'కాకతీయ' బ్రాండ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పండుతున్న మామిడి కాయలను 'కాకతీయ' బ్రాండ్ పేరుతో విదేశాలకు ఎగుమతి చేయాలని ఉద్యానశాఖ తాజాగా నిర్ణయించింది. మరో మూడు నెలల్లో మార్కెట్‌కు వచ్చే మామిడి కాయలను ఎగుమతి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కార్బైడ్ వాడకుండా శాస్త్రీయంగా ఇథిలిన్ వాయువుతోనే మామిడికాయలను మాగబెట్టి ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బ్రిటన్, కొరియా, జపాన్, అరబ్ దేశాలకు ఎగుమతి చేయాలనేది యోచన. ఉత్తరాది రాష్ట్రాలకు సైతం పెద్దఎత్తున పంపాలని యోచిస్తోంది. గతేడాది దిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మామిడిపండ్ల విక్రయ కేంద్రానికి భారీ స్పందన వచ్చింది. కార్బైడ్ లేకుండా మాగబెట్టిన పండ్లను విక్రయిస్తామని ఉద్యానశాఖ చేసిన ప్రచారంతో పలు ప్రాంతాల నుంచి కొనుగోలుకు వ్యాపారులు ముందుకొస్తున్నారు. కాయలను మాగబెట్టి విదేశాలకు పంపేందుకు అనువుగా ఉండేలా రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో ప్యాక్‌హౌస్ సిద్ధమవుతోంది. దీనిని మామిడి పండ్ల ఎగుమతులకు వినియోగించాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. ఈ శాఖ ధ్రువీకరించి ఎగుమతి చేసేవాటికి కాకతీయ బ్రాండ్ వినియోగిస్తారు.

ఎగుమతి విధానంతో..

దేశంలో పండే వ్యవసాయోత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మేందుకు కేంద్రం నూతన ఎగుమతి విధానాన్ని తెచ్చింది. దీనిపై కేంద్ర వాణిజ్యశాఖ ఇటీవల దిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సుకు తెలంగాణ ఉద్యాన అధికారులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ పంటల ఎగుమతులకు గల అవకాశాలపై చర్చించారు. పండ్లతోటల సాగులో రికార్డులు సృష్టిస్తున్నామని చెప్పుకుంటున్నా, విదేశాల నుంచి ఏటా రూ.18వేల కోట్ల విలువైన పండ్లను ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామనే దానిపై చర్చ జరిగింది. ఈ పండ్లను ఇక్కడే పండిస్తే ఈ సొమ్ము అంతా మన రైతులకే చేరుతుందని వాణిజ్యశాఖ సూచించింది. తెలంగాణలో పండే మామిడి, జామ, ద్రాక్షలకు మంచి మార్కెట్ ఉందని వీటిని ప్రోత్సహించాలని తెలిపింది. తెలంగాణ వాతావరణం కూరగాయల సాగుకు అనుకూలంగా ఉందని పేర్కొంది. అరబ్ దేశాల్లో కూరగాయలకు భారీ డిమాండు ఉందని తెలిపింది. హైదరాబాద్ నుంచి ఐదారు గంటల్లో పలు దేశాలకు కూరగాయలు, పండ్లు పంపడానికి రవాణా, మౌలిక సదుపాయాలన్నాయని వివరించింది. అంతర్జాతీయ మార్కెట్‌కు పంపేందుకు అనువుగా వాటి శుద్ధి, నిల్వ సదుపాయాలు పెంచితే సరిపోతుందని వాణిజ్యశాఖ తెలిపింది.



శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ప్యాక్‌హౌస్

రసాయన అవశేషాలే సమస్య

పంటలను విదేశాలకు ఎగుమతి చేయాలంటే రసాయన అవశేషాలు, శుద్ధి విషయంలో నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని వాణిజ్యశాఖ తెలిపింది. సేంద్రీయ విధానంలో సాగుచేస్తే భారీ డిమాండు, బోలెడు వ్యాపార అవకాశాలున్నాయి. రసాయన అవశేషాలుంటే విదేశాలు మన పండ్లను కొనవని రైతులూ గుర్తించాలి. సమస్యను అధిగమించేందుకు రైతుల్లో అవగాహన కల్పిస్తాం. కాకతీయ బ్రాండు పేరుతో ఎగుమతులు భారీగా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తాం. వచ్చే ఏప్రిల్‌లో మామిడి పండ్లతో మా ప్రయత్నాలు కార్యరూపం దాల్చుతాయి. హిమాయత్, బంగినపల్లి తదితర రకాల మామిడి పండ్లు కావాలని పలు వ్యాపార సంస్థలు అడుగుతున్నాయి.

–వెంకట్రాంరెడ్డి, సంచాలకుడు, ఉద్యానశాఖ, తెలంగాణ

ఒప్పుకో...తప్పుకో...

- 'పంచాయతీ'లో నేతల బుజ్జగింపులు
- వెనక్కు తగ్గాలంటూ పలురకాల ఒత్తిళ్లు
- తొలి విడత 'ఉపసంహరణలు' నేడే

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ బరిలో నిలిచేందుకు ఆశావహులు చేయని ప్రయత్నమంటూ లేదు. కొందరు రూ.లక్షలు ఎరవేసి ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తే, నామినేషన్లు వేయకుండా ప్రత్యర్థులను మరికొందరు అడ్డుకున్నారు. ఎమ్మెల్యేలు, ఇతర నాయకులతో ఒత్తిడి తెచ్చి ఇంకొందరు సఫలమయ్యారు. పోరులో నిలిచిన వారు వెనక్కు తగ్గాలంటే, ఆదివారం ఒక్కటే మిగిలి ఉంది. దీంతో ఎన్నోరకాల వ్యవహారాలు సాగుతున్నాయి. గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో పోటీచేసే అర్హుల జాబితాలు ఆదివారం సాయంత్రానికి ఖరారు కానున్నాయి. నామపత్రాలు ఉపసంహరించుకునే అవకాశం ఆ లోపే ఉంది.

మెదక్ జిల్లాలో ఓ మండలంలోని పంచాయతీకి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం కోసం, ఒక వ్యక్తి రెండెకరాల పొలాన్ని రాసిచ్చారు. తీరా నామినేషన్ల రోజు ఓ వ్యక్తి పోటీకి రావడంతో, కథ అడ్డం తిరిగింది. ఇప్పటికీ మంతనాలు కొనసాగుతున్నాయి. వరంగల్ గ్రామీణ జిల్లా సంగెం మండలంలోని గవిచర్ల గ్రామంలో చివరి రోజు ఓ వ్యక్తి నామినేషన్ పత్రాలు సమర్పించకుండా కొందరు దాడి చేశారు. సదరు బాధితుడు న్యాయపోరాటం చేస్తున్నారు. ఇదే జిల్లాలో పలుచోట్ల నామినేషన్ల ఉపసంహరణకు అనేక ఒత్తిళ్లు వస్తున్నాయి.

తొలి విడతలో 4,468 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటికి దాఖలైన 39,616 నామినేషన్లలో ...పలుచోట్ల పదుల సంఖ్యలో పోటీదారులు ఉన్నారు. తెరాస, కాంగ్రెస్ పార్టీలకు చెందినవారు ఎన్నో చోట్ల పోటీపడుతున్నారు. బుజ్జగించేందుకు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకులు రంగంలోకి దిగారు. సంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ శాసనసభ్యుడు జగ్గారెడ్డి సమావేశాలు ఏర్పాటుచేసి, పార్టీకి చెందినవారిని బుజ్జగించే ప్రయత్నాలు సాగించారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో వివిధ చోట్ల తెరాస ఎమ్మెల్యేలు కూడా ఎక్కువ సంఖ్యలో పోటీలో ఉన్నవారిని పిలిపించి మాట్లాడినట్లు తెలిసింది.

టెండర్డు ఓటుతో చెమటలు

- అది ఎక్కడ పడితే అక్కడ మళ్లీ పోలింగ్
- పంచాయతీ ఎన్నికల్లో కఠిన నిబంధన
- ఒకరి ఓటును వేరొకరు వేయకుండా చర్యలు

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల బరిలో నిలుస్తున్న అభ్యర్థులను ఇప్పుడు టెండర్డు ఓటు చెమటలు పట్టిస్తోంది. తన ఓటును వేరొకరు వేసేశారంటూ ఎవరైనా ముందుకొచ్చి టెండర్డు ఓటును కనుక వేసినట్లయితే.. అక్కడ తిరిగి పోలింగ్‌ను నిర్వహించే పరిస్థితి ఏర్పడబోతోంది. నకిలీ ఓటర్ల బెడదను తప్పించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ).. ఇప్పుడు టెండర్డు ఓటుకు ప్రాధాన్యం ఇవ్వదలచింది. నిజమైన ఓటరు పోలింగ్ కేంద్రానికి వెళ్లేసరికే అతని ఓటును వేరొకరు వేసే దృష్టాంతాలు కొన్ని ప్రాంతాల్లో చోటు చేసుకొంటూనే ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో నిజమైన ఓటర్లు నిరాశతో వెనుతిరుగుతుంటారు. వారికి 'టెండర్డు' అనే పేరుతో గల ఓటును వేసే అవకాశం ఉన్నప్పటికీ ఓట్ల లెక్కింపు సమయంలో దానిని పరిగణనలోకి తీసుకోరు. కనుక వాటిపై ఓటర్లకు ఆసక్తి ఉండదు. టెండర్డు ఓటు గురించి విస్తృత ప్రచారం కల్పించాలంటూ ఎన్నికల సంఘం జిల్లాల ఎన్నికల అధికారుల (కలెక్టర్ల)కు ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ అవెక్కడా అమలుకు నోచుకోలేదు. కానీ ఎన్నికల సంఘం తాజా నిర్ణయంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడనుంది.


0.1 శాతం టెండర్డు ఓట్లు పడ్డా లెక్కింపు నిలుపుదల

ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో ఏదైనా పోలింగ్ కేంద్రంలో మొత్తం పోలైన ఓట్లలో టెండర్డు ఓట్లు 0.1 శాతం కంటే ఎక్కువగా కనుక ఉంటే అక్కడి ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిలిచిపోనుంది. ఎస్ఈసీ తాజా మార్గదర్శకాల ప్రకారం.. పోలింగ్ అంతా అయ్యాక.. టెండర్డు ఓట్ల విషయాన్ని అక్కడి అధికారులు జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ఎస్ఈసీకి తెలియజేస్తారు. ఎస్ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు అందేంత వరకు అక్కడి బ్యాలెట్ పెట్టెలను తెరవడం, ఓట్లను లెక్కించడం చేయకూడదు. జిల్లా ఎన్నికల అధికారి నివేదికను ఎస్ఈసీ పరిశీలించి.. అవసరమనుకుంటే మరింత సమాచారాన్ని రాబట్టి.. తిరిగి పోలింగ్‌ను నిర్వహించాల్సిందిగా ఆదేశాలు ఇవ్వొచ్చు.

సర్పంచిగా పోటీ చేయాలని భర్త ఒత్తిడి

- ఆపై రూ.ఐదు లక్షలు తేవాలని వేధింపులు
- వివాహిత బలవన్మరణం

డిండి, న్యూస్‌టుడే: సర్పంచిగా పోటీ చేయాలంటూ ఒత్తిడి చేయడంతోపాటు రూ.5 లక్షలు తీసుకురావాలని భర్త వేధించడంతో భార్య బలవన్మరణానికి పాల్పడిన ఘటన నల్గొండ జిల్లా డిండి మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. నిజాంనగర్‌కు చెందిన భైరాపురం మీనయ్య-శారద దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమార్తె రాధ(22)ను అదే మండలం ఎర్రగుంటపల్లికి చెందిన జంతుక లింగమయ్యకి ఇచ్చి ఎనిమిది నెలల కిందట వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో ఒప్పుకున్న ద్విచక్ర వాహనం కోసం రాధను భర్త లింగమయ్య తరచూ వేధింపులకు గురిచేసే వాడు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎర్రగుంటపల్లి సర్పంచి పదవిని ఎస్సీ మహిళకు కేటాయించారు. దీంతో సర్పంచిగా పోటీ చేయాలంటూ రాధను ఆమె భర్త ఒత్తిడి చేయడమే కాకుండా రూ.5 లక్షలు తీసుకురావాలని వేధిస్తున్నాడు. ఆమె ఈ నెల 6న నిజాంనగర్‌లో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వేధింపుల విషయాన్ని వివరించినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం పుట్టింట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రాధను దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.



రాధ

మరో 500 బడులకు మాట్లాడే పుస్తకాలు

ఈనాడు, హైదరాబాద్: పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేలా రూపొందించిన మాట్లాడే పుస్తకాలు (టాకింగ్ బుక్స్) మరో 500 పాఠశాలలకు అందనున్నాయి. తాజాగా యూనిసెఫ్ అధికారులు ఈ పుస్తకాలను జిల్లాల విద్యాశాఖ అధికారులకు సరఫరా చేశారు. వీటిని యూనిసెఫ్, సమగ్ర శిక్షాఅభియాన్ సంయుక్తంగా రూపొందించాయి. విద్యార్థులు బడులకు వచ్చేలా ప్రోత్సహించాలని, పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు వినూత్న మార్గాలను అవలంబించాలని భావించిన విద్యాశాఖ యూనిసెఫ్ సాయంతో గత విద్యా సంవత్సరం 150 పాఠశాలలకు మాట్లాడే పుస్తకాలను పంపిణీ చేసింది. కథలు, చరిత్ర, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణం, బాల కార్మిక వ్యవస్థ తదితర 10 అంశాలపై పుస్తకాలను తెలుగు, ఆంగ్లం మాధ్యమంలో తయారు చేశారు.

ఈనాడు

ఆత్మీయ సంక్రాంతి!

'పండుగ చేస్కో' అనేది తెలుగునాట ఒక ఊతపదం. సంబరం, వేడుక వంటి సందర్భాలకు సరితూగే మాట అది. బతుకులో తీపిదనాన్ని ఆవిష్కరించే సాంస్కృతిక చిహ్నాలు పండుగలు. అటు ఆధ్యాత్మికపరమైన ఆచార సంప్రదాయాలకు ఇటు మనసులో ఉల్లాసానికి ఎంతో ఊతమిచ్చే ఉత్సాహపూరితమైన కలయికలకు నెలవులు పండుగలు. 'పండువులు వచ్చునన్న శబ్దము విన్న పగలగొట్టిన గుమ్మడి పండుమసి చెదరిపడిన గింజలు ప్రోగు చేసికొనెడి ఆయాసొకడు వచ్చి మనసును ఆశ్వాస పరచు' అన్నారు మహాకవి మధునాపంతుల. మనసును బాల్యం ఆవరించడం మనిషికి ఆనందదాయకం- ఎందుకంటే అది మనిషి చేజార్చుకొన్న అమూల్యమైన నిధి కనుక! అలా పోగొట్టుకొన్న ఎన్నింటినో వెతుక్కోవడానికే మనిషి పండుగ నెపంతో పల్లెటూళ్ల ప్రయాణం కడతాడు. 'మనసునే వాక్కుచేత కర్మంబు చేత కలుషితములు కాదగనట్టి తల్లిదేవులతో' పోల్చి పల్లెసీమలను కవులు అభివర్ణిస్తారు. పండుగలకు పల్లెటూళ్లే పరమాద్భుత వేదికలు. నగరాల్లోంచి సగానికి సగం జనాభా ఇళ్లకు తాళాలేసి పల్లెబాట పట్టడాన్ని మనం ఈ కోణంలోంచే అర్థం చేసుకోవాలి. 'వినుము ధనములు రెండు తెరగులు... ఒకటి మట్టిన పుట్టినది, వేరొకటి హృత్ కమలంపు సౌరభము' అన్నారు గురజాడ. ఆ రెండు రకాల ధనాలు ఒక్కచోట జత పడితే అది స్వర్గసీమ అవుతుందని చెప్పారు. ఆ రెండింటికీ ఆస్కారం కల్పించేవి పల్లెటూళ్లే! మట్టినుంచి పుట్టే ధనం అంటే- పంట ధాన్యాలు. 'తెలుగు మన్నులో రాయప్రోలు 'సస్యరమ' అంటూ వర్ణించింది ఆ సస్య సంపదనే. ఆయన చెప్పినట్లు 'ఇంపు లిగిర్చి ఫలించినట్టి ఉద్యానము పోల్కి, సస్యరమ ఆడెడి వేదికలు' అన్నట్టుగా మన గ్రామసీమలే గుర్తొస్తాయి... పాడిపంటలకు మన పల్లెలు అనువైన స్థావరాలు కనుక!

పల్లెటూళ్లలో అడుగు పెట్టగానే పేర్లతోనో హోదాలతోనో కాక, తియ్యని వరసలతో పరిమళించే పలకరింపులు చెవిన పడ్డప్పుడు, అలాగే గుమ్మంలోకి అడుగుపెట్టగానే 'బాగున్నావా' అంటూ బోసి నోళ్ల విశాలంగా నవ్వి ఆప్యాయతను వర్షించినప్పుడు- గురజాడ చెప్పిన రెండో ధనం- హృదయకమల సౌరభం మనల్ని ఆలింగనం చేసుకుంటుంది. 'ఏరోయ్' అంటూ ఏకవచనం భుజం తట్టగానే గుబాళించే నేవళింపు స్నేహ మాధుర్యం సరేసరి. 'కలసినయంత మాత్రమున కాదు సుమీ చెలికారము! అంతరంగాలను అనుకుంత జాలిన అపూర్వలంకెయౌ స్నేహమౌను' అంటూ భావకవులు వేనోళ్ల కొనియాడిన అరమరికల్లేని బాల్య స్నేహపు పరమానందం పురివిప్పుకొని మట్టి వాసనలు వెదజల్లుతుంది. 'చేతస్సుషమ'లో ఆవంత్స సోమసుందర్ కవి వర్ణించిన 'చిరకాలమున మునుపు వార్థుక్యబ్రాము రీతి నటిపార్డుల సాగరము నర్తించె హర్షమున' అన్న అపూర్వ భావం అనుభూతం అవుతుంది. కనీసం ఏడాదికోసారి ఆ అనుభూతికి జీవం పోయడానికే మనం పల్లెలకు ఆసక్తిగా పరుగులు పెడతాం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే శుభఘడియల్లో 'హేమంత వేళ నూతన సీమంతపు వధువు వోలె సింగారమూగ' సంక్రాంతి విచ్చేస్తుందని చెబుతారుగాని- మనిషి తనతో తాను సంగమించే అపురూప క్షణాలను, బాల్యమిత్ర మధుర సమాగమాలను, బంధుజన సంభ్రమాలను మనం సంక్రాంతిగానే చెప్పుకోవచ్చు. ఊరుమ్మడి బతుకుల కమ్మని కలయికలే సంక్రమణలు. 'నా అనుగు సఖా! చెలిమి నాటిన చిత్తమే ఆర్ద్రము... అందు ఆశాయతరంజనంబయి ప్రియం బెన యుండిన ఆ దశలే...' చేజారి మిత్రులు చెల్లాచెదురైన కారణంగా 'విడదీసిన రేకలపూవు చందమై పోయిన మైత్రిలో తిరిగి నిండుదనాన్ని నింపడమే నిజమైన సంక్రాంతి. మనుషులను కలుసుకోవడం, కలుపుకుపోవడంలోనే సంక్రాంతి పరమార్థం ఇమిడి ఉంది. పండుగ అనే మాటకు నిజమైన అర్థం అదే!

బంధుమిత్ర సమాగమాలను సంక్రాంతులుగా చెప్పుకోవడానికి వీలుగా పురాణాలు బలమైన ఒక ఆధారం చూపించాయి. 'కరి సరసిజ ముకుళము ఎత్తుగతి'... ఏనుగు తామరతూడును లేపినట్లుగా కృష్ణుడు 'ఆ మహా శైలంబున్ వలకేల దాల్చి విపుల చ్ఛత్రంబుగా పట్టెన్'... గోవర్ధనగిరిని గొడుగులా ఎత్తి పట్టుకున్నది సంక్రాంతి రోజుల్లోనే కనుమనాడేనని పురాణాలు చెబుతున్నాయి. 'రా తల్లీ! రమ్ము తండ్రీ! వ్రేతలు గోపకులు రండు, వినుడీ కర్తవ్యతామమున నుండుడు- గోవ్రాతముతో మీరు' అంటూ అందరినీ చేరపిలిచాడు. ఒకచోటుకు చేర్చాడు. వారిని ఒక్కటి చేశాడు. '...గోపాలాంగనాపాంగ హాస రుచుల్ రత్న చయంబు కాగ అచల చ్ఛత్రంబు (కొండ గొడుగు) శోభిల్లె' అని భాగవతం దశమస్కంధం వర్ణించింది. సూక్ష్మంగా ఆలోచిస్తే ఏటా మకర సంక్రాంతి చేస్తున్న పని అచ్చంగా అదే! మనుషులను కలుపుతోంది. సంక్రాంతి మనుషులను అతుకుతోంది. ఎక్కడెక్కడో ఏవేవో రంగాల్లో స్థిరపడిన నాగరికులకు 'మంజీర మణిరాజ పుంజాగత స్వచ్ఛ శింజాన మాధుర్య మంజిమములు, వేదాంత సంగీత విన్యాస మొకవంక, నొకవంక తాళంబులుల్లసిలగ...' రకరకాల వృత్తులతో బతుకులీడ్చే జానపదులు వీనుల విందులు చేస్తూ ఆనందాల్ని పంచే అందమైన ఘట్టాలను సంక్రాంతి పండుగ మన పల్లెల్లో నిండుగా ఆవిష్కరిస్తుంది. మానవ జీవితపు మహా సంరంభాలన్నింటినీ మనోహరంగా ప్రదర్శించి, మనలో బెంగను రేకెత్తిస్తుంది. నిజానికివన్నీ మనిషికి మహాభాగ్యాలు. 'కదిలి వచ్చెను భాగ్యాలకడలివోలె మకర సంక్రాంతిలక్ష్మి హేమంతవీధి' అని తుమ్మలవారు చెప్పింది ఆ సిరిసంపదల గురించే. ఊరికే అన్నాడా శ్రీనాథ కవిసార్వభౌముడు సంక్రాంతిని 'పెద్ద పండుగ' అని!



సేద్యం పండుగ అయ్యేదెప్పుడు?

పాడి పంటలతో సుసంపన్నం కావాల్సిన గ్రామసీమలు నేడు గత వైభవ చిహ్నాలుగా మిగులుతున్నాయి. రైతుల ఇంట పాడి వట్టిపోతోంది. నష్టాలతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారు. సేద్య సంస్కరణలు రైతులకు మేలు చేస్తున్న దాఖలాలు లేవు. వ్యవసాయం దండుగ కాదు పండుగ అని నిరూపించే స్థాయికి పాలకులు ఎదగలేదు. పై పూతలతో తాత్కాలిక ఉపశమనం కల్పిస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారాలు చూపడం లేదు. మట్టిని నమ్ముకున్న రైతులు ఆ మట్టిలోనే కలిసిపోతుంటే వారికి చేదోడు వాదోడుగా ఉండాల్సిన వ్యవస్థలన్నీ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేద్య రంగానికి తమ పరిధిలో చేయూత ఇవ్వగలిగితేనే సాగుదారులకు మనుగడ.

కళ తప్పిన గ్రామాలు

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా సగర్వంగా సేద్యం చేసే పరిస్థితులు లేవు. అప్పులు చేసైనా పిల్లలకు మంచి చదువులు చెప్పించాలని రైతులు భావిస్తున్నారే తప్ప తమలాగా సేద్యం చేయాలని కోరుకోవడం లేదు. అధికార యంత్రాంగంలో అవినీతి, ఉత్పాదకాల సరఫరాలో మోసాలు, సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం, గిట్టుబాటు కాని మద్దతు ధరలు, విపణి శక్తుల మోసాలు, సహకరించని ప్రకృతి- వెరసి... సాగుదారులకు వ్యవసాయంపై భరోసా లేకుండా చేస్తున్నాయి. ఈ పరిస్థితులన్నీ రైతుబిడ్డలకు సహజంగానే ఇబ్బందిగా మారుతున్నాయి. సేద్యం గిట్టుబాటు కాకపోతుండటంతో చదువుకుని ఉద్యోగాలు చేసుకోవడానికే అధిక శాతం రైతుబిడ్డలు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందుకు రైతులు ఎంత కష్టానికైనా వెనకాడటం లేదు. నేడు నూటికి 90 శాతం రైతుబిడ్డలు ఉద్యోగాలకు వెళ్లిపోతుంటే కేవలం 10 శాతం మాత్రమే వ్యవసాయం చేస్తున్నారని ఒక అంచనా. ఫలితంగా గ్రామాల్లో వ్యవసాయం చేతులు మారుతోంది. కమతాల పరిమాణం మరింత తగ్గిపోతోంది. వారసత్వపు విభజన, కూలీనాలీ చేసుకునేవారు కొత్తగా సేద్యంలోకి దిగుతుండటం వల్ల చిన్న కమతాలు అధికమవుతున్నాయి. ఈ పోకడలు నేలల స్థితిగతుల్నీ నాశనం చేస్తున్నాయి. ఏటా ఖరీఫ్‌కు ముందు సొంత భూమికి పశువుల ఎరువు తోలే రైతుల స్థానే కౌలుదారులు రంగప్రవేశం చేశారు. నేల నుంచి తీసుకోవడమే కానీ నేలకు అందించే అలవాటు తగ్గి భూసారం క్షీణిస్తోంది. ఈ పోకడ దీర్ఘకాలంలో పంటల ఉత్పత్తి, ఉత్పాదకతను ప్రభావితం చేయనుంది. నేడు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు సగానికి పైగా భూమిని కౌలుదారులే సాగు చేస్తున్నారు. మొత్తంగా గ్రామాల్లో 90 శాతం వ్యవసాయదారుల్ని నష్టభయం వెంటాడుతోంది. గ్రామాల్లో పంటే కాదు, పాడి సైతం కనుమరుగవుతోంది. పాడిపంటలతో విలసిల్లాల్సిన గ్రామసీమలు వెలాతెలాపోతున్నాయి. ఇవి రెండూ జోడు గుర్రాల్లా స్వారీ చేసినంత కాలం రైతులింట డబ్బులకు కొదవ లేకుండేది. నేడు ప్రతిదానికీ రైతులు వెతుక్కోవాల్సి వస్తోంది. తరచుగా చేయి చాచాల్సి వస్తోంది. ఈ పరిణామాలన్నింటికీ మూలం- పాడి నిరాదరణకు గురికావడం, పంటల సాగు కలిసిరాకపోవడమే. పశుపోషణ నుంచి తప్పుకొని ఎందరో రైతులు పాలు సైతం కొనుక్కోవలసి వస్తోంది. ఈ పరిణామాలు గ్రామీణ ముఖచిత్రాన్ని మార్చేస్తున్నాయి.

ఒకప్పుడు సంక్రాంతి వస్తోందంటే గ్రామసీమల్లో ఉండే కళే వేరు. ధాన్యపు రాశులు ఇంటికి చేరి అలికిన ముంగిళ్లతో పల్లెలు కొత్త శోభను సంతరించుకునేవి. నేడా పరిస్థితులు లేవు. ఇంటికి చేరాల్సిన ధాన్యం కళ్లాల్లోనే అప్పుల కింద జమ అవుతోంది. మమతలు పంచాల్సిన పల్లెలు అర్థంలేని పగలతో రగిలిపోతున్నాయి. అనుచిత రాజకీయాల ప్రవేశంతో రైతుల్లో ఐక్యత చెడింది. వారి మధ్య అగాధం పెరిగిపోతోంది. ఒకప్పుడున్న సహకార ధోరణి నేడు లేదు.

సంస్కరణలతోనే పల్లెల్లో వెలుగులు

అన్నదాతల ఇబ్బందులను అర్థం చేసుకుని విధాన నిర్ణయాలు తీసుకునే సందర్భాల్లో కనీసం రైతులకు మేలుచేసే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. సాగుదారుల మేలు కోసం ఏవేవో చేస్తున్నామనే భ్రమలు కల్పించడం తప్ప- శాశ్వత ప్రాతిపదికన వారి కష్టాలు తీర్చే తరుణోపాయాలపై దృష్టి సారించడం లేదు. పైపై పూతలతో సేద్యానికి ఉపశమనం కల్పించడమే తప్ప రైతులు సగర్వంగా తలెత్తుకునే పరిస్థితులు కల్పించడం లేదు. పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న చేయూతతో పోలిస్తే రైతులకు చేస్తున్నది స్వల్పమే. వేల కోట్ల రూపాయల మేర ప్రజల డిపాజిట్లను కొల్లగొట్టి అవినీతి పరులైన పలువురు పారిశ్రామికవేత్తలు దేశాలు దాటిపోతున్నా పట్టించుకోని యంత్రాంగం పదివేల రూపాయలు బాకీపడిన రైతుల్ని మాత్రం వేధింపులకు గురిచేస్తోంది. ఇటువంటి అపసవ్య పోకడలతో సేద్యరంగాన్ని నిర్వీర్యం చేసి చివరకు రైతులు వాళ్లంతటవాళ్లే వ్యవసాయం నుంచి వైదొలగే పరిస్థితులు కల్పిస్తున్నారు. రైతు తనకు అన్నీ ఉచితంగా కావాలని కోరుకోవడం లేదు. రైతుల దీనస్థితికి కారణాలేమిటో అన్వేషించేందుకు ఎన్నో కమిటీలను నియమించినా వాటి సూచనలు అమలుకు నోచుకోవడం లేదు. వ్యవస్థాగతంగా సాగుదారులను పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటే రైతులకు ఏవీ ఉచితంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇన్నేళ్లుగా ఇవన్నీ విస్మరించి పరిస్థితిని దుర్భరం చేశారు.

వ్యవసాయాన్ని, ఆ రంగంపై ఆధారపడిన రైతు కుటుంబాల ప్రగతిని పట్టించుకోవాలి. పల్లె సంక్షేమానికి ఊపిరులూదాల్సిన తరుణమిది. గ్రామాల ఆర్థిక పరిపుష్టికి వ్యవసాయమే మూలాధారం. రైతు బాగుంటేనే పల్లెలు పచ్చగా ఉంటాయి. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెచ్చరిల్లాక చాలా వరకు వాటి ఉనికి ప్రశ్నార్థకమైంది. ఒకప్పుడు ఎంతో ఘనంగా వెలుగొందిన ఈ సంఘాలు నేడు నామమాత్రమయ్యాయి. ఇప్పటికీ కొన్ని సంఘాలు విశేష ఫలితాలను సాధిస్తున్నా అవి క్రియాశీలకంగా వ్యవహరించలేకపోతున్నాయి.

ఈ తరుణంలో పంటలవారీగా ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాల్సిన అవసరముంది. ప్రభుత్వం వీటిని ప్రోత్సహించడంతో పాటు ఆర్థికంగా పరిపుష్టినిచ్చి రాజకీయ జోక్యం లేకుండా చేయగలిగితే సత్ఫలితాలు లభిస్తాయి. పంటకు నిల్వ సదుపాయాలు కల్పించాలి. కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి. చదువుకున్న గ్రామీణ యువతకు శిక్షణ ఇస్తే వ్యవసాయాధారిత రంగం ఊపందుకుంటుంది. వ్యవసాయోత్పత్తికి విలువ పెంచే ఉత్పత్తుల తయారీని యువతరంతో పాటు మహిళలు చేపడితే విపణి పరిధి విస్తరిస్తుంది. గ్రామాలకు దూరంగా ఉద్యోగాలు చేసుకుంటున్న రైతుబిడ్డలు సైతం వ్యవసాయం తప్ప మరో వ్యాపకం తెలియని తమ పెద్దలకు చేయూత ఇవ్వాల్సిన అవసరముంది. గ్రామాల్లో అవగాహన లోపంతో మోసపోతున్న రైతులకు అండగా నిలవాల్సి ఉంది. ఎవరి ఉద్యోగాలు వాళ్లు చేసుకుంటూనే ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని తమ పరిధిలో పెద్దలకు అండగా ఉంటూ వ్యవసాయంలో సరికొత్త పద్ధతులతో పాటు నైపుణ్యాలను పెంచుకునే ఉపాయాలను రైతులకు పరిచయం చేయాలి. రైతులు మార్కెట్ నైపుణ్యాన్ని అందిపుచ్చుకొంటే కొద్దిపాటి శ్రమతోనే లాభశాతాన్ని పెంచుకోవచ్చు.

రైతుల్ని ఆదుకుందాం!

భూమి రైతుల బతుకులతో పెనవేసుకున్న బంధమని, అదొక జీవన విధానమని నేటి తరానికి అర్థం కావాల్సిన అవసరం ఉంది. ఎప్పుడైతే సాగుదారుల కష్టాలపై అవగాహన పెరుగుతుందో, నాటి నుంచి రైతులంటే అందరికీ గౌరవం ఇనుమడిస్తుంది. మనం తినే ఆహారం పండించేందుకు రైతులెన్ని అవస్థలు పడుతున్నారో, ఆరుగాలం కష్టపడ్డా వారు పస్తులెందుకు ఉండాల్సి వస్తున్నదో తెలిస్తే రైతుశ్రమకు విలువ కట్టే విషయంలో అవగాహన పెరుగుతుంది. పంట ఉత్పత్తుల్ని నేరుగా రైతుల నుంచి కొనే సంస్కృతి అలవడుతుంది. సాగు తప్ప రైతులకు మరో వ్యాపకం తెలియదని, వాళ్లు సేద్యం మానేస్తే ఆహారం కోసం విదేశాలపై ఆధారపడాల్సి వస్తుందన్న స్పృహ కలుగుతుంది. విత్తనాలు, రుణాలు సహా పంట ఉత్పాదకాలు పొందే క్రమంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వాలు చేయూతనివ్వాలి. రైతుల్ని ఒక దరికి చేర్చి రాజకీయాల ఊసు లేకుండా మేలైన సాగు విధానాలు పాటించేలా, మార్కెట్ నైపుణ్యాన్ని పెంచుకునేలా అవగాహన పెంపొందించాలి. సాగులో ఖర్చులు తగ్గించుకుని లాభపడే అవకాశాలను తెలియజేయడం అత్యవసరం. పండించేవాణ్ని పస్తులుంచకుండా కాయకష్టానికి ప్రతిఫలం దక్కేలా చూడగలిగితే సత్ఫలితాలు సమకూరతాయి. ఇందుకు ఈతరం పూనుకోవాలి. యువభారత్ ఈ విషయంలో క్రియాశీలంగా వ్యవహరించాలి. అంకుర ఆవిష్కరణలతో సేద్యంలో సాంకేతికతను కొత్తపుంతలు తొక్కిస్తున్న నేటి తరం, సేద్యంలో సత్ఫలితాలు సాధించేలా రైతులకు అండగా నిలవాలి. మేలైన పద్ధతులు పాటిస్తూ లాభసాటి సేద్యం చేస్తున్న రైతుల్ని చూసి తోటి రైతులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలి. తెలుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగ్ చదివి ఉద్యోగాలు లేకుండా ఖాళీగా ఉన్నవారెందరో ఉన్నారు. ఇలాంటివారిని క్లస్టర్ల పరిధిలోకి తెచ్చి కుటీర పరిశ్రమల్లో భాగస్వామ్యం కల్పించాలి. ఇలా గ్రామీణ కుటుంబాల్లో ఆదాయ సముపార్జనకు బాటలు పడుతున్న కొద్దీ పల్లెలు సుసంపన్నమవుతాయి. పల్లెలు కాంతులీని రైతుల పండగ సంక్రాంతికి వన్నెతెస్తాయి. అన్నదాతల జీవన ప్రమాణాలూ ఇనుమడిస్తాయి!

– అమిర్నేని హరికృష్ణ

లాభాలకు ఇదీ మార్గం...



తెలుగు రాష్ట్రాల్లో ఎందరో అభ్యుదయ రైతులు సమీప పట్టణాల్లోని అపార్ట్‌మెంటు సంఘాలతో మాట్లాడి వాళ్లకు కావలసిన బియ్యం, కందులు, మినప్పప్పు, మిర్చి సరఫరా చేస్తున్నారు. తద్వారా వారు లబ్ధి పొందుతున్నారు. ఇలా వ్యవహరిస్తే రైతుకు లాభసాటి ధరలు అందుతాయి. మరికొందరు విత్తనోత్పత్తితో పాటు మిరప వంటి పంటల్లో నారుమడులు పోస్తూ రైతులకు నారు సరఫరా చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఈ విషయంలో కొందరు యువకులూ చొరవ చూపుతున్న సంఘటనలు ఉన్నాయి. దాదాపు లక్ష రూపాయలు ఖర్చయ్యే చిన్నపాటి పప్పుమిల్లు ఏర్పాటు చేసుకుని మినుము, పెసర, కంది వంటి అపరాల నుంచి పప్పు తీసి సూపర్ మార్కెట్లకు, అపార్ట్‌మెంటు సంఘాలకు విక్రయిస్తున్నవారూ ఉన్నారు. రైతు కుటుంబాలతో పాటు గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాలు, యువతరం పంటల ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసుకోగలిగితే ఆదాయాలు పెరుగుతాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయవలసిందల్లా- పంట కోత అనంతర సాంకేతికతను గ్రామీణులకు విస్తృతంగా అందుబాటులోకి తేవడమే. ఇందుకోసం అయిదారు గ్రామాలను ఒక సమూహం(క్లస్టరు)గా విభజించి రైతులకు కావలసిన సదుపాయాలన్నీ అక్కడ కల్పిస్తే పంటలు పండించుకునే క్రమంలో ప్రాథమికంగా తలెత్తే సమస్యలన్నీ తీరతాయి. ఒక నోడల్ అధికారిని నియమించగలిగితే రైతులకు మంచి ధరలు అందించేలా ఆయన తోడ్పడగలుగుతారు. రైతులకు లాభసాటి ధరలు అందించే బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలి. ఈ క్రమంలో విపణి శక్తులను నియంత్రించాల్సిన అవసరముంది. వడ్డీ వ్యాపారులు, దళారులను నియంత్రించి సాగు సలహాలను విస్తృతంగా అందిస్తే రైతులు మంచి ఫలితాలు పొందగలుగుతారు.

పిచ్చుకలపై బ్రహ్మాస్త్రమా?

'ఏవడబ్బ సొమ్మని కులుకుతు తిరిగేవు?' అని శ్రీరామచంద్ర ప్రభువును సూటిగా, ధాటిగా ప్రశ్నించాడు రామదాసు. నిరంతరం తనను ఆరాధించేవాడు అంతగా ఆగ్రహించి దూషించడాన్ని రాజద్రోహంగా పరిగణించలేదు శ్రీరామచంద్రుడు. జనవాక్కును సదా మన్నించే మర్యాదా పురుషోత్తముడి పాలన అందుకే రామరాజ్యంగా ప్రశస్తిగాంచింది. అదేం చిత్రమో- రామరాజ్యాన్ని స్థాపిస్తామని ప్రతిజ్ఞలు చేసి అధికారానికి వచ్చిన నేతాగణాల ఏలుబడిలో- రాజద్రోహం కేసుల ఉరవడి తారెత్తిస్తోంది. బ్రిటిష్ వలస పాలన అవశేషంగా భారత శిక్షాస్మృతిలో ఉన్న రాజద్రోహ నేర నిబంధన- జనస్వామ్య నిరసన గళాలపై ఎత్తిన కత్తిగా పదే పదే పరువు మాస్తోంది. ఇప్పుడా కత్తివేటు అసోమ్‌కు చెందిన కొందరు పెద్దలపైన, దాని గాటు అసలే కుపితులై ఉన్న నిరసనోద్యమకారులపైనా పడింది. అదెలాగో చిత్తగించండి!

'ఈ శూన్యం తొలగాలి - ఈశాన్యం వెలగాలి' అని ప్రసంగాల్లో నేతాగణాలు దశాబ్దాలుగా మోతెక్కిస్తున్నా, స్థానికంగా సెలవేసిన సమస్యల్ని సానుకూలంగా అర్థం చేసుకుని, సానునయంగా పరిష్కరించే చొరవే దశాబ్దాలుగా కొరవడింది. అక్రమ వలసలు పోటెత్తి స్థానికంగా తమ అస్తిత్వమే కదలబారిపోతోందంటూ ఎనిమిదో దశకంలో రేగిన విద్యార్థి ఉద్యమం అసోం రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేసింది. ఒక్క అసోం అనేముంది? అక్రమ వలసలతో ఈశాన్య రాష్ట్రాలన్నీ తరతమ భేదాలతో అవస్థల పాలవుతున్నవే. ఈ నేపథ్యంలో పౌరసత్వ చట్ట సవరణ బిల్లు ద్వారా పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ల నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులందరికీ భారత పౌరసత్వం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడటం తీవ్రాందోళనకు కారణమైంది. స్థానికుల ప్రయోజనాలకు ఎలాంటి ముప్పూ వాటిల్లబోదంటూ సాక్షాత్తు ప్రధానే అభయమిస్తున్నా- అలాంటి హామీల చెల్లుబాటు ఎంతో తెలిసిన భిన్న వర్గాలు ఉద్యమ పథంలో కదం తొక్కుతున్నాయి. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన దరిమిలా నిరసనలు ముమ్మరించాయి. అందులో భాగంగానే- భారత రాజ్యాంగ లౌకికవాద విలువల్ని నిలబెట్టాలంటూ వివాదాస్పద బిల్లుకు వ్యతిరేకంగా సాహిత్య అకాడమీ అవార్డు విజేత హిరేన్ గొహైన్ సభ నిర్వహించారు. కొన్నాళ్ల క్రితం జరిగిన సభలో స్వతంత్ర అసోం (స్వాధీన్ అసోం) డిమాండును ప్రస్తావించారంటూ తాజాగా పోలీసులు ఆయనపై రాజద్రోహం కేసు బనాయించారు. నాటి ప్రదర్శనలో స్వతంత్ర అసోం అంశాన్ని ఎవరో లేవనెత్తినప్పుడు- బిల్లుకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యయుత చర్యలు పని చెయ్యనప్పుడు, బిల్లును ఉపసంహరించాలన్న వాదనను పట్టించుకోనప్పుడే స్వాధీన్ అసోం డిమాండు రావచ్చునని తాను బదులిచ్చినట్లు గొహైన్ చెబుతున్నారు. ఆయనతోపాటు సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త, మరో సీనియర్ పాత్రికేయుడిపైనా గువాహటి పోలీసులు అదే కేసు పెట్టి పైత్య ప్రకోపాన్ని ప్రదర్శించడంతో- అసోం సమాజం మరింతగా భగ్గుమంటోంది.



పుణ్యభూమి

అధికార దండధరులైన నేతలకు, 'లాఠీ'న్యంతో చెలరేగిపోయే పోలీసులకు తెలియదేమో గానీ- నిరసన తెలపడం అన్నది పౌరులకు రాజ్యాంగబద్ధంగా దఖలు పడిన ప్రజాస్వామ్య హక్కు! దాన్ని రాజద్రోహ చట్టం కర్కశంగా తొక్కిపెట్టే ప్రమాదం ఉందంటూ రాజ్యాంగనిర్ణయ సభలో కేఎం మున్షీ తీవ్రంగా వ్యతిరేకించారు. 'నూటయాభైఏళ్ల క్రితం ఇంగ్లాండ్‌లో సమావేశం పెట్టడం, ప్రదర్శన నిర్వహించడమూ రాజద్రోహమే'నన్న మున్షీ- జిల్లా మేజిస్ట్రేటును విమర్శించడాన్నీ రాజద్రోహంగా పరిగణించాలంటూ వచ్చిన విజ్ఞప్తిని ఆనాడు ప్రస్తావించారు. ప్రభుత్వాన్ని విమర్శించగలడమే ప్రజాస్వామ్య సారం అయినప్పుడు, ఫలానా పార్టీ ప్రభుత్వానికి తన పార్టీయే ప్రత్యామ్నాయమని ఓటర్లకు చెప్పి ఒప్పించి అధికారానికి నిచ్చెనలు వేసుకొనే పార్టీస్వామ్యం అమల్లో ఉన్నప్పుడు- రాజద్రోహ చట్టం అసంబద్ధమని గట్టిగా వాదించారు. విశేషం ఏమిటంటే బ్రిటిష్ రాజ్యాంగ పొత్తాల నుంచి రాజద్రోహ నేరాన్ని ఏనాడో తొలగించారు. ఇప్పటికీ దాన్ని కొనసాగిస్తున్న ఇండియాలో ప్రజాస్వామ్య పిచ్చుకల మీద బ్రహ్మాస్త్రంగా దాన్ని భ్రష్టు పట్టిస్తూనే ఉన్నారు!

తమకు ఎదురాడిన వాడి మెడలు వంచడమే ఏకైక లక్ష్యంగా 124ఏ నిబంధనను తెచ్చిన బ్రిటిష్ పాలకులు దాన్ని తిలక్, మహాత్మా గాంధీ వంటి స్వాతంత్ర్య సమర సేనానులపై ప్రయోగించారు. 'పౌరుల స్వేచ్ఛను అణచివేసేందుకు భారతీయ శిక్షాస్మృతిలో పేర్చిన అన్ని రాజకీయ నిబంధనల్లో, 124-ఏ యువరాజులాంటిది' అని బాపూజీ దాన్ని ఈసడించారు. ప్రభుత్వం ఎలాంటి దగాకోరు పని చేసినా దాన్ని ప్రేమించడమే గానీ, ద్వేషించరాదన్నది రూలు. ప్రజాస్వామ్యానికి అది పొసగేదేనా అసలు?

ఎంతటి పరుష పదజాలం వాడినప్పటికీ కేవలం ప్రభుత్వాల్ని విమర్శించడమే 124-ఏ కింద నేరం కాబోదని సర్వోన్నత న్యాయస్థానమే విస్పష్టంగా లక్ష్మణరేఖలు గీసింది. అయినా సరే- భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు ఉరితాళ్లు పేనేలా ఆ నిబంధనను విచ్చలవిడిగా ప్రయోగించే దుర్నీత వాతావరణం నిక్షేపంగా వర్ధిల్లుతోంది. చట్టబద్ధంగా ఆ వివాదాస్పద నిబంధనను ఏయే సందర్భాల్లో ప్రయోగించగల వీలుందో లా కమిషన్ పరిశీలిస్తోందని కేంద్ర ప్రభుత్వం నిరుడు జులైలో రాజ్యసభాముఖంగా తెలిపింది. ఆగస్టు చివరిలో లా కమిషన్ అందరి అభిప్రాయాలు కోరుతూ 124-ఏ రద్దు మీద ఓ సంప్రతింపుల పత్రాన్ని వెలువరించింది. ప్రజాస్వామ్యంలో అందరూ ఒకే పాటల పుస్తకం నుంచే పాడాలనడం- దేశభక్తికి కొలమానం కాదని స్పష్టీకరించింది. 'ప్రభుత్వ విధానాల్లో లొసుగుల్ని ఎత్తిచూపేటప్పుడు, వ్యక్తీకరణ కఠినంగాను, కొందరికి ఇబ్బందికరంగానూ ఉండవచ్చు. అంతమాత్రం చేత ఆయా చర్యల్ని దేశద్రోహంగా భావించరా'దనీ ఆ పత్రం పేర్కొంది. నేతల్లో, పోలీసుల్లో ఆ ప్రజాస్వామ్య స్పృహ కొరవడటమే కొత్త కుంపట్లు రాజేస్తోంది.

సహేతుక విమర్శకు దేశం సిద్ధంగా లేకపోతే- దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు ఎలా అవుతుందన్నది సమంజసమైన ప్రశ్న! 2017 జులైనాటికే మూడేళ్లలో 165 మందిని రాజద్రోహం కింద నిర్బంధించినట్లు గణాంకాలు చాటుతున్నాయి. 'పాకిస్థాన్ నరకం కాదు... పాకిస్థానీలూ మనలాంటి వాళ్లే' అన్నందుకు కన్నడ సినిమా నటి రమ్యపై రాజద్రోహం కేసు పెట్టారు. జేఎన్‌యూ గొడవల్లో విద్యార్థి నేత కన్హయ్య కుమార్ పైన, రిజర్వేషన్ల రగడలో హార్దిక్ పటేల్ మీదా అవే కేసులు. అంతెందుకు? న్యాయ వ్యవస్థలో నియామకాల చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేయడం అసంబద్ధమని అన్నందుకు కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ మీద ఝాన్సీ జిల్లాలోని మహోబా సివిల్ జడ్జి తనంతట తానుగా కేసు పెట్టారు. వాక్ స్వాతంత్ర్యానికి గొడ్డలిపెట్టులా మారిన 124-ఏను ఇంకా కొనసాగించడంలో అర్థం లేదు. దాన్ని రద్దుల పద్దులో చేర్చినప్పుడే- ప్రాథమిక హక్కులకు భరోసా దక్కినట్లు. ఏమంటారు?

– పర్వతం మూర్తి

ఇంకేం కావాలి?

పంచభూతాత్మకమైన ఈ సృష్టిలో మానవుడు తాను కావాలనుకున్న సకల సౌఖ్యాలు పొందుతున్నాడు. తన శ్రమకు తగిన ఫలితం అందుకుంటూనే ఉన్నాడు. అయినా అతడికి సంతోషం లేదు. సంతోషం అంటే సంతృప్తి. సంతోషం లేని ఆనందం ఆనందం కాదు. ఒక వేళ ఆనందమే అని సమర్థించుకున్నా అది శాశ్వతానందం కాదు. నిజానికి సంతోషమే సంపూర్ణ బలం. అదే సంపూర్ణానందం. కష్టార్జితంతో సముపార్జించింది చాలక, ఇంకా ఇంకా ఏదో కావాలన్న తపన, ఆశ, కాంక్ష, తృష్ణ మనిషిని పెడదారి పట్టిస్తున్నాయి.

ఈ తపోభూమిలో పుట్టిన ప్రతి మనిషికీ, ధర్మం ప్రాణసమానం. ధర్మాన్ని విస్మరించిన వాడికి భారతీయం అర్థం కాదు. సంస్కృతి, సంప్రదాయం, సదాచారం ఒంటపట్టవు. యుగయుగాలుగా మహర్షులు, యోగులు, సిద్ధులు, అవధూతలు అనేక రూపాల్లో ధార్మిక సూత్రాలు, సిద్ధాంతాలు అందిస్తూ వచ్చారు. అపౌరుషేయాలైన వేదాలు మనకు మహోజ్జ్వల కరదీపికలుగా భాసిల్లుతూ వచ్చాయి. వాటి గురించి తెలిస్తే మన బతుకుల్ని తెరిచిన పుస్తకాలుగా చేసుకోవచ్చు. ఇహపరాలకు 'యోగం' ద్వారా పటిష్ఠ వారధిగా చేసుకునే విజ్ఞతను ఆర్జించవచ్చు.

ధర్మాలు, విలువలంటే- మనం ఇష్టమైనప్పుడు తగిలించుకుని వదిలేసే వలువలు కావు. అవి మనకు సహజ కవచ కుండలాల్లాంటివి. ఎన్ని యుగాలైనా భద్రంగా కాపాడుకోవాల్సిన సిరిసంపదలు అవి.

సమయం, మాట, ఆలోచన, ఆచరణాల విలువలు తెలుసుకున్న మనిషికి వాస్తవమైన సంతోషం కచ్చితంగా లభించే తీరుతుంది.

'సంతోషం ఒకచోట లేనప్పుడు మరోచోట దొరుకుతుంది. లేనిచోటే ఉండిపోతే మరోచోట సంతోషాన్ని పొందలేం'- హెలెన్ కెల్లర్ మాటలివి. ఈ సత్యాన్ని గ్రహించగలిగితే మనిషిలో తృష్ణ, తపన ఉత్పన్నం కావు. రాగద్వేషాలకు దూరంగానూ మనిషి ఉండగలుగుతాడు. అక్రమంగా, అవినీతి మార్గాన ఆర్జించిన మనిషి ధైర్యంగా జీవించలేడు. భర్తృహరి చెప్పిన భయాలన్నీ పిశాచాలై వాడిని పీడిస్తూనే ఉంటాయి. సంతోషం కేవలం శ్రమ వల్ల, నిజాయతీ వల్ల మాత్రమే లభిస్తాయి. 'పవలు రేలును నా కుటుంబమ్మునకు, అతిథి సజ్జనులకు భుక్తికి నిరతము సరిపడెడు గంజినొసగిన చాలునయ్యా, స్వామి! ఇంతకు మించి ఇంకేమి వలయు?' అంటాడు కబీరు. ఇలాంటి సంతోషాన్ని మించిన సౌఖ్యం స్వర్గంలోనైనా దొరుకుతుందా? కలిసి పంచుకుందాం, కలిసి భుజిద్దాం, కలిసి నడుద్దాం... మనకు ఉపనిషత్తులు బోధించిన సత్యమిదే! దురాశ మనిషికి మనఃక్లేశాన్ని కలిగిస్తుంది. ధనతృష్ణ అశాంతికి గురిచేస్తుంది. దొరికిన ఆహారమంతా పుష్కలంగా ముందున్నా, వింటికి కట్టిన నరాన్ని కొరుక్కుంటూ ప్రాణానికే ముప్పు తెచ్చిపెట్టుకున్న నక్కలా ముగిసిపోతుంది మనిషి బతుకు, అసంతుష్టికి బానిసైతే.



అంతర్యామి

'ఎదురుదెబ్బలు తగిలినా సాధించాలనుకున్నది సాధించి, కృతకృత్యుడయ్యేవాడే అసలైన సంతోషానికి అర్హుడు' అంటాడు చాణక్యుడు. మనల్ని ఆనందంగా ఉంచడానికే, భగవంతుడు మనం కోరినవన్నీ ఇవ్వడు. దేనికి మనం యోగ్యులమో అదే ఇస్తాడు. సంతోషాన్ని, ఆనందాన్ని బయటి నుంచి పొందాలనుకునేవాడు లౌకికుడు. దాన్ని తన లోపలనే దర్శించేవాడు జ్ఞాని. 'తృప్తి కలిగితే సుఖం, తృప్తి తొలగితే దుఃఖం. తృష్ణ కలిగితే దుఃఖం. తృష్ణ తొలగితే సుఖం' అన్నది మనుస్మృతి. సంతోషానికి మనసులో చోటివ్వక, అలక్ష్యం చేసిన వెంటనే సంతాపం వచ్చి తిష్ఠ వేస్తుంది. సంతృప్తి పొందుతున్నకొద్దీ మనిషి సచ్చిదానంద స్థితికి సన్నిహితుడవుతుంటాడు. సంతోషం అనేది మనసులో జ్ఞానేంద్రియాల ద్వారా ప్రవేశించిన ప్రాపంచిక విషయాలతో ముడివడిన ఆరోగ్యకరమైన భావోద్వేగం. అది జీవన వీణను పలికించే మధురానురాగం. ఇంతకు మించి మనిషికి ఇంకేం కావాలి?

– చిమ్మపూడి శ్రీరామమూర్తి

పండగొచ్చింది!

పిల్లాపాపా ఇంటికొచ్చి.. కుటుంబం మొత్తం కలిసి సంతోషంగా గడిపే అద్భుత సమయమొచ్చింది!! సంక్రాంతి అంటే కుటుంబం మొత్తం కలిసి చేసుకునే ఓ చిన్న సంబురం. తాతాబామ్మలు, అన్నలు, తమ్ముళ్లు, అక్కలు, బావలు, అత్తలు, మావలు, అల్లుళ్లు, కోడళ్లు.. మధ్యలో పిల్లలు.. ఇలా ఇల్లంతా కోలాహలంగా మారిపోతే ఎంత పాత ఇంటికైనా కొత్త కళ రాకుండా ఉంటుందా? ఎంత వయసు మీదపడినా మనసు గంతులెయ్యదా? ఇలా అప్పుడప్పుడు కుటుంబం మొత్తం కలవటం, ఇంటిల్లిపాదీ ఆనందంగా గడపటమన్నది ఓ అద్భుత సంప్రదాయమని, దీన్ని మనం ఏమాత్రం విస్మరించటానికి వీల్లేదని శాస్త్ర రంగం నొక్కి చెబుతుండటం విశేషం.

ఆనందం

ఆరోగ్యం

ఆయుర్దాయం



అంతా కలవటమే అసలు పండగ!

ఆలంబన

అభ్యున్నతి

మీ జీవిత చరమాంకంలో.. మరొక్క పరీక్ష పాసయ్యుంటే బాగుండేదనో, ఇంకో కేసు గెలుచుకుని ఉండాల్సిందనో లేక ఇంకేదో వ్యాపార ఒప్పందం కుదుర్చుకోలేకపోయామనో మీరేం చింతించరు. కుటుంబంతోనూ, స్నేహితులతోనూ మరికాస్త సమయం గడపలేకపోయామే అన్న చింత ఒక్కటే మిగులుతుంది!

- బార్బారా బుష్ (అమెరికా మాజీ అధ్యక్షుడు సీనియర్ బుష్ భార్య)

మన కుటుంబాన్ని మనం ఎంచుకోం. అది మనకు దేవుడిచ్చిన బహుమతి!

– డెస్మండ్ టుటు (నోబుల్ శాంతి బహుమతి గ్రహీత)

మనతోటే ఇజ్రాయెల్!

ఉమ్మడి కుటుంబాలు తగ్గుతున్నా కూడా ఇప్పటికీ మన భారతీయ కుటుంబ వ్యవస్థ మూలాలు బలంగా ఉండటాన్ని ఇప్పుడు ప్రపంచం మొత్తం ప్రత్యేకంగా చెప్పుకుంటోంది. అంతే కాదు, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో ప్రజల ఆయుర్దాయం బాగుండటానికి, సంతోష సూచికల్లో ఆ దేశం పైనుండటానికి కూడా అక్కడ కుటుంబ బంధాలు బలంగా ఉండటమే కారణమని పరిశోధకులు గుర్తిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో సంప్రదాయంగా కుటుంబాలు కాస్త పెద్దగా, సన్నిహితంగా కూడా ఉంటాయి. అక్కడి ప్రజల ఆయుర్దాయం ఎక్కువగా ఉండటానికి- వాళ్ల దగ్గర సంపద ఎక్కువగా ఉండటం, వైద్య ఖర్చులను భరించే స్థోమతు ఉండటం, చక్కటి పోషకాహారం తీసుకోవటం, మద్యం అలవాటు తక్కువుండటం వంటి చాలా అంశాలను పరిశీలించారు. అయితే ఈ అంశాలు చాలా దేశాల్లో కనబడుతున్నాయిగానీ అక్కడ ఆయుర్దాయాలేం గొప్పగా లేవు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌ను కుటుంబ వ్యవస్థ, సామాజిక బంధాలు, సాంస్కృతిక విలువలే భిన్నంగా ఉంచుతున్నాయని పరిశోధకులు నిర్ధారణకు వచ్చారు. అందుకే పాశ్చాత్య దేశాల్లో కూడా 'అప్పుడప్పుడు కుటుంబం కలుస్తుండటం (ఫ్యామిలీ రీ యూనియన్) అన్నది ఇప్పుడు పెద్ద ఎత్తున ప్రాచుర్యంలోకి వస్తోంది. దీనిలోని సంతోష మాధుర్యాల గురించి మనకు మరొకరు చెప్పాలా!

▶ ఇజ్రాయెల్ ప్రజల సగటు ఆయుర్దాయం.. 85 ఏళ్లు

▶ ప్రపంచ సంతోష సూచిలో.. 11వ స్థానం

మన ఆశలు, అవసరాలు మారిపోయిన ఈ ఆధునిక కాలంలో.. 'చిన్న కుటుంబం చింతలేని కుటుంబం' అని మనం గొప్పగా ప్రచారం చేసుకుంటూ ఉండొచ్చేమోగానీ.. నిజానికి అది పూర్తి నిజం కాదు. చిన్న కుటుంబాల్లో పిల్లల పెద్దల ఆలనాపాలన నుంచి మానసిక భరోసా వరకూ ఎన్నో కొరవడుతూ వాటికుండే చింతలు వాటికి చాలానే ఉంటున్నాయి. అలాగని పొట్ట చేతబట్టుకుని ప్రపంచమంతా తిరుగుతున్న ఈ ప్రపంచీకరణ యుగంలో ఇప్పటికిప్పుడు ఉమ్మడి కుటుంబాలే ఉత్తమం అనుకుంటూ మళ్లీ వాటికి మళ్లే అవకాశమూ లేదు. అందుకే పండగలకైనా కుటుంబం మొత్తం కలవటమన్నది ఇప్పుడు కీలకంగా మారుతోందని సామాజిక అధ్యయనవేత్తలంతా అంటున్నారు.

మనం వెళ్లింది ముందుక్కాదు!

ఇప్పుడు కుటుంబ సభ్యులంతా తరచూ మాటామంతీ కలుపుకొనేందుకు ఫోన్లు, ఫేస్‌టైమ్, వాట్సాప్ వంటివెన్నో వచ్చాయి. అయినా కూడా ఒకప్పటి కంటే ఇప్పుడే మనుషుల మధ్య దూరాలు ఎక్కువగా ఉంటున్నాయనీ, ముఖాముఖీ కలవటానికి ఇవేవీ ప్రత్యామ్నాయాలు కావని చెబుతున్నారు పరిశోధకులు. పిల్లలను దగ్గరకు తీసుకోవటం, వీపు తట్టటం, పెద్దల పక్కన కూర్చోవటం, వాళ్లను హత్తుకోవటం, మన గురించి వాళ్లు చెప్పే కథలు వినటం, అంతా కలిసి ఉమ్మడిగా స్పందించటం.. ఇవన్నీ మాధ్యమాల్లో సాధ్యం కాదు. అసలు మనమేమిటో ఇంట్లో అందరికీ తెలిసేది కూడా ఇలా అందరం కలిసే సందర్భాల్లోనే! మన వికాసానికి ఇవన్నీ అవసరమని గట్టిగా చెబుతున్నారు 'పాజిటివ్ సైకాలజీ' నిపుణులు.

కలిస్తే కలదు లాభం!

ఈ ఆధునిక కాలంలో ఎవరికి వారు పనుల్లో కూరుకుపోయి.. కొన్నిసార్లు నెలలూ, ఏళ్లూ కూడా కుటుంబ సభ్యులను చూసే పరిస్థితి ఉండటం లేదు. కుటుంబం ఎంత పెద్దదైనా, ఎంత చిన్నదైనా ఏడాదిలో ఒకటిరెండు సార్లైనా అంతా కలవటం, ప్రత్యక్షంగా గడపటం వల్ల సంబంధ బాంధవ్యాల మధ్య ఎడం రాకుండా ఉంటుంది.

ఆదిత్య కిరణం

● **మనకూ ఒక చరిత్ర ఉంది:** మనకు ఎంత వయసైనా రానీయండి.. మన కుటుంబం అంతా ఒక్కసారి కలిసిందంటే చాలు, మనకు తెలియని, మనకు సంబంధించిన ఏవో కొత్త విషయాలు బయటకు వస్తూనే ఉంటాయి. చిన్నప్పుడు మనం చేసిన అమాయకపు పనో, తెలిసీ తెలియని వయసులో మనం సృష్టించిన చిన్నపాటి సంచలనమో.. ఇలా ఏదో ఒకటి వినటం తథ్యం! 'అరె, ఆ విషయం నాకస్సలు తెలీదే!' అనిపించే సందర్భాలు ఉంటూనే ఉంటాయి. వీటిని వింటూ ఇంటిల్లిపాదీ నవ్వులు పూయిస్తుంటే ఆ సందోహమే వేరు. ఇక చిన్నపిల్లలైతే తమకు సంబంధించిన కథలను పెద్దల నోటి నుంచి వింటుంటే ఎంత ఆనందం అనుభవిస్తారో మాటల్లో చెప్పలేం. వాళ్లకు ఇంకెవ్వరూ చెప్పలేని విషయాలివి, అందుకే ఇలా ఇంటిల్లిపాదీ కలవటం చాలా ముఖ్యం! అలాగే ప్రతి కలయికలోనూ మళ్లీ కుటుంబమంతా పదిలంగా చూసుకునేందుకు కొన్ని ఉమ్మడి జ్ఞాపకాలూ మిగులుతాయి.

● **తరాల మధ్య బంధం:** సంబంధాలే మన జీవితాలకు మూలం. ఆ సంబంధాలన్నింటికీ కుటుంబం మూలం! కాబట్టి కుటుంబం అంతా కలిసి గడిపే ఈ సమయంలో.. ఒకరితో ఒకరు ప్రత్యేక బంధాన్ని పెనవేసుకోవచ్చు. పిల్లలు తాతలతో మామలతో కలిసి పొలానికి పోవటం, అత్తలూ పెద్దమ్మలతో ఇంట్లో పని చేయటం, అలాగే పెద్దలు కూడా పిల్లలతో కలిసి పనుల చేయటం వల్ల వ్యక్తిగతంగా ఇంట్లోని వివిధ తరాల మధ్య బంధం బలపడుతుంది.

● **కొత్త ప్రదేశం, కొత్త అనుభవం:** రోజువారీ పనులకు దూరం జరిగి, కుటుంబం అంతా మరో కొత్త ప్రదేశానికి వెళ్లటమనేది కొత్త అనుభూతులను సొంతం చేసుకునేందుకు అద్భుత అవకాశం.

● **కనిపించని సంపద:** మన పిల్లలు తల్లిదండ్రుల నుంచే కాదు.. ఇంట్లో అత్తయ్య, మామయ్య, బాబాయి, పిన్ని.. ఇలా అందరి నుంచీ ఎన్నో విషయాలు, విలువలు, అలవాట్లు నేర్చుకుంటారు. ముఖ్యంగా రేపటి తరం పిల్లల మధ్య అనుబంధాలు పెరుగుతాయి. ఇది మనం వారికి ఇవ్వగలిగిన గొప్ప సంపద అనుకోవచ్చు. అంతా కలిసి గడపటం వల్ల జీవితంలో మనకు ఎలాంటి కష్టనష్టాలు ఎదురైనా కుటుంబం మొత్తం మనకు అండగా ఉంటుందన్న నిశ్చింత, భరోసా కలుగుతాయి.

● **పిల్లలు పెద్దలయ్యేది ఇక్కడే:** పిల్లలు సమాజంతో కలవటం, సామాజిక సంప్రదాయాలను నేర్వటానికి కుటుంబం అన్నది మొట్టమొదటి వేదిక. ఒకరినొకరు గౌరవించుకోవటం, ఆత్మీయతలను పంచుకోవటం, కోపాలను నియంత్రించుకోవటం, ఎవరి వస్తువును వాళ్లు జాగ్రత్త చేసుకోవటం.. ఇవన్నీ కుటుంబంలోనే నేర్చుకుంటారు. అంతిమంగా పిల్లలకు ప్రోత్సాహం, సలహాలు, భరోసా వంటివన్నీ ఇంట్లోనే దక్కుతాయి. దీనివల్ల పిల్లల్లో బిడియం, సభాపిరికితనం వంటివన్నీ పోయి.. తేలికగా నలుగురిలోకి వెళ్లగలుగుతారు. ఈ నైపుణ్యాలు ఉద్యోగాల్లో, ఇతరత్రా రంగాల్లో ఉపకరిస్తాయి. కుటుంబం ఇచ్చే మద్దతుతోనే పిల్లలు బయట ఉండే పెద్ద ప్రపంచంలో అడుగుపెట్టి, 'పెద్ద'లుగా ఎదుగుతారు.

● **కుటుంబ వారసత్వం:** కేవలం ఆస్తిపాస్తులే కాదు, ప్రతి కుటుంబానికీ తనదైన చరిత్ర, అమూల్య వారసత్వ సంపద ఉంటుంది. దాన్ని పంచుకోవటం, పిల్లలకు అందజేయటానికి వీలు చిక్కుతుంది. అంతా కలిసినప్పుడు పాత జ్ఞాపకాలన్నీ తిరగేసుకుంటాం.. అవి మరింత బలపడతాయి. పిల్లలకు ఇవి తెలియటం వల్ల తమ కుటుంబం సమాజంతో ఎలా పెనవేసుకుని ఉందో, మనం ఎక్కడి నుంచి వచ్చామో.. కుటుంబానికి ఉన్న గుర్తింపు ఏమిటో అర్థమవుతుంది. తాము ఏ దిశలో వెళ్లొచ్చన్న స్పష్టత కూడా వస్తుంది.

● **పొరపొరపొచ్చాలు పోతాయి:** చాలా కుటుంబాల్లో సమస్యలకు చిన్నచిన్న అపార్థాలే కారణమంటారు ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస నిపుణులు స్టీఫెన్ కవి. అందుకే కుటుంబంలో అంతా ఒకరి అవసరాలు, అభిప్రాయాల గురించి మరొకరు మనసువిప్పి, అరమరికలు లేకుండా మాట్లాడుకోవటం వల్ల.. అభిప్రాయ భేదాలనే కాదు, తమ మధ్యనున్న ప్రేమాభిమానాలను కూడా తెలియజేసుకునే అవకాశం చిక్కుతుంది. కుటుంబం మొత్తం ఒక్కటన్న ఐకమత్య భావన.. అది ఇచ్చే భరోసా.. ఎన్ని సంపదలున్నా, ఎంత డబ్బు పెట్టినా దొరికేది కాదు.



బొమ్మ: బాలు

కలిసికట్టుగా పండగ.. ఏం చెయ్యొచ్చు?

కుటుంబం కలవటమంటేనే సరదా, సంతోషాల వ్యవహారం. దీన్ని మరింత ఆనందభరితం చేసుకోవటానికి చాలా మార్గాలున్నాయి.

● సరదాగా పాత ఫోటోలు, పూర్వీకుల చిత్రాలు, వాళ్లు వాడిన వస్తువులు, డైరీలు, లేఖల వంటివి బయటకు తీసి భద్రపరచటం వంటివి చెయ్యొచ్చు. మన తాతగారు వాడిన గడియారమో, అమ్మమ్మ వాడిన ఇత్తడి పోపుల పెట్టె.. ఇలాంటివి (హైర్‌లూమ్స్) ఎంతో అపురూపంగా ఉండి, మనకు అనిర్వచనీయమైన అనుభూతిని మిగులుస్తాయి. వాటిని డిజిటల్ ఫోటోలు తీసి, వాటితో చిన్న వీడియో రూపొందించటం.. వంటివన్నీ కుటుంబాన్ని మరింత సన్నిహితం చేస్తాయి.



● కుటుంబం మొత్తం కూర్చుని సరదాగా మాట్లాడుకుంటూ.. పాముల పటం, పచ్చీసు వంటివి ఆడుకోవచ్చు. పండగ రోజున ఇంట్లోనే కూర్చుని ఆడుకునేందుకు వీలైన ఈ 'బోర్డ్ గేమ్స్'.. గొప్ప కాలక్షేపాన్నీ, మర్చిపోలేని అనుభూతులను మిగులుస్తాయి.

● బెలూన్లకు గాలికొట్టి, పెరట్లో వాటితో బాస్కెట్‌బాల్‌లా ఆడుకోవటం, స్ట్రాతో ఒక సాసర్లోని గోళీలను మరో సాసర్లోకి మార్చటం, ఇంట్లో దాచిపెట్టిన వస్తువులను కనుక్కోవటం (ట్రెజర్‌హంట్) వంటి ఆటలు పిల్లలనూ, పెద్దలనూ చాలా సరదాగానే దగ్గర చేస్తాయి.

● మంట లేకుండా వంట, రంగురంగుల పండ్లు కూరగాయలు వాడుతూ అందంగా అలంకరించటం వంటి సరదా పోటీలు ఇంటిల్లిపాదికీ వినోదాన్నిస్తాయి. వీటివల్ల ఇంటి వాతావరణం మొత్తం సరదాగా మారిపోతుంది.

● ఇంట్లో ప్రతి ఒక్కరూ.. ఇంకొకరికి సంబంధించిన సరదా కథ, జరిగిన సంఘటన వంటిది చెప్పొచ్చు. ఇంట్లో ఎవరు, ఎప్పుడు పుట్టారు.. ఎప్పుడెప్పుడు కీలక ఘటనలు జరిగాయన్న పెద్ద పట్టిక తయారు చెయ్యొచ్చు. ఈ పని పిల్లలకు అప్పగిస్తే దీన్నో సరదా ప్రాజెక్టులా చేస్తారు కూడా!

● అందరికీ గుర్తుండిపోయేలా చిన్నచిన్న బహుమతులు ఇవ్వచ్చు.

ఇదో చక్ర బంధం



మాట్లాడుకుంటే బంధాలు బలపడతాయి. బంధాలు బలపడితే తరచూ కుటుంబాలు కలవాలన్న ఆలోచన పుంజుకుంటుంది. కలిసిన ప్రతిసారీ మళ్లీ మాట్లాడుకుని, బంధాలను బలోపేతం చేసుకునే అవకాశం ఉంటుంది. ఇలా అన్నీ ఒకదానితో ఒకటి ముడిపడ్డాయి కాబట్టి దీన్నో 'కుటుంబ చక్రం' అనుకోవచ్చు!

అందరూ మాట్లాడుకోవటం → బంధాలు బలపడటం → కుటుంబమంతా కలవటం →

ఏ కుటుంబమూ 'పర్ఫెక్ట్' కాదు!


పువ్వుల్లాగే... ఈ ప్రపంచంలో ఏ రెండు కుటుంబాలూ కూడా అచ్చం ఒకలా ఉండవు. కుటుంబం అనగానే అంతా మంచే అని పొగిడి, పొంగిపోవాల్సిన పనేం లేదు. ప్రతి కుటుంబంలోనూ ఏవో సమస్యలు సహజం. అవి ఉండటం కూడా తప్పేం కాదు. పాత తగాదాలు, ఈర్ష్యాసూయల వంటివన్నీ మామూలే. ఇలా లోపల్లోపల ఎన్ని వైరుధ్యాలున్నా కూడా ఒక స్థాయికి వచ్చేసరికి మళ్లీ మనమంతా ఒక్కటన్న భావనతో కలిసి ఉండటమన్నది ఒక్క కుటుంబంలోనే సాధ్యం. అదే కుటుంబ వ్యవస్థకు ఉన్న విశిష్టత! అందుకే మనకు 'కుటుంబం నేర్పినంత మరే బంధం నేర్పలేదంటారు' నిపుణులు.

అతిశయాలను పక్కనబెట్టి..

కుటుంబం అంతా కలిసిందంటే.. తినటం, ఏదో ఉబుసుపోని కబుర్లు చెప్పుకోవటమేగదా.. అనొచ్చు. చూడటానికి ఇది పిచ్చాపాటీ వ్యవహారంగా అనిపించొచ్చుగానీ.. వాస్తవానికి ఇది మన అస్తిత్వానికి, మనుగడకు కూడా దోహదం చేస్తుంది! అసలు కుటుంబం మొత్తం కలుస్తోందంటేనే సహజమైన అభిజాత్యాలన్నింటినీ పక్కనబెట్టి.. కుటుంబం అంతా పాజిటివ్ అంశాల కోసం ఆశపడుతోందని అర్థం. ఇది మిగిల్చే 'పాజిటివ్' జ్ఞాపకాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది.

ఈ జ్ఞాపకాలు మంచివి!

సాధారణంగా మనకు చెడ్డ విషయాలే ఎక్కువగా గుర్తుంటాయంటారు వెబ్ఎండీ పరిశోధకులు జెన్నిఫర్ వార్నర్. భయం, కోపం, దుఃఖం వంటి ప్రతికూల భావోద్వేగాలు మన మెదడులో జ్ఞాపకాలను భద్రపరిచే ప్రాంతాన్ని మరింత చురుకెత్తిస్తాయి. అందుకే మంచివాటికన్నా అవి తేలికగా జ్ఞాపకాలుగా స్థిరపడతాయి, చాలా వివరంగా కూడా గుర్తుంటాయి. ఇవి మన మెదడులో ఎక్కువ భాగం ఆక్రమించకుండా ఉండాలంటే- మనం 'మంచి జ్ఞాపకాలను పదిలపరచుకోవటానికి ఎక్కువ సమయం, శక్తి వెచ్చించాలి. అయినా కూడా అది ప్రయోజనకరమే' అంటారు 'ద హ్యాపీనెస్ ప్రాజెక్ట్' రచయిత గ్రెట్‌ఛెన్ రుబిన్. ఇందుకు కుటుంబంలో సరదా అనుభవాలను తరచూ గుర్తు చేసుకోవటం, పాత సంఘటలనల ఫోటోలు, వీడియోల వంటివన్నీ దోహదం చేస్తాయి.



- ఈనాడు ప్రత్యేక విభాగం

వసతి గృహాల బడ్జెట్ విడుదల చేయండి

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని బీసీ వసతి గృహాలకు ఏడు నెలలుగా బడ్జెట్ విడుదల చేయకపోవడంతో నిర్వహణ ఇబ్బందిగా తయారైందని, వాటిని మూసివేసే పరిస్థితి ఏర్పడిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శనివారం లేఖ రాసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రామీణాభివృద్ధిలో భాగస్వామ్యం సంతృప్తినిస్తుంది

● **ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధిశాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తొప్పొ**

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములయ్యే వారికి నిరంతరం ప్రజలతో మమేకమవడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని ఝార్ఖండ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తొప్పొ అన్నారు. హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో 15వ బ్యాచ్ 'పీజీ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్' కోర్సులో 42 మంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి ప్రవీణ్‌కుమార్ తొప్పొ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం చాలామంది ఇంజినీరింగ్, ఇతర వృత్తుల్లో కొన్నేళ్లు పని చేశాక సంతృప్తి లేక మానేస్తున్నారని, కానీ గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేసేవారికి ఇతర రంగాల వైపు వెళ్లాలనే ఆలోచనే రాదన్నారు. ఆయా రాష్ట్రాల్లో స్థానిక భాషలు నేర్చుకునే అవకాశం లభిస్తుందని, సమాచార నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వ పథకాలు ప్రతిదశలోనూ పక్కదారి పడుతున్నాయని, సంక్షేమ పథకాల అమలు ఉద్దేశం దెబ్బతినకుండా బాధ్యతతో పనిచేయాలని శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సూచించారు. గ్రామీణ వ్యవస్థను అర్థం చేసుకొని, మెరుగైన శిక్షణ పొందిన వారు తక్కువగా ఉన్నారని, ఆ లోటును భర్తీ చేయడంలో తమ సంస్థ కీలకంగా పనిచేస్తోందని ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డబ్ల్యూఆర్ రెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులకు పీజీ డిప్లొమా పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ డీజీ రాధికారస్తోగి, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న ప్రవీణ్‌కుమార్ తొప్పొ

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

TG

కోడళ్లలారా.. కుటుంబానికి మీరే కొంగుబంగారాలు!



'కైటభ దైత్యమర్దనుని గాదిలి కోడల' అని పోతనామాత్యుడు సరస్వతీ దేవిని ఉద్దేశించి అన్నాడు. 'గాదిలి' అంటే ప్రియమైన అని అర్థం. 'ప్రియమైన కోడలు' అని అనిపించుకోవడం కంటే ఏ స్త్రీమూర్తికైనా గౌరవం ఏముంటుంది? ఇది వ్యక్తి గౌరవాన్నే కాదు, కుటుంబ గౌరవాన్ని కాపాడేది కూడా! కుటుంబానికి కేంద్రబిందువు కోడలు. ఆమె కరుణా సింధువయినప్పుడే ఔన్నత్యం. భర్తను అమితంగా ప్రేమించే అమ్మాయి తన భర్తకు జన్మనిచ్చిన అత్తమామలను, అతడి తోబుట్టువులను కూడా ఆదరించాలి. తను, తనభర్త వేరు, కుటుంబ సభ్యులంతా వేరు అనుకోకూడదు. అంతే కాదు... అత్తింటివారంటే అసహనం పనికిరాదు. మెట్టినింట అడుగుపెట్టకముందే అత్తమామల పట్ల వ్యతిరేక భావం ఏర్పాటు చేసుకోవడం తగదు. అది ఆ కుటుంబానికే కాదు.. సమాజానికి కూడా చెడు చేస్తుంది.

అత్తా ఒకింటి కోడలే అంటారు. అలాగే కోడలు కూడా ఒకనాటికి అత్త అవుతుంది. అందువల్ల ముందుచూపుతో వ్యవహరించాలి. అత్తమామలకు సేవచేయడమూ సమాజసేవలో భాగమే. ఛారిటీ బిగిన్స్ ఎట్ హోమ్ అంటారు. దాతృత్వమే కాదు, సమాజసేవ కూడా ఇంటినుంచే ప్రారంభం కావాలి. అందుకు కోడలు నడుంబిగించాలి.

అత్తగారిలో అమ్మను చూసుకునే ధోరణి కరువవుతోంది. ఫలితంగా నవ వధూవరులు ఎన్ని ఇబ్బందులనో కొని తెచ్చుకుంటున్నారు. అత్తమామలూ అగచాట్లు పడాల్సివస్తోంది. భర్త తనవాడు అయినప్పుడు అతడి తల్లిదండ్రులు, తోబుట్టువులు పరాయివాళ్లు ఎలా అవుతారు? బంధాల్ని కలుపుకుంటూపోతే బలపడతాంగానీ తెంచుకుంటూ పోతే ఎలా బలపడతాం? మాట సాయానికైనా మనీ సాయానికైనా మనవాళ్లంటూ ఉండాలికదా? పుట్టినింటిని, మెట్టినింటిని సమానంగా చూసుకోవడం కంటే మించినది ఏది?

అత్తమామల వల్ల ఏ సమస్య లేకపోయినా, వాళ్లకు సేవచేయడానికి ఏ ఇబ్బంది లేకపోయినా కొంతమంది కోడళ్లు వారిని వృద్ధాశ్రమాల్లో చేరుస్తున్న దృష్టాంతాలను చూస్తున్నాం. ఇటువంటి పరిస్థితులను కళ్లారా చూస్తున్న వారి పిల్లలు రేపటి రోజున తమను అలాగే చేరుస్తారన్నది మరచిపోకూడదు. వారికి మనమే ఆ మార్గం చూపకూడదన్న ఆలోచన అవసరం.

ఇంట్లో ఉన్న వృద్ధులకు సేవచేస్తే వాళ్ల ఆశీర్వాదాలు లభిస్తాయి. ఇంటికి పెద్దదిక్కుగా ఉంటారు. సలహాలకు సంప్రదింపులకు సాయపడుతుంటారు.

పెద్దలకు చేసే సేవ త్రికరణశుద్ధిగా ఉండాలి. నటించడం కాదు. వారిపట్ల మమకారం పెంచుకోవాలి. వారు లేకుంటే మనం ఈ భూమిమీదికి వచ్చేవారం కాదన్న కృతజ్ఞత ఉండాలి. వారి వాత్సల్యం వారిచ్చే ఆస్తులకన్నా విలువైంది. వదినె/మరదలు తన తల్లిదండ్రులను ఎలా చూడాలని కోడలు అనుకుంటుందో, తాను కూడా తన అత్తమామలను అలాగే చూసుకోవాలి. దీనికి వేరే ఏ ప్రమాణమూ అక్కర్లేదు.

మనస్సు బాగుండగానే సరిపోదు. కుటుంబశాంతికి మాట కూడా బాగుండాలి. ఇదే వాచా. అత్తమామల దగ్గర కోడలు ప్రేమపూర్వకంగా మాట్లాడే ఒక్కమాటయినా వారికి కొండంత ఊరట! అత్తమామల మీద ఇతరులకు చాడీలు చెప్పడం బంధాలను దెబ్బతీస్తుంది. ఈ పద్ధతి అలవాటు చేసుకోకూడదు.

ఇక కర్మణా. అంటే చేతలు. మాటలకు చేతలకు తేడా రాకూడదు. చెప్పిందే చెయ్యాలి. చేసిందే చెప్పాలి. ఇవన్నీ ఇంట్లో పెద్దల అభిమానం చూరగొనేట్టు ఉండాలి. కోడలు తమ కళ్ల ముందు తిరుగుతుంటే అత్తమామలకు హడలు పుట్టకూడదు. ఆనందంతో ఒడలు పులకరించాలి. అదే మెట్టినింట సాధించాల్సిన తొలివిజయం. కోడళ్లూ విజయోస్తు!

- శంకరనారాయణ

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

వధువు కావలెను

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వరుడు కావలెను

వివాహ వేదిక

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

ఏపీ ఎంసెట్ ఏప్రిల్ 20 నుంచి

ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఎంసెట్-2019ను ఏప్రిల్ 20నుంచి 24వరకు నిర్వహించనున్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్) షెడ్యూల్‌ను శనివారం విజయవాడలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ విజయరాజులతో కలిసి మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ ఏడాదీ అన్ని ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించనున్నారు. సెట్స్ తేదీ, కౌన్సెలింగ్, ఫలితాలు, పరీక్ష కేంద్రాలను గుర్తించేందుకు ఈసారి కొత్తగా 'ఏపీసెట్స్ నేస్తం' యాప్‌ను ఉన్నత విద్యామండలి రూపొందించింది.

ఉమ్మడి ప్రవేశ పరీక్షలు(సెట్స్)	పరీక్ష తేదీ
ఏపీఈసెట్	ఏప్రిల్ 19
ఎంసెట్(ఇంజినీరింగ్)	ఏప్రిల్ 20-22
ఎంసెట్(వ్యవసాయం)	ఏప్రిల్ 24
ఐసెట్	ఏప్రిల్ 26
పీజీఈసెట్	మే 1-4
ఎడ్‌సెట్	మే 6
లాసెట్	మే 6
పీఈసెట్	మే 8-15

చెన్నై విమానాశ్రయంలో 24 కిలోల బంగారం స్వాధీనం

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై విమానాశ్రయంలో 24 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఉదయం కస్టమ్స్ అధికారులు హాంకాంగ్ నుంచి చెన్నై వచ్చిన విమానంలోని ప్రయాణికులను సోదా చేయగా దక్షిణ కొరియాకు చెందిన ఇద్దరు మహిళల లగేజీలో 24 కిలోల బంగారం ఉంది. అక్రమంగా తీసుకొస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అధికారుల సమాచారంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. చెన్నైలో ఎవరి కోసం..ఈ బంగారం తీసుకొచ్చారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక అండ దండ ఏదీ!


- పన్నుల వాటా పెరగాలి
- ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని పెంచాలి
- తెలంగాణ పథకాలు.. కార్యక్రమాలను పరిశీలించండి
- వాటికి అవసరమైన నిధులు ఇవ్వండి
- 15వ ఆర్థిక సంఘానికి నివేదించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- సమగ్ర నివేదికను రూపొందిస్తున్న అధికారులు

కొత్తగా ఏర్పాటైన తమ రాష్ట్రానికి నిధులతో కేంద్రం అండగా నిలవాలని, ఆ దిశగా సిఫారసులు చేయాలని 15వ ఆర్థిక సంఘాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరనుంది. ఇక్కడ పలు అంశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని కోరనుంది. వీటితో పాటు వివిధ పథకాలకు సంబంధించి సమగ్రమైన నివేదికను రాష్ట్రప్రభుత్వం తయారు చేస్తోంది. ఇందుకు ప్రభుత్వ ఆర్థిక సలహాదారు జీఆర్‌రెడ్డితో పాటు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సహా ముఖ్య అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. పథకాల రూపకల్పనలో స్వేచ్ఛ, పన్నుల వాటా పెంపు, ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు, నగర, పట్టణ స్థానిక సంస్థలకు నిధులు, ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెంపు సహా వివిధ అంశాలను నివేదికలో పేర్కొంటున్నారు. 2017 నవంబరులో 15వ ఆర్థిక సంఘం ఏర్పాటైంది. ఇప్పటికే 16 రాష్ట్రాల్లో ఆర్థిక సంఘం పర్యటించింది. ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో పాటు.. వివిధ పార్టీలు, సంస్థలు, విభాగాల అభిప్రాయాలను తెలుసుకుంటోంది. వాస్తవానికి ఆర్థిక సంఘం ఇప్పటికే తెలంగాణకు రావాల్సి ఉండగా శాసనసభ రద్దు, ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడింది. కాబట్టి త్వరలో రాష్ట్రానికి రానుంది. ఇలా రాష్ట్రాల నుంచి సేకరించిన అభిప్రాయాలను ఈ ఏడాది చివరిలోగా కేంద్రానికి సంఘం అందజేయనుంది.

నీతి ఆయోగ్ సిఫారసు చేసినా కేంద్రం పట్టించుకోలేదు

రైతు బంధు పథకానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. కేంద్రం కూడా ఈ పథకం గురించి ఆలోచిస్తోంది. ఇంతటి ఉపయోగమున్న ఈ పథకానికి నిధులు కేటాయించాలి. రాష్ట్రంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి మిషన్ భగీరథ, వ్యవసాయ రుణాల మాఫీ, రైతు బంధు, రైతులకు వ్యక్తిగత బీమా సహా అనేక ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్న నేపథ్యంలో వీటికి నిధులను కేటాయించాలి. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు ప్రత్యేకంగా నిధులివ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసినా కేంద్రం ఇవ్వలేదు. భారీగా సాగునీటి ప్రాజెక్టులు చేపట్టిన నేపథ్యంలో కాళేశ్వరం సహా వివిధ ప్రాజెక్టులకు నిధులివ్వాలి.

రాష్ట్రప్రభుత్వం నివేదించనున్న అంశాలివే



- ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ ముందున్నా ఇక్కడ దృష్టి సారించాల్సిన అనేక అంశాలకు నిధులు అవసరం. హైదరాబాద్ సహా మూడు జిల్లాలు మాత్రం తలసరి ఆదాయంలో ముందున్నా మిగిలిన 28 జిల్లాల తలసరి ఆదాయం తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో వెనుకబడిన జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, పథకాల అమలుకు తోడ్పాటునివ్వాలి.
- కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా ఆరోగ్యం, విద్యకు సంబంధించి రూపొందించిన ప్రత్యేక పథకాలకే కాకుండా నేరుగా రాష్ట్రాలకు నిధులిచ్చి సొంతంగా రాష్ట్రానికి అవసరమైన పథకాలను రూపొందించుకునే స్వేచ్ఛను ఇవ్వాలి. కేంద్ర మార్గదర్శకాలతో పథకాలు అమలు చేయడం సమస్యగా ఉంది. విద్య, ఆరోగ్యం పథకాలు కేంద్రం అమలు చేయకుండా ఆ నిధులు రాష్ట్రానికి నేరుగా అందజేయాలి.
- కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన పన్నుల వాటాను పెంచాలి. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు పన్నుల వాటాను 42 శాతంగా నిర్ణయించింది. రాష్ట్రాల అవసరాలు పెరుగుతున్న నేపథ్యం ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలను అమలు చేయడానికి రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా ముందుకు వెళ్లడానికి వీలుగా పన్నుల వాటా శాతాన్ని పెంచాలి.
- ద్రవ్య నియంత్రణ, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిమితిని పెంచాలి. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మూడు శాతంగా నిర్దేశించగా రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో గరిష్ఠంగా దీన్ని మరో అర శాతం పెంచుకోవడానికి కేంద్రం అనుమతిస్తుంది. ఎఫ్ఆర్‌బీఎం నియంత్రణతో రాష్ట్రానికి నిధులు సమకూర్చుకోవడంలో అనేక ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. ఆర్థికంగా పటిష్ఠమైన స్థితిలో ఉన్న రాష్ట్రంలో బడ్జెట్ పరిధిలో నిధులు సమకూర్చుకోవడానికి ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని పెంచాలి.

ఈనాడు, హైదరాబాద్

వసతి గృహాల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్

- బీసీశాఖలో ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతం
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి వసతిగృహాలన్నింటిలో అమలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానం అమలు కానుంది. సాంకేతిక సమస్యల వల్ల వేలిముద్రల వ్యవస్థ విఫలం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు విధానాన్ని తొలుత ప్రయోగాత్మకంగా బీసీ సంక్షేమ వసతిగృహాల్లో ప్రారంభించింది. విద్యార్థుల హాజరును పరిశీలిస్తూ ఆ మేరకు నిధులు విడుదల చేస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మిగతా సంక్షేమ వసతి గృహాల్లోనూ ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) సహాయం తీసుకుంటోంది. విద్యార్థుల హాజరు, సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది.

వసతిగృహాల్లో చేతిరాత హాజరుతో గందరగోళ పరిస్థితులతో పాటు నిధుల వినియోగంలోనూ సమస్యలు ఎదురయ్యాయి. దీంతో విద్యార్థుల హాజరు మేరకు నిధులు ఖర్చు చేయాలని భావించిన ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇందుకు వసతి గృహాల్లో అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడం, కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలతో పూర్తిస్థాయిలో అమలు జరగలేదు. మళ్లీ చేతిరాతతో హాజరు వేయడం మొదలు పెట్టారు. కొన్నిచోట్ల రికార్డుల్లో చూపిస్తున్న హాజరు, అక్కడుంటున్న విద్యార్థుల సంఖ్యలో తేడాలు ఉన్నట్లు అధికారులు గమనించారు. ఈ నేపథ్యంలో నిర్వహణలో అవకతవకలను నివారించేందుకు వీలుగా ప్రభుత్వం ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ వ్యవస్థ అమల్లోకి తెచ్చింది. బీసీ శాఖ కమిషనరేట్ పరిధిలోని కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో విద్యార్థులు, సిబ్బంది హాజరు తెలుస్తోంది. బీసీ సంక్షేమశాఖలో చేపట్టిన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లోనూ అమలు చేయాలని ఆయా సంక్షేమశాఖల ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల వివరాలు

సంక్షేమశాఖ	వసతి గృహాలు	బాలురు	బాలికలు	మొత్తం విద్యార్థులు
ఎస్సీ	869	54,178	31,886	86,064
ఎస్టీ	621	70,614	62,879	1,33,493
బీసీ	755	43,987	23,423	67,410

టెలీమెట్రీ కేంద్రాల ఏర్పాటుపై క్షేత్రస్థాయికి కమిటీ

- రెండు రాష్ట్రాల్లో 21 నుంచి 25 వరకు పర్యటన

ఈనాడు, హైదరాబాద్: ప్రాజెక్టుల నుంచి విడుదలయ్యే నీటి లెక్కలు తేల్చే టెలీమెట్రీ యంత్రాలను ఏర్పాటు చేసే స్థలాలను గుర్తించేందుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చర్యలు చేపట్టింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రెండో దశ యంత్రాల ఏర్పాటును చేపడుతున్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల పరిధిలోని కాల్వల మీద మొత్తం 11 టెలీమెట్రీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాటిని బిగించాల్సిన ప్రాంతాలను గుర్తించేందుకు ఈ నెల 21 నుంచి 25 వరకు ముగ్గురు సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. ఏ ప్రాంతంలో బిగిస్తే నీటి ప్రవాహాన్ని కచ్చితంగా అంచనావేసే వీలుంటుందనే విషయాన్ని ఈ బృందం తేల్చనుంది. బృందంలో పుణెకు చెందిన జలవనరుల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు ఎన్.డి.అట్కేకర్, పి.ఎస్.కుంజీర్, వి.ఎన్.కట్టే ఉన్నారు. వీరు కర్నూలు జిల్లాలో శ్రీశైలం ప్రాజెక్టు కింద కేసీ కెనాల్, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాలువలపై పాలేరు, ఖమ్మం, తిరువూరు, విజయవాడ ప్రకాశం బ్యారేజీ కింద తూర్పు, పశ్చిమ ప్రధాన కాలువలు, గుంటూరు కాలువతో పాటు పోలవరం కాలువ తదితర ప్రాంతాలను పరిశీలించనున్నారు.

హాయ్

సైన్స్ ఆయుర్వేదానికి దగ్గరవుతోంది

సైన్స్ మూలాలను మన వేదాలు, పురాణాల్లో వెదుక్కోవడంలో తప్పేం లేదు. ఎందుకంటే ఆయుర్వేదాన్ని మనం పూర్తిగా దూరం పెట్టేశాం. 80ల్లో తొలిసారిగా నేను ఆయుర్వేద, అలోపతి డాక్టర్లను ఒకదగ్గర కూర్చోబెడితే ఆయుర్వేదాన్ని అసలు సైన్సే కాదని కొట్టిపారేశారు. ఇప్పుడదే సైన్స్ ఆయుర్వేదాన్ని గుర్తిస్తోంది. ఆయుర్వేదం సైన్స్‌కు దగ్గర కావటం లేదు... సైన్సే ఆయుర్వేదానికి దగ్గరవుతోంది. పసుపు, పాలు... నెయ్యి... ఇలా ప్రతి ఒక్కదాని ఔషధ విలువను సైన్స్ ఇప్పుడు గుర్తిస్తోంది. సైన్స్ అనేది గ్రోయింగ్ నాలెడ్జ్. కాకుంటే సైన్స్‌కు ఓపెన్‌మైండ్ అవసరం. ముందే కళ్లకు గంతలు కట్టుకొని కూర్చోకుండా ఓపెన్‌గా స్వీకరించాలి. పురాతనమైన ప్రతీదీ గొప్పది కాదు... అలాగని తీసిపారేయాల్సింది కాదు. అలాగని వేదకాలంలోనే కంప్యూటర్ ఉందనీ అనలేం. సాక్ష్యాల్లేకుండా మాట్లాడొద్దు. అదే సమయంలో వేదాలను పుక్కిటి పురాణాలుగా తీసిపారేయొద్దు. తెలుసుకోకుండానే ముందస్తుగా అభిప్రాయాలు ఏర్పరచుకోవటం, మూఢంగా వ్యతిరేకించటం, అంగీకరించటం... శాస్త్రవేత్తలకు విషంతో సమానం. పూర్తి ఓపెన్‌నెస్‌తో ఉంటేనే సరైన పరిశోధన చేయగలుగుతారు. ఆధ్యాత్మికతకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. మూఢత్వం పనికిరాదు.



పెయింట్లతో ఇంటినీ... పౌడర్లు, పర్‌ఫ్యూమ్‌లతో ఒంటినీ అలంకరించుకునే మనం... జీవితాల్ని మాత్రం కాలానికొదిలేసి కకావికలమవుతుంటాం!! ప్రతి జీవితం ఓ కళనీ... సంతోషాలు ఊరే జలనీ... ఎవరికి వారు నిజం చేసుకోవాల్సిన అందమైన కలనీ అంటారు... ప్రపంచానికి ఆనందాన్ని పంచుతున్న గురువు శ్రీశ్రీ రవిశంకర్! 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' అంటూ భారతీయ ఆధ్యాత్మికతలోని అంతసూత్రాలతో తయారు చేసిన ఆనంద మాత్రను విశ్వవ్యాప్తం చేస్తున్న శ్రీశ్రీ రవిశంకర్ తాజాగా రహస్య ధ్యాన ప్రక్రియ- విజ్ఞాన భైరవ్‌ను 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో ఆవిష్కరించబోతున్నారు. ఈ సందర్భంగా 'హాయ్'తో తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. బ్యాంకు ఉద్యోగానికి ప్రయత్నించిన ఆయన ఆధ్యాత్మిక గురువెలా అయ్యారో....సైన్స్‌కు ఆధ్యాత్మికతకున్న అవినాభావ సంబంధమేంటో... ఆయన సవివరంగా ముచ్చటించారు.

జీవితం తీర్చిదిద్దుకోవాల్సిన కళా? దానంతట అది సజావుగా సాగిపోదా?

పూలను ఇష్టం వచ్చినట్లు కుప్పగా పోయొచ్చు. లేదంటే వాటినే అందంగా అలంకరించొచ్చు. సృజనాత్మకతను అద్దటం వల్ల అందం పెరుగుతుంది. జీవితమూ అంతే! జంతువులు కూడా బతుకుతున్నాయి. ప్రతిరోజూ తింటున్నాయి. పడుకుంటున్నాయి. చచ్చిపోతున్నాయి. కానీ మనుషులుగా మన జ్ఞానమనేది వికసించాక జీవిత పరమార్థాన్ని, ఇతర విషయాల్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాం. ఎప్పుడైతే మనసంటే ఏంటో తెలుస్తుందో అప్పుడు ప్రశాంతంగా మారతాం. సృజనాత్మకత వికసించి జీవితంలో ఎంతో సాధిస్తాం. జీవితాన్ని పూర్తిస్థాయిలో వికసింపజేయటమే ఈ జీవన కళ!

తాజాగా ఆవిష్కరిస్తున్న విజ్ఞాన భైరవ్ ప్రత్యేకతేంటి?

విజ్ఞాన భైరవ్ అనేది అంతఃచేతనల విజ్ఞానం (సైన్స్ ఆఫ్ కాన్షియస్‌నెస్) శివపార్వతి సంవాదం... కశ్మీరీ శైవిజం నుంచి పుట్టిందిది. దాని ఆధారంగా రూపొందించిన, జీవితాన్ని మార్చేసే ధ్యానపద్ధతులను తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా పరిచయం చేస్తున్నాం. రహస్యమైన ఈ 112 ధ్యాన ప్రక్రియలను మూడు అంకాల్లో నా ఆధ్వర్యంలోనే ఆవిష్కరిస్తాం. తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్నాం! ఈ ధ్యాన పద్ధతులతో అంతర్ముఖంగా మౌనంగా మారి... చైతన్యవంతమవుతారు. మైండ్‌సెట్‌లో కాసింత మార్పులతో ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

మీ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో రైతుల కోసం కార్యక్రమాలు చేస్తోంది. వాటి ఫలితాలెలా ఉన్నాయి?

సేంద్రియ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని, జీరో బడ్జెట్ వ్యవసాయ పద్ధతులను రైతులకు నేర్పుతున్నాం. ఈ దేశంలో ఎలాంటి రసాయనాలు, ఎరువులు వేయకుండా వ్యవసాయం చేసిన చరిత్ర మన దేశానికుంది. అలా చేసిన సందర్భాల్లో ఫలితాలు కూడా బాగున్నాయి. ఇప్పుడు చాలామంది రైతులు మళ్లీ సంప్రదాయ పద్ధతులకు మళ్లుతున్నారు.

ఉద్యోగానికని వెళ్లి ధ్యానం నేర్పొచ్చా

● మీ పేరులోని రెండు శ్రీలు (శ్రీశ్రీ) ఏంటి? వీటికేమైనా ప్రత్యేకతుందా?

(నవ్వుతూ...) ఏమీ లేదు. అంతా శ్రీశ్రీశ్రీ అంటుంటే ఎందుకు మూడు... రెండు సరిపోదా అని శ్రీశ్రీ చాలన్నాను. అలా ఉండిపోయిందంతే! ప్రత్యేకతేం లేదు!

● మీ ఆధ్యాత్మిక ప్రయాణం విధి లిఖితమనుకుంటున్నారా? లేక కావాలని ఎంచుకున్న పథమా?

నేనేది చేసినా సహజ సిద్ధంగానే చేస్తా. నాలో సహజసిద్ధంగా ఉన్నదీ... నాకు సహజంగా అబ్బిందే అనుసరిస్తా!

● మీ బాల్యం అందరిలానే సహజంగానే గడిచిందా? లేక...!

అందరిలాగే నా బాల్యమూ సాధారణంగానే గడిచింది. కానీ పెద్దవాళ్ల సాంగత్యాన్ని ఎక్కువగా ఇష్టపడేవాడిని. అదొక్కటే తేడా! మహాత్మాగాంధీకి భగవద్గీత బోధించిన పండిట్ సుధాకర్ చతుర్వేదిగారి దగ్గరకు వెళ్లేవాడిని. ఆయనింకా బతికే ఉన్నారు. వయసు 118 సంవత్సరాలు.. గాంధీ గురించి కథలు చెప్పేవారాయన. యుక్తవయసులో మహర్షి మహేశ్ యోగి, ఆనందమయి మా, స్వామి లక్ష్మణ్‌ఝూ లాంటి కొంతమంది యోగులను కలుసుకున్నా. సైన్స్ ఇష్టమైన సబ్జెక్ట్.

● చదువుల్లో బాగా రాణించిన మీరు ఎన్నడూ ఉద్యోగాల కోసం ప్రయత్నించలేదా?

ఒకసారి బ్యాంకు ఉద్యోగం కోసమని ఇంటర్వ్యూకు వెళ్లా. అది మా అమ్మను సంతృప్తి పర్చటానికే! తీరా అక్కడికి వెళ్లాక నేను ధ్యానం నేర్పుతానని చెప్పగానే... వారంతా దానిపై ఆసక్తి చూపారు. దీంతో నేనే వారిని ప్రశ్నలడగాల్సిన పరిస్థితి వచ్చింది.

● అంటే మీరు ఆధ్యాత్మికతవైపు రావటం మీ అమ్మకు ఇష్టం లేదా?

నా తోటివాళ్లంతా కొద్ది సేపట్లోనే పూజ ముగించుకొని ఆడుకోవటానికి వెళుతుంటే నేను మాత్రం పూజ, ధ్యానంలో ఎక్కువ సేపు గడపటం మా అమ్మకు ఆందోళనగా ఉండేది. అందుకే నేను ఉద్యోగంలో చేరాలని ఆశించేది. కానీ ఎప్పుడైతే ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆరంభించానో అమ్మ కూడా పూర్తిగా ఇందులో భాగస్వామైంది. చివరివరకూ మద్దతిచ్చింది.

● అనుభవంలోకి తెచ్చుకొని నమ్ము

మన భారత్‌లో సైన్స్, ఆధ్యాత్మికత కలసి నడుస్తాయి. మన ఆధ్యాత్మికతలో తొలుత తత్వబోధన అని చెబుతారు. అంటే పంచభూతాల గురించి... ఆ తర్వాత 36 తత్వాలుంటాయి. చిట్టచివరిది శివతత్వం! కాబట్టి.. పదార్థం (మెటీరియల్) నుంచి పారమార్థికం (ఆధ్యాత్మికం) దాకా అన్ని శ్రేణుల్లో విస్తరించి ఉన్నాం మనం! పదార్థం, చేతనల కలయికే మనిషి! కాబట్టి సైన్స్, ఆధ్యాత్మికతను వేర్వేరుగా అనుకోవటం తప్పు. అలా అనుకోవటం పాశ్చాత్య దృక్పథం! ఇప్పుడు వాళ్లు కూడా మన దారిలోకే వస్తున్నారు. ఐన్‌స్టీన్, హసెన్‌బర్గ్ సిద్ధాంతాలు మన మార్గాన్నే చెబుతున్నాయి. ఆధ్యాత్మికత సైన్స్‌కు వ్యతిరేకం అనే అపోహను సాపేక్ష సిద్ధాంతం పటాపంచలు చేసింది. మొదలు నమ్ము... ఎన్నడో ఓనాడు నీ అనుభవంలోకి వస్తుందని పాశ్చాత్య మతాలు చెబుతాయి. తొలుత అనుభవంలోకి తెచ్చుకొని నమ్మమంటుంది మన పద్ధతి. సైన్స్‌దీ అదే దారి. అందుకే మన చరిత్రలో, సంస్కృతిలో ఎన్నడూ ఏ శాస్త్రవేత్తనూ వ్యతిరేకించిన దాఖలాలు లేవు. నాస్తికులనూ అంగీకరిస్తామిక్కడ.



● ఆధ్యాత్మికవేత్త శాస్త్రీయంగా ఉండడం ఎంత మేరకు సాధ్యం?

ఆధ్యాత్మికవేత్తలు ఉండాల్సిందే శాస్త్రీయంగా! సైన్స్ అంటేనే బాహ్య ప్రపంచంలోని ప్రతి విషయాన్నీ ఇది ఏంటీ అని తెలుసుకోవటం! ఆధ్యాత్మికత అంటే 'నేనెవర్ని?' అంటూ అంతర్ ప్రపంచంలోని మనసు, ఆలోచనలు, ఉద్వేగాలను అర్థం చేసుకోవటం! మన భారతదేశంలో శాస్త్రం (సైన్స్), ఆధ్యాత్మికల మధ్య పాశ్చాత్య దేశాల్లో మాదిరిగా ఎన్నడూ ఘర్షణ లేదు. వేదాలు, ఉపనిషత్తులు రాసిన రుషులే ఆయుర్వేదం, సర్జరీ, మెటలర్జీ... తదితర శాస్త్రసంబంధాలనూ రాశారు. నిజానికి వారంతా సహజసిద్ధమైన శాస్త్రవేత్తలు!

● ఆధునిక, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలోనూ మీ సూత్రం పనిచేస్తుందా?

ఆధునిక సమాజానికీ ఆధ్యాత్మికత ఎంతో అనుకూలమైంది. అందుకే మా కార్యక్రమాలకు ప్రపంచం నలుమూలల నుంచి దేశవిదేశాల నుంచి చాలామంది వస్తున్నారు. కొద్ది నిమిషాల ప్రాణాయామం, ధ్యాన టెక్నిక్‌లతో మన అంతరంగంలో ఎంతో మార్పును గమనిస్తాం. మనసు ప్రశాంతంగా మారుతుంది. కోపం తగ్గుతుంది. ప్రాణశక్తి పెరుగుతుంది. జీవితం అర్థవంతంగా అవుతుంది. రాతి యుగమైనా... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగమైనా.... మనిషికి సంతోషం కావల్సిందే. ఈ కాలంలో ఇంకా ఎక్కువ అవసరం. ఆ ఆనందం ఆధ్యాత్మికత నుంచే వస్తుంది.

మన యువకులు ప్రతిభావంతులు

వేష భాషల్లో, ఆహార్యంలో, ఆహారంలో మనం భిన్నంగా ఉన్నా... ఆత్మీయత, సేవ, ప్రేమ, నిజాయతీల్లాంటి విలువల్లో మనమంతా ఒక్కటే! అన్ని సంస్కృతులు, మతాలు ఒకేలా ఉంటాయి. నిజానికి ఇవన్నీ అన్ని మతాల మూలాలే! ఈ మూలాన్నే ఆధ్యాత్మికత అంటాన్నేను. అదే భిన్నత్వంలో మనందరినీ ఏకం చేస్తుంది. మన యువకులు ఎంతో ప్రతిభావంతులు. కష్టపడి పనిచేసే తత్వంతో పాటు బలమైన విలువలున్నవారు. కాస్త దారి చూపితే అద్భుతాలు సృష్టించగలరు.

● శాస్త్రసాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినా ప్రపంచంలోని నలుమూలలా సమాజంలో అస్తిత్వ ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయింకా! దీన్నెలా అర్థం చేసుకోవాలి?

నిజమే! ఈ ఘర్షణ వాతావరణానికి కారణం మనల్ని మనం సరిగ్గా అర్థం చేసుకునే ప్రయత్నం చేయకపోవటం. తమ గురించి తాము, తమ మతాలను తాము సరిగ్గా అర్థం చేసుకోకపోవటం, ఇతర మతాలను అపార్థం చేసుకోవటం వల్ల, ఒత్తిడి వల్ల ఈ సంఘర్షణలు ఏర్పడుతున్నాయి. మన మనసు ఎలా పనిచేస్తుందో, భావోద్వేగాలు మనపై ఎలాంటి ప్రభావం చూపుతాయో మనం ధ్యాస పెట్టలేదు. ప్రతికూల భావోద్వేగాలను ఎలా తట్టుకోవాలో మనకు ఇంట్లోగానీ, బడిలోగాని చెప్పలేదు. దీంతో ఒత్తిడికి గురవుతూ ఇతరులనూ గురిచేస్తున్నారు. ఇలాంటప్పుడే ఆధ్యాత్మికత ఉపయోగపడుతుంది. ఒత్తిడిని తగ్గిస్తూ.. జీవితంలో నిజమైన సంతోషానికి దారులు తెరుస్తుంది. సంఘర్షణల నుంచి సమాజాన్ని బయటపడేసే సత్తా ఆధ్యాత్మికతకే ఉంది. సరిగ్గా అర్థం చేయించకపోవడం, అర్థం చేసుకోకపోవడం వల్లే సమాజంలో సంఘర్షణలుంటాయి! ఆధ్యాత్మికత ఈ భావవ్యక్తీకరణను పరిపూర్ణం చేస్తుంది. అంతేగాదు ఎదుటివారి భావనల్ని అర్థం చేసుకునే శక్తినిస్తుంది. ఇతరులను అర్థం చేసుకొని, తమ భావజాలాన్ని సమర్థంగా వినిపించగలిగినప్పుడు సంఘర్షణకు తావెక్కడ?

● 70 ఏళ్ల మన స్వతంత్ర దేశాన్ని చూస్తే మీకేమనిపిస్తుంది? నిరాశ కలుగుతుందా?

నాలో ఏదీ నిరాశ కలిగించదు. మన దేశంలో చేయటానికి చాలా అవకాశముంది. ఇరుగుపొరుగు దేశాలతో పోల్చుకుంటే ఈ 70 సంవత్సరాల్లో సుస్థిరమైన ప్రజాస్వామ్యాన్ని సాధించుకున్నాం! ఒక్కటంటే ఒక్కరోజు కూడా మనం సైనికపాలనలో లేం! ఆఫ్రికా దేశాల మాదిరి తిరుగుబాట్లూ లేవు. 70 ఏళ్లలో ఇది మనం సాధించిన ఘనతే. భారీ జనాభా, బోలెడన్ని భాషలున్నా శాస్త్రసాంకేతిక రంగాల్లోనూ ఎంతో పురోగతి సాధిస్తున్నాం. మౌలిక సదుపాయాల్లో, విద్యలో మాత్రం ఇంకా చాలా చేయాల్సి ఉంది.

● పాశ్చాత్య ఆధ్యాత్మికతకూ, మనకూ తేడా ఏంటి?

పాశ్చాత్యులు మొదట నమ్ము... తర్వాత అనుభవించు అంటారు. అదే మన సంప్రదాయంలో తొలుత అనుభవంలోకి వచ్చాక నమ్మమంటాం. మన సంప్రదాయ వాఙ్మయం చూస్తే... ప్రతీదీ ప్రశ్నతోనే ఆరంభమవుతుంది. బోలెడన్ని ప్రశ్నలు... సమాధానాలు! విద్యార్థులకు ప్రశ్నించి, సరిగ్గా అర్థం చేసుకునే స్వేచ్ఛనిచ్చింది మన వ్యవస్థ! భగవద్గీతలో కూడా అర్జునుడికి కృష్ణుడు చెప్పిందదే! చెప్పింది విన్నాక నీకు తోచింది చేయమన్నాడు. అంతేగాని బలవంతంగా ఎవరిపైనా రుద్దే బోధన మన పద్ధతి కాదు.

● జీవితానికి ఆధ్యాత్మిక లక్ష్యమేంటి?

ఈ ప్రశ్న తలెత్తటమే పరిణతికి నిదర్శనం. అలాగని ఈ ప్రశ్నకు సమాధానం వెదికేందుకు తొందరపడాల్సిన పనిలేదు. ఈ ప్రశ్న అమూల్యమైంది. సమాధానం విలువైంది. జీవితంలో పదేపదే వేసుకోవాల్సిన ప్రశ్న ఇది. పదేపదే ఉపయోగించుకునే రహదారిలాంటిదిది. వేసుకున్న ప్రతిసారీ కొత్త దర్శనం చేస్తుందిది!

– రేగళ్ల సంతోష్‌కుమార్

గుడ్డిగా వ్యతిరేకించవద్దు

సనాతన విషయాలను గుడ్డిగా వ్యతిరేకించాల్సిన పనిలేదు. అవకాశం ఉందేమో పరిశీలించాలే తప్ప ముందే ఏ విషయాన్నీ కొట్టిపారేయకూడదు. ఆయుర్వేదం ఇప్పుడు దారి చూపుతోంది కదా! చైనా సంప్రదాయ వైద్యాన్ని కూడా ప్రపంచం గుర్తిస్తుందిప్పుడు. ఎందుకంటే బలమైన మూలాలు బయటపడ్డాయి. చైనీయులు వాటి వెనక బలంగా నిలబడ్డారు. దురదృష్టవశాత్తు భారత్‌లో మనం మన ఆయుర్వేదం వెనక బలంగా నిలబడలేదు. దేశ చరిత్రలో తొలిసారి గత మూడునాలుగేళ్లుగా ఆయుర్వేదానికి ఓ మంత్రిత్వ శాఖ ఏర్పడింది. ఆయుర్వేద విజ్ఞానాన్ని గ్రంథస్తం చేస్తున్నాం. సైన్స్ చేయాల్సిందదే. పరిశోధనల్ని ప్రోత్సహించే సైన్స్ దేన్నీ గుడ్డిగా నమ్మకపోవచ్చు. అలాగే గుడ్డిగా వ్యతిరేకించొద్దు కూడా! పరిశీలించి, పరిశోధించి నిర్ణయించాలి. గుడ్డిగా నమ్మేవాళ్లు, గుడ్డిగా వ్యతిరేకించేవారు సైంటిస్టులు కాజాలరు.

అన్నీ వేదాంత తీరానికే

జర్మనీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ప్రొఫెసర్ డాక్టర్ హన్స్ పీటర్ డర్ ఓ మాట చెప్పారు. న్యూటన్ చెప్పిన భూమ్యాకర్షణ నుంచి మొదలెడితే క్వాంటమ్ మెకానిక్స్ దాకా సైన్స్ ప్రయాణిస్తున్న దారి వేదాంతంతోనే ముగుస్తుందని!

కశ్మీరీలు మంచివారు

కశ్మీర్ ప్రజలు చాలా మంచివారు. వాళ్లూ మనలాంటివారే! మనందరి మూలాలు ఒక్కటే! వ్యక్తిగతంగా అంతా మంచివారే. కానీ కొన్ని శక్తులు ఒకరిపై ఒకర్ని ఎగదోసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొంతమందికి ఘర్షణ సృష్టించటమే పని! వీరి కారణంగా ఒకప్పటి స్వర్గం నేడు కష్టాలకడలిగా మారింది. కానీ ప్రజలు ఇప్పుడిప్పుడే మేలుకొంటున్నారు. విధ్వంసకారుల మాయమాటల్లో పడకుండా తప్పించుకుంటుండటం శుభపరిణామం. అయినా కశ్మీర్ ప్రజలకు భావోద్వేగ పరంగా ఆదుకునే ఓ ఆపన్నహస్తం కావాలి.

ఈనాడు సినిమా


నాని

ప్రయత్నిస్తూ ఓడిపోయినవాడు లేడు

క్రికెట్‌లో మూడు పదుల వయసు దాటిందంటే చాలు. కెరీర్ ముగింపునకు సమయం దగ్గరపడినట్టే అని భావిస్తుంటారు. అర్జున్‌కి కూడా 36 ఏళ్ల వయసొచ్చిందని 'పిల్లల్ని ఆడించే వయసులో మనకు ఆటలు ఎందుకు...?' అన్నారు. ఇక ఎంత ప్రయత్నించినా నువ్వేం చేయలేవంటూ నిరుత్సాహపరిచారు. కానీ అర్జున్ మాత్రం ఆ మాటల్ని పట్టించుకోలేదు. 'ఆపేసి ఓడిపోయినవాడు ఉన్నాడు కానీ, ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు' అంటూ తన ఆటని కొనసాగించాడు. అతని పట్టుదలకి మైదానంలో ఎన్నెన్ని రికార్డులు బద్దలయ్యాయో తెలియాలంటే 'జెర్సీ' చూడాల్సిందే. నాని కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. అనిరుధ్ స్వరకర్త. సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ కథానాయకుడు నాని ట్విటర్ ద్వారా టీజర్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో నాని 36 ఏళ్ల అర్జున్ అనే క్రికెటర్‌గా కనిపించబోతున్నాడు. ఏప్రిల్‌లో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నేను మొదట దర్శకుణ్ని. ఆ తరవాత నాలో ఓ కథకుడు, ఓ తెలుగువాడు, ఓ ఎన్టీఆర్ అభిమాని ఉంటాడు. దర్శకుడిగా ఏం కావాలి? కథకుడిగా కథకు ఏం కావాలి? తెలుగువాడిగా ఎన్టీఆర్‌ను ఎలా చూడాలి? ఇవన్నీ నాకు ముఖ్యమే. ఓ అభిమానిగా నేను ఆయన్ని ఓ విధంగా చూడాలనుకుంటాను. కానీ కథకి అది అవసరం కాకపోవొచ్చు. అందుకే నా ఇష్టాల్ని కూడా పక్కన పెట్టాను. ఈ సినిమా చూసి 'అందులో ఈ సీన్ ఎందుకు లేదు? ఆ సినిమా గురించి ప్రస్తావన ఎందుకు లేదు' అంటూ కొంతమంది మాట్లాడి ఉండొచ్చు. కానీ. ఈ సినిమాలో చూపించిన ప్రతి సన్నివేశం వెనుక ఓ ఉద్దేశం ఉంది. 'ఆకు చాటు పిందె తడిసె' వాన పాట పెట్టడానికి ఓ కారణం ఉంది. 'సర్దార్ పాపారాయుడు', 'బొబ్బిలి పులి' సినిమాలు చూపించడానికి ఓ కారణం ఉంది. ఏ పాత్రా అనవసరంగా వచ్చి వెళ్లింది లేదు. కొన్ని సన్నివేశాలు తీసి కూడా పక్కనపెట్టాల్సి వచ్చింది. కన్యాశుల్కం, రక్తసంబంధం చిత్రాలకు సంబంధించి కొన్ని మంచి విషయాలున్నాయి. కెవిరెడ్డిగారి చివరి రోజుల్లో.. ఆయనకీ ఎన్టీఆర్‌కీ మధ్య ఓ గొప్ప సంఘటన జరిగింది. దాన్ని చిత్రీకరించి తెరపై కూడా చూసుకున్నాం. కానీ చివర్లో పక్కన పెట్టాల్సివచ్చింది. ఇలా చాలా ఉన్నాయి.



ఆ సొగసు కట్టిపడేస్తుంది



నాలుగేళ్ల ప్రయాణంలోనే దక్షిణాదిలోని నాలుగు భాషల్లోనూ అవకాశాలు అందుకొంది అనుపమ పరమేశ్వరన్. ఏ భాషలోకి వెళ్లినా మొదట భాషపైనే దృష్టి పెడతానని చెబుతోందామె. కొత్త భాష నేర్చుకొనే విషయంలో నాకు తెలిసిన కొన్ని కిటుకులు బాగా పనిచేస్తాయంటోంది అనుపమ. నటించిన ప్రతి చోటా నేను చేసిన పాత్రలకి పేరొచ్చిందంటే అక్కడి భాషని అర్థం చేసుకోవడం వల్లే అని ఆమె చెప్పుకొచ్చింది. "భాష తెలిస్తే నటుల పని మరింత సులభం అవుతుంది. కథ, పాత్రల ఔచిత్యాన్ని మరింత బాగా అర్థం చేసుకొని ఒదిగిపోతాం. కొత్త భాష అనగానే మొదట ఆ భాషలోని సినిమాల్ని బాగా చూస్తాను. ఆ తర్వాత చుట్టూ ఉన్న వ్యక్తులతో ఏ మాత్రం బెరుకు లేకుండా స్థానిక భాషలోనే మాట్లాడటం మొదలుపెడతా. తప్పో ఒప్పో మొదట మాట్లాడితేనే కదా తెలిసేది! కానీ నాకెన్ని భాషలు తెలిసినా... తెలుగుతో మాత్రం ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. ఒకొక్క చోట ఒక్కో యాస వినిపిస్తుంటుంది. ఆ మాటల్లో సొగసు ఇట్టే కట్టిపడేస్తుంటుంది. చిత్రీకరణల కోసం ఎక్కడికి వెళ్లినా మొదట అక్కడ జనాలు మాట్లాడే తీరునే గమనిస్తుంటా. అదొక అలవాటైపోయింద"ని చెబుతోంది అనుపమ.

అనుపమ పరమేశ్వరన్

చేసింది తొమ్మిదే సినిమాలు...

అయితేనేం అందులో ఓ 'గమ్యం' ఉంది. ఓ 'వేదం' ఉంది.

'కృష్ణం వందే జగద్గురుమ్', 'కంచె', 'గౌతమిపుత్ర శాతకర్ణి' ఇలా మేలిమి ముత్యాల్లాంచి చిత్రాలున్నాయి. ఇంతకంటే ఏం కావాలి? అందుకే తెలుగు చిత్రసీమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలిగారు క్రిష్. ఎన్టీఆర్ జీవిత కథని తెరపై చూపిస్తూ, అదీ రెండు భాగాలుగా మలుస్తూ.. కేవలం 100 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేశాడు. ఓ బయోపిక్‌ను రెండు భాగాలుగా తెరకెక్కించడం, వాటిని నెల రోజుల వ్యవధిలోనే విడుదల చేయడం ఓ అరుదైన సంగతి. ఆ ఘనత క్రిష్‌కే దక్కింది. తొలి భాగం 'కథానాయకుడు' విడుదలై ప్రశంసలు అందుకుంటున్న తరుణంలో.. రెండో భాగం 'మహానాయకుడు' షూటింగ్‌లో బిజీ అయిపోయారు క్రిష్. ఈ సందర్భంగా క్రిష్‌తో సంభాషించింది 'ఈనాడు సినిమా'.

రెండు ఇంటర్వెల్స్ ఇద్దామనుకున్నాం



'కథానాయకుడు' విజయాన్ని ఆస్వాదిస్తూనే 'మహానాయకుడు' కోసం రంగంలోకి దిగినట్టున్నారు?

అవును. జీవితం అనుభూతుల భాండాగారం. కష్టాన్నీ, బాధనీ, ఆఖరికి విజయాన్నీ మర్చిపోయేలా చేసేది పని మాత్రమే. 'మహానాయకుడు' సెట్లో 'కథానాయకుడు' విజయోత్సవాన్ని జరుపుకోవడం మరో గొప్ప ఆనందం. శనివారం పొద్దునే షూటింగ్ మొదలైంది. కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నాం. మరో పది రోజుల షూటింగ్ మిగిలి ఉంది. ఈ ఉత్సాహంతోనే ఈ షెడ్యూల్ పూర్తి చేస్తాం.

ఓ కథానాయకుడితో, ఓ కథతో రెండు సినిమాలు చేస్తున్నారు. ఈ ప్రయాణం ఎలా అనిపిస్తోంది?

రెండేళ్ల క్రితం ఇదే రోజున 'గౌతమిపుత్ర శాతకర్ణి' విడుదలైంది. అదో శకపురుషుడి కథ. ఇప్పుడు యుగపురుషుడి కథని తెరకెక్కించే అవకాశం నాకు దొరికింది. నేను ఎలాంటి కథ చేస్తున్నా, అది వినూత్నంగా ఉందా? వినోదాత్మకంగా అనిపిస్తుందా? అర్థవంతంగా ఉంటుందా? అనేదే ఆలోచిస్తాను. ఆ లక్షణాలు 'ఎన్టీఆర్'లో కనిపించాయి. తెలుగులో ఓ వ్యక్తి కథ సినిమాగా చెప్పాలంటే.. మొట్టమొదటగా గుర్తొచ్చే వ్యక్తి ఎన్టీఆర్. ఆ కథ నేను చెప్పడం నా అదృష్టం. స్క్రిప్టు దశలోనే నాలుగున్నర గంటల కథ తేలింది. మూడొందల రెండు సినిమాలు చేసిన నటుడాయన. దర్శకుడిగా 18 చిత్రాలు చేశారు. అందులో చారిత్రక చిత్రాలు, పౌరాణికాలు, జానపదాలు.. ఇలా చాలా ఉన్నాయి. 'రెండు ఇంటర్వెల్స్ ఇచ్చి ఒకే సినిమాగా చెబుదామా' అనిపించింది. కానీ అది వర్కవుట్ అవ్వదు. అందుకే ఈ కథని రెండు భాగాలుగా చేశాం. 'దానవీరశూరకర్ణ' నాలుగ్గంటల సినిమా. అది చూశారు కదా, ఇదీ ఓ సినిమాగా మలిస్తే చూస్తారులే అనిపించింది. కానీ తరం మరింది. ఈనాటి ప్రేక్షకుల అభిరుచికి తగినట్టుగా చెప్పాలంటే రెండు భాగాలు తప్పనిసరి.

విడుదల తేదీ ముందే ఫిక్స్ చేసుకుని బరిలోకి దిగారు. తక్కువ సమయంలో రెండు భాగాలు పూర్తి చేయడం దర్శకుడిగా కష్టం అనిపించలేదా?

పట్టుదల, ప్రణాళిక ఉంటే ఏదీ అసాధ్యం కాదు. తేజగారు ఉన్నప్పుడు ఇది దసరా సినిమా. నేనొచ్చాక సంక్రాంతికి షిఫ్ట్ చేశాం. ఎన్టీఆర్‌గారు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తేదీ జనవరి 9, 1983. ఎలాగూ సంక్రాంతికి వద్దామనుకున్నాం కదా, జనవరి 9నే విడుదల చేస్తే బాగుంటుంది అనిపించింది. నిజానికి సంక్రాంతికి అన్ని రోజుల ముందు సినిమా విడుదల చేయడం కూడా వ్యాపార పరంగా సరైన నిర్ణయం కాదు. కానీ తన తండ్రికి ఘనమైన నివాళి ఇవ్వాలన్న ఉద్దేశంతోనే బాలకృష్ణగారు ఈ చిత్రాన్ని జనవరి 9న విడుదల చేశారు. 'కంచె' కేవలం 54 రోజుల్లో పూర్తి చేశాం. 'గౌతమి పుత్ర శాతకర్ణి' 79 రోజుల్లో చేశాం. ఆ స్ఫూర్తితోనే రంగంలోకి దిగాం. అదృష్టవశాత్తూ నాకు మంచి టీమ్ దొరికింది.

కథంతా పూర్తయ్యాక మీరొచ్చారా? లేదంటే మీరొచ్చాకే పూర్తయిందా?

అప్పటికే స్క్రిప్టు ఉంది. కానీ నా మనసులో నాకంటూ ఓ కథ ఉంది. ఓ కథకు నేను పూర్తి స్థాయిలో న్యాయం చేయాలంటే అది నాలోంచి పుట్టాలి. ఆలోచన నాదై ఉండాలి. అందుకే నేనే కూర్చుని పూర్తి స్థాయిలో కథ సిద్ధం చేశా.

ఎన్టీఆర్ కథ చెప్పడం దర్శకుడిగా ఓ గౌరవం. ఎక్కడ తప్పు చేస్తారా అని చాలామంది చూస్తుంటారు. ఆ ఆలోచనలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదా?

ఎవరేం మాట్లాడినా పట్టించుకోకూడదనుకున్నా. రాజకీయం, కులం.. వీటికి అతీతంగా ఆలోచించి చూడాల్సిన సినిమా ఇది. నేను సూర్యుడి ముందు దివిటీ పెట్టాలనుకోలేదు. భూతద్దం పెట్టి భాస్వరం రగిలిద్దామనుకున్నా. అనుక్షణం అప్రమత్తంగానే ఉన్నాను. ఎవరైనా ఏమైనా అనుకుంటారా? అని ఆలోచించుకుంటూ పనిచేస్తే ఒక్క అడుగూ ముందుకేయలేం .

తొలి భాగం సినిమాలకు సంబంధించింది. విమర్శలకు తావు లేకుండా సాగిపోయింది. రెండోభాగంలో వివాదాస్పదనమైన అంశాలు చాలా ఉంటాయి కదా?

ఇది కల్పితం కాదు. జీవితం. ఎప్పుడు ఏం జరిగింది అనేది లిఖితంగానే ఉంది. అప్పటి దినపత్రికలు తిరగేస్తే.. ప్రతిదీ తొలి పేజీలోనే కనిపిస్తుంటాయి. కేవలం పుస్తకాలే చదవలేదు. ఎన్టీఆర్ కథపై చాలా పరిశోధించా. ఎన్టీఆర్‌ని ఒకొక్కరూ ఒక్కో కోణంలో చూశారు. కానీ చాలామంది దృష్టిలో ఆయన ఓ మాయ. ఎవరేం చెప్పినా, వాటిలో నిజాలనే తీసుకుని, వాటికి ఓ అందమైన రూపం ఇచ్చే ప్రయత్నం చేశాను. ఈ బయోపిక్ ముఖ్య ఉద్దేశం ఎన్టీఆర్‌కి సంబంధించిన కథ చెప్పడమే కాదు.. ఆయన అంతరంగాన్ని కూడా ఆవిష్కరించడం. మేం అదే చేశాం.

ఇప్పటి వరకూ వచ్చిన బయోపిక్‌లలో మీకు బాగా నచ్చిందేంటి?

అబ్రహం లింకన్, గాంధీ, మహానటి చాలా ఇష్టం.

తదుపరి చిత్రం ఎవరితో?

ప్రస్తుతం 'మహానాయకుడు' పనిలో బిజీగా ఉన్నా. ఈ సినిమా కూడా విడుదలయ్యాక రెండు చిత్రాలకు సంబంధించిన విజయాన్ని పరిపూర్ణంగా ఆస్వాదించి, ఆ తరవాతే కొత్త సినిమా గురించి ఆలోచిస్తా.

జీవిత కథలను తెరకెక్కిస్తున్నప్పుడు ఉత్తరాది వాళ్లు మనకంటే భిన్నంగా ఏం ఆలోచిస్తారు?

సినిమా మేకింగ్‌లో ఉత్తరాదికీ, దక్షిణాదికీ తేడా ఉంది. అదే.. బయోపిక్‌లలోనూ కనిపిస్తుంది. మనవాళ్లు అందరికీ నచ్చే విషయాల్ని తెరపై చూపించాలనుకుంటారు. వాళ్లు అలా కాదు. పాటలు లాంటి కమర్షియల్ అంశాలు లేకుండానే సినిమాలు తీసేస్తారు. ఎక్కడైనా ఓ కథని కథగా చెప్పడమే బాగుంటుంది. కానీ ఎవరి పద్ధతులు వాళ్లవి.

బాలీవుడ్‌లో 'మణికర్ణిక' తెరకెక్కించారు. దర్శకుడిగా మీ పేరు పక్కన కంగనా రనౌత్ తన పేరు చేర్చుకున్నారు. అసలు మీ ఇద్దరికీ మధ్య ఏం జరిగింది?

'మణికర్ణిక' కోసం 109 రోజులు షూట్ చేశాం. ఏప్రిల్ 27న విడుదల చేద్దామనుకున్నాం. తరవాత ఆగస్టు 15కి మారింది. 'మణికర్ణిక' రీ రికార్డింగ్‌లో ఉన్నప్పుడు 'ఎన్టీఆర్'కి అవకాశం వచ్చింది. 'మరో పదిహేను రోజుల్లో మిగిలిన ప్యాచ్ వర్క్ పూర్తి చేద్దాం' అనుకుని 'ఎన్టీఆర్' కోసం వచ్చేశా. కానీ ఎప్పుడైతే సినిమా చేతులు మారిందో.. రకరకాల మార్పులు మొదలయ్యాయి. సోనూసూద్‌ని హఠాత్తుగా తొలగించి, అప్పటి వరకూ ఆయనపై తెరకెక్కించిన సన్నివేశాలు మరో నటుడితో రీషూట్ చేశారు. కథని తప్పుదోవ పట్టించి చరిత్రని వక్రీకరించారు. ఈ విషయం గురించి ఏం మాట్లాడినా 'మణికర్ణిక' శోభ తగ్గుతుంది. అందుకే వివాదాలకు దూరంగా ఉండాలనుకుని మౌనంగా ఉన్నా.

సోనూసూద్‌ని తొలగిస్తున్న విషయం మీకు తెలుసా?

గొడవంతా అక్కడే జరిగింది. అదే పెద్ద తప్పు. అలా జరిగి ఉండకూడదు. ఈ విషయంలో సోనూసూద్ తప్పేం లేదు. నటుడిగా ఆయన చేసింది వందశాతం కరెక్ట్.

'మణికర్ణిక' టీమ్‌తో ఇప్పటికీ సంబంధాలు కొనసాగుతున్నాయా?

కొనసాగుతున్నాయి. అది నా సినిమానే...

బాలీవుడ్‌లో సినిమాలు కొనసాగిస్తారా?

నా కెరీర్‌లో పది సినిమాలు చేస్తే మూడేళ్లు బాలీవుడ్‌లోనే ఉండాల్సివచ్చింది. ఇప్పుడు సమయాన్ని వృథా చేయదలచుకోలేదు. తెలుగు సినిమాలు చేసుకుంటా.

'కేరాఫ్ కంచరపాలెం'పై కేటీఆర్ అభ్యర్థన

జాతీయ సినీ పురస్కారాల పోటీలో 'కేరాఫ్ కంచరపాలెం'కి అర్హత కల్పించాలని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్‌లని కోరారు. గతేడాది ప్రేక్షకుల ముందుకొచ్చిన తెలుగు చిత్రం 'కేరాఫ్ కంచరపాలెం'. ఆ చిత్ర నిర్మాత ప్రవీణ పరుచూరి అమెరికా పౌరురాలు కావడంతో, జాతీయ పురస్కారాల్లో ఆ చిత్రాన్ని పరిగణనలోకి తీసుకోలేమని అవార్డుల కమిటీ తిరస్కరించింది. ఆ విషయాన్ని నిర్మాత ప్రవీణ పరుచూరి ట్విటర్ ద్వారా కేటీఆర్, చంద్రబాబు నాయుడు, నరేంద్ర మోదీల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే కేటీఆర్ స్పందించారు. "జాతీయ పురస్కారాలు చిత్ర రూపకర్తలకి గర్వ కారణంగా నిలుస్తుంటాయి. మన దేశంలోనే రూపొందిన ఒక చిత్రానికి పురాతన నిబంధనల కారణంగా పురస్కారం ఇవ్వకుండా తిరస్కరించొద్ద"ని కేటీఆర్ ట్విటర్ ద్వారా అభ్యర్థించారు. కేటీఆర్ అభ్యర్థనపై కేంద్రమంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ స్పందించారు. "మా అధికారి నిర్మాత ప్రవీణ పరుచూరితో మాట్లాడారు. జాతీయ అవార్డులకి పోటీ పడే చిత్రాల నిర్మాత కానీ లేదంటే సహ నిర్మాతల్లో కనీసం ఒకరైనా భారతీయులై ఉండాలి. అలా దరఖాస్తు చేసుకోమని మా అధికారి నిర్మాతకి సూచించార"ని ట్వీట్ చేశారు రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్. మంత్రి స్పందన పట్ల కేటీఆర్ ట్విటర్ ద్వారా కృతజ్ఞతలు చెప్పారు.

ఈసారి విశాఖలో..



పరుచూరి గోపాలకృష్ణ, టి.సుబ్బరామిరెడ్డి, పింకీ రెడ్డి, మీనా

శ్రీదేవి మెమోరియల్ అవార్డుని నటి విద్యాబాలన్‌కి ప్రదానం చేయనున్నట్లు టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. 2017, 2018 సంవత్సరాలకి సంబంధించిన పురస్కారాల్ని ఫిబ్రవరి 17న విశాఖపట్నంలో జరిగే వేడుకలో ప్రదానం చేయనున్నారు. హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశంలో టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ఈసారి వేడుకకి రజనీకాంత్, సూర్య, విక్రమ్‌తో పాటు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ తదితర అగ్ర కథానాయకులు హాజరవుతారని తెలిపారు. కె.ఎస్.రామారావు మాట్లాడుతూ "తెలుగు చిత్రసీమకి చెందిన పలువురికి జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడానికి టి.సుబ్బరామిరెడ్డి కారణం. ఆయన జాతీయ స్థాయి నటుల్ని ఒక వేదికపైకి తీసుకొచ్చి పురస్కారాల్ని ప్రదానం చేస్తుండడం గొప్ప విషయం" అన్నారు. "రాజకీయ, పారిశ్రామిక, కళారంగాల్లో ముద్ర వేసిన టి.సుబ్బరామిరెడ్డి బయోపిక్ రూపొందించాల్సిన అవసరం ఉంద"ని పారిశ్రామిక వేత్త శోభనా కామినేని అన్నారు. త్వరలోనే నాన్న ఆటోబయోగ్రఫీని విడుదల చేయబోతున్నామని టి.సుబ్బరామిరెడ్డి కుమార్తె, పారిశ్రామికవేత్త పింకీ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మీనా, నగ్మా, పరుచూరి గోపాలకృష్ణ, జ్యూరీ సభ్యుడు నరేష్ మాట్లాడారు.

అప్పటి ముచ్చట!

తండ్రి పాత్రలో అంగీకరిస్తారా

శివాజీ గణేశన్ హీరోగా జెమినీ సంస్థ తమిళంలో నిర్మించిన 'మోటార్ సుందరం పిళ్లై' బాగా ఆడింది. ఆ చిత్రాన్ని ఏయన్నార్‌తో తెలుగులో నిర్మించాలని 'మధు పిక్చర్స్' నిర్మాత పి.మల్లికార్జునరావు అనుకున్నారు. నడి వయసులో పిల్లల తండ్రి పాత్రలో తనను చూసేందుకు అభిమానులు అంగీకరించరంటూ ఏయన్నార్ వద్దన్నారట. అప్పుడు ఓ రోజు జెమినీ అధినేత ఎస్.ఎస్.వాసన్ 'మిమ్మల్ని కలవడానికి వస్తున్నాను' అంటూ నాగేశ్వరరావుకు ఫోన్ చేశారట. 'మీరు పెద్ద


అక్కినేని నాగేశ్వరరావు

వారు. నా వద్దకు రావడమేమిటి? నేనే వస్తాను' అంటూ ఏయన్నార్ చెబుతున్నా వాసన్ పనిగట్టుకుని వచ్చారట. వచ్చి, 'ఈ సినిమా నా బిడ్డ లాంటిది. ఇదంటే నాకెంతో ఇష్టం. ఈ పాత్రలో గ్లామర్ లేదని మీరు భావించవద్దు. కొన్నాళ్ళు పోయాక వయసు మళ్లిన పాత్రలు ఎలాగూ వేయక తప్పదు. ఇప్పుడు మీరు నటిస్తేనే ఈ పాత్రకు నిండుదనం వస్తుంది' అంటూ ఏయన్నార్‌ని ఒప్పించారట. ఫలితంగా 'మంచి కుటుంబం' రూపొందింది. వాసన్ ఊహించినట్లుగానే ప్రేక్షకాదరణ పొందింది. తెలుగు వెర్షన్‌కు తాను నిర్మాత కాకపోయినా తనకెంతో ఇష్టమైన చిత్రం అన్ని భాషలలోనూ బాగా ఆడాలని భావించే వాసన్ లాంటి వారు ఎంతమంది ఉంటారు?.

వసుంధర




పండక్కి ఎంతమంది ఊరెళ్తారో తెలియదు కానీ...
కొవ్వలి గ్రామస్థులు ఎక్కడున్నా సరే సంక్రాంతి వేళకు సొంతూరుకు చేరుకుంటారు.
విదేశాల్లో ఉన్నవారు సైతం... తమ ఊరి అభివృద్ధిలో భాగం అవుతారు.
సంక్రాంతి సంబరాలు చూడాలంటే... కొవ్వలి తరువాతే అని గర్వంగా చెబుతారు.
ఆ జ్ఞాపకాలు, ఆనందాల వెనక ఉన్నది గ్రామదీప్ స్వచ్ఛంద సంస్థ.
గ్రామాభివృద్ధి లక్ష్యంతో ఏటా సంక్రాంతి సంబరాలను వైవిధ్యంగా ఏర్పాటు చేయడానికి గల కారణాలు చెబుతున్నారు ఆ సంస్థ నిర్వాహకురాలు వెలమాటి మనోహరి.

ఊరి కోసం సంక్రాంతి

మా ఊరు... పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు మండలంలోని కొవ్వలి. ఆ పేరు చెబుతున్నప్పుడు నాకు చాలా సంతోషంగా అనిపిస్తుంది. మా గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతోనే ఉద్యోగాన్ని మానేశా. ఎక్కడ ఉన్నా సరే! మా ఊరి వాళ్లంతా ఏటా ఒకసారైనా ఇక్కడకు రావాలనే ఉద్దేశంతోనే సంక్రాంతి వేడుకల్ని వైవిధ్యంగా ఏర్పాటు చేస్తున్నాం. చదువు, ఉద్యోగం... అంటూ ఇప్పటి యువత సొంతూరికి దూరమవుతోంది. వారి కుటుంబాలూ నెమ్మదిగా పట్టణాలు, నగరాలు, దేశాలకు వెళ్లిపోతున్నాయి. టెక్నాలజీ కూడా రోజురోజుకీ అభివృద్ధి చెందుతోంది. అలా ఊళ్ల స్థితిగతులే మారిపోయాయి. నేను కూడా పదిహేనేళ్లపాటు చదువు, ఉద్యోగం పేరుతో ఊరికి దూరంగా ఉన్నా. ఆ తరువాత తిరిగి వచ్చేసరికి కొవ్వలిలో ఎంతో మార్పు. పెంకుటిళ్లన్నీ, డాబాలుగా మారిపోయాయి. పండగల సందడి లేదు. టీవీలు, సెల్‌ఫోన్లే ప్రపంచం. సంక్రాంతి అంటే కోడిపందాలు, పేకాట అనుకునే పరిస్థితి చూసి చాలా బాధేసింది. నా వంతుగా మా ఊరిలో మార్పు తేవాలనుకున్నా. అందుకే గ్రామదీప్ పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశా.

ఫొటోలతో మొదలు...

2011 జనాభా లెక్కల ప్రకారం మా గ్రామ జనాభా తొమ్మిదివేలు. సామాజికవర్గాల వారీగా ఎవరికి వారుగా ఉంటారు. ఇక ఇక్కడి నుంచే ఎంతోమంది ఉన్నత చదువులు చదువుకుని, దేశ విదేశాల్లో పెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్ద పెద్ద వ్యాపారాల్లో నిలదొక్కుకుని పదిమందికీ సాయం చేసే స్థితిలో ఉన్నారు. ఎవరికి వారుగా తోచిన సాయం చేస్తున్నారు తప్ప వ్యవస్థీకృతమైన అభివృద్ధి మాత్రం లేదు. అందుకే అందరినీ ఒక బాటలో నడిపించాలనుకున్నాం. వీరిలో చాలామంది గ్రామదీప్‌లో సభ్యులుగా మారారు. ఆ తరువాత దెందులూరు మండలం పేరుతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లో గ్రూపులు ఏర్పాటు చేశాం. మా ఊళ్లోని ప్రదేశాలు, జరిగిన కార్యక్రమాల్ని ఫొటోలు తీసి పోస్టు చేసేదాన్ని. ఒక్కొక్కరుగా ఆయా ప్రాంతాలతో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకునేవారు. చివరకు ఎక్కడెక్కడో ఉన్నవాళ్లంతా ఒక్కచోట చేరారు. క్రమంగా గ్రామ సమస్యల్ని వారి దృష్టికి తీసుకెళ్లి, ఏదో ఒకటి చేద్దామని అడిగేదాన్ని. ఆసక్తి చూపించారు. అలా గ్రామాభివృద్ధిలో పాల్గొనడం మొదలుపెట్టారు.



అభివృద్ధి ఇలా....

సంక్రాంతి సంబరాలను 2015లో ప్రారంభించినా ఏటికేడు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. చెరువు గట్లమధ్య ఉండే ఖాళీ ప్రదేశాన్ని అలాగే వదిలేయకుండా మొక్కల్ని పెంచాం. కొవ్వలి ఐక్యతా వనం పేరుతో పార్కుని ఏర్పాటు చేశాం. రాళ్లగుట్టలు, ఏటవాలు ప్రాంతాలను చదును చేసి రహదారులుగా తీర్చిదిద్దాం. ఊరిలోని ఖాళీ ప్రదేశాల్ని మొక్కలతో నింపేశాం. ఊళ్లోని గోడలపైనా చక్కని పెయింటింగ్‌లు, అక్కడక్కడా సిమెంటు బెంచీలూ కనిపిస్తాయి. సిటీలో ఉన్న ఫిట్‌నెస్ అవగాహన ఊళ్లలో ఉండదు. అందుకే తరచూ మహిళలు, పిల్లలంతా కలిసి వెళ్లేలా నేచర్‌వాక్ పేరుతో ఓ వాకథాన్ కూడా ఉంటుంది. గ్రామంలోని పదకొండుమంది హెచ్ఐవీ బాధిత వితంతువులు, ఇతర మహిళలు, వృద్ధులను దత్తత తీసుకుని ఒక్కొక్కరికీ ఏడాదికి ఏడువేల రెండు వందల రూపాయల్ని, పోషకాహారాన్ని అందిస్తున్నాం.



ఆహ్వాన పత్రికలతో...

గ్రామాభివృద్ధి జరగాలంటే అంతా ఒక చోట చేరాలి కాబట్టి సంక్రాంతిని వేదికగా చేసుకోవాలనుకున్నా. ఏటా కార్తీక మాసంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న దెందులూరు, కొవ్వలి గ్రామస్థులంతా సారథి స్టూడియోస్ ప్రాంగణంలో కలుస్తారు. అక్కడికి వెళ్లి సంక్రాంతికి ఊరికి రమ్మని పిలిచాం. ఇంకోపక్క సొంతూరులో ఉండి కూడా ఒకరినొకరు పలకరించుకునే తీరిక లేదు చాలామందికి. అందుకే వారందరి మధ్య ఆత్మీయతలు, అనుబంధాలను పంచాలనుకున్నాం. పండక్కి కొన్ని రోజుల ముందే ఆహ్వాన పత్రికలు కొట్టించాం. ప్రపంచంలో ఏ మూల మా ఊరి వాళ్లున్నా వారందరినీ సంక్రాంతికి రావాలంటూ వాట్సాప్, ఫేస్‌బుక్‌ల ద్వారా పిలిచాం. ఊళ్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఆహ్వాన పత్రిక ఇచ్చాం. అది చూసి చాలామంది 'ఎందుకు ఇవన్నీ నీకు' అని అన్నారు. ఈ ప్రయత్నం విజయవంతం అవుతుందా లేదా అని మనసులో ఏదో మూల ఆందోళన ఉన్నా నా ప్రయత్నం ఫలించింది. ఎక్కడెక్కడో ఉన్న మా ఊరి వాళ్లంతా పండక్కి వచ్చారు. గ్రామస్థులూ స్పందించారు. నిజానికి మొదటి ఏడాది ఆ సంక్రాంతి హడావుడిగా జరిగినా క్రమంగా మార్పులు చేశాం.

– స్వాతి కొరపాటి

సొంతింటికి వచ్చినట్లే...

మా ఊళ్లోని మహిళా గ్రామదీప్, బాల గ్రామదీప్ సభ్యులు, స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులను సంక్రాంతి వేడుకల్లో భాగస్వాముల్ని చేశాం. వారందరికీ చెక్కభజన, కోలాటం, జానపద కళల్ని నేర్పించాం. భోగిమంటలు, గోదాదేవి కల్యాణం, సంక్రాంతి లక్ష్మి పూజ, గొబ్బెమ్మలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను గ్రామం అంతా కలిసి ఒకేచోట చేయాలనే నియమం పెట్టాం. ముగ్గుల పోటీలు ఉండనే ఉంటాయి. హరిదాసులు, పగటి వేషగాళ్లు, కొమ్ము దాసర్లు, గంగిరెద్దు వాళ్లు.. ఇలా అందరూ ఇక్కడికి వచ్చేలా మాట్లాడాం. ఇవన్నీ ఒకెత్తయితే... వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవాళ్లకు పొద్దున్నే నేచర్‌వాక్ పేరుతో పంట కాలువలు, పొలం గట్ల వెంట నడిపిస్తాం. తిరుగు ప్రయాణంలో పట్టుకెళ్లడానికి స్థానిక మహిళలతో పిండివంటలు అందించే ఆలోచనా ఉంది. ఇతర ప్రాంతాల వాళ్లు కూడా ఇక్కడకు రావొచ్చు. గ్రామీణ పర్యటకాన్ని ప్రోత్సహించే ప్రయత్నంలో భాగంగా ఇలా ఆతిథ్య ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాది తెలంగాణ నుంచి చాలామంది సంక్రాంతి సంబరాలు చూడ్డానికి వచ్చారు. ఓపెన్ టాప్ జీపు, ఎండ్లబండిపై ఎక్కించి ఊరంతా చూసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం.

రంగవల్లిక



- శాంతి నర్వా
సరూర్‌నగర్, హైదరాబాద్



26 చుక్కలు, 6 వరుసలు. 6 వచ్చేవరకు.

ఈటీవీ తెలంగాణ జనవరి 11, 2019 విజేతలు

ముత్యాల ముగ్గుల పోటీ

1. టి. నాగమణి, బాలాపేట్- ఖమ్మం, 2. కె.సువర్ణ, నకిరేకల్ - నల్గొండ, 3. ఆర్.శ్రీదేవి, తిరుమలగిరి - సికింద్రాబాద్, 4. డి. రుఖియా, నంద్యాల, 5. ఏ. లక్ష్మి, తాండూరు - వికారాబాద్, 6. కె. మంజుల, హైదరాబాద్, 7. ఎం.స్వాతి, ఆదిలాబాద్, 8. కె.సుమ, నిర్మల్, 9. బి.ఆదిలక్ష్మీ, వాడపల్లి - నల్గొండ, 10. కె.రమాదేవి, సారపాక - భద్రాచలం



15 చుక్కలు, 3 వరుసలు, 3 వచ్చేవరకూ.



- శ్యామల
ధవళేశ్వరం

నజరానా

రెండు చెంచాల చక్కెరలో కొన్ని చుక్కల కొబ్బరి నూనె వేసి ముఖానికి రాసి మృదువుగా రుద్దాలి. ఇలా చేయడం వల్ల మృతకణాలు పోవడమే కాదు, చర్మం కూడా తాజాగా మారుతుంది.

డబుల్ రోటీతో సేవ!



దిల్లీకి చెందిన తైరా భార్గవకు వయసు చిన్నదైనా మనసు పెద్దది. ఆమె ప్లస్ టూ చదువుతోంది. అయితేనేం వారానికి మూడొందల నుంచి నాలుగొందల మంది అన్నార్తుల ఆకలి తీరుస్తోంది. 'డబుల్ రోటీ' పేరుతో గతేడాది సంస్థను స్థాపించింది. దాని ద్వారా స్థానికంగా ఉన్న రెస్టారెంట్లు, బేకరీలతో మాట్లాడి వారి వద్ద అదనంగా ఉన్న ఆహారం సేకరించి.. అభాగ్యులకు అందిస్తోంది. ఇంతకీ తైరాకు ఈ ఆలోచన ఎలా వచ్చిందో తెలుసా... ఆమె గతేడాది తల్లిదండ్రులతో కలిసి ఓ వివాహ విందుకు వెళ్లింది. అక్కడ చాలా ఆహారం మిగిలిపోవడంతో కార్యక్రమం అయ్యాక చెత్త కుండీలో పారేయడం చూసింది. అప్పుడు తనకు రోడ్డువారన, దేవాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఆకలితో అలమటించేవారు గుర్తొచ్చారు. 'ఇలా వృథాగా మిలిగిపోయిన ఆహారం వారికి అందించాలని అప్పుడే నిర్ణయించుకున్నా. దాంతో నేను స్థానికంగా ఉండే బేకరీలు, రెస్టారెంట్ల వాళ్లను కలిశా. వాళ్ల దగ్గర ఆహారం అదనంగా ఉంటే నాకు ఇవ్వమని నా ఫోన్ నంబర్ ఇచ్చా. మొదట అమ్మానాన్నలు భయపడ్డారు. క్రమంగా ఒప్పుకున్నారు. గతేడాది నుంచి మిగిలిపోయిన ఆహారాన్ని సేకరిస్తున్నా. అలాగని అదేమీ పాడైంది కాదు. తాజాగా ఉన్నదే తీసుకుంటా. ఆ విధంగా తీసుకున్న ఆహారాన్ని పలు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, మిషనరీ ఛారిటీలకు అందిస్తున్నా. ఎప్పుడైనా రోడ్డుపక్కన పిల్లలు కనిపిస్తే వారికీ ఇస్తా' అని అంటోంది తైరా. రోజంతా స్కూలు, చదువుతో బిజీగా ఉండే ఆమె.. రాత్రిపూట బేకరీలు, రెస్టారెంట్లు, హోటళ్లకు వెళ్లి మిలిగిన ఆహారం సేకరిస్తుంది. ఆ సమయంలో ఎవరికి అవసరం ఉంటే వారికి అందిస్తుంది. నిల్వ ఉండేవి అయితే ఫ్రిజ్‌లో ఉంచి మర్నాడు పంచుతుంది.


బంగారం వెండి

12న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	33,230	33,230	32,600	32,800
ఆర్నమెంట్	31,040	31,040	30,400	30,400
వెండి (కిలో)	40,360	40,360	40,400	40,400
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	32,700	32,700	33,150	33,230
ఆర్నమెంట్	30,310	30,310	30,690	30,810
వెండి (కిలో)	40,300	40,300	40,200	40,400
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	32,980	32,980	-------	-------
ఆర్నమెంట్	30,680	30,680	3,069	3,072 గ్రా
వెండి (కిలో)	40,500	40,500	42.70	42.70 గ్రా

పొట్ట తగ్గాలంటే ఏం చేయాలి?

ఫిట్ మంత్ర




నాకు థైరాయిడ్ ఉంది. సిజేరియన్ అయ్యాక నడుముకట్టు వేసుకోలేదు. దాంతో పొట్టభాగంలో కొవ్వు పేరుకుపోయింది. రకరకాల డ్రెస్‌లు వేసుకోలేకపోతున్నా. ఈ సమస్య తగ్గాలంటే ఏం చేయాలి? కొత్తగా గ్రీన్‌టీ తాగడం అలవాటు చేసుకున్నా. ఇంకేం చేయాల్సి ఉంటుంది?

- ఓ సోదరి


ప్రసవం తరువాత పొట్ట చుట్టూ గట్టిగా కట్టు కట్టుకుంటే కండరాలు బిగుతుగా ఉంటాయనుకుంటారు. కానీ దానివల్ల పొట్ట, నడుము భాగానికి కేవలం ఆసరా దొరుకుతుంది తప్ప ఆ కండరాలు దృఢంగా మారవు. కేవలం పొట్ట మరీ సాగకుండా ఉంటుంది. ఆహారం తక్కువ తీసుకోగలుగుతారు. వ్యాయామంవల్లే మార్పు ఉంటుంది. మీరు రెండు మూడు రకాల వ్యాయామాలు చేయాలి. మీకు సిజేరియన్ జరిగి ఆరు నెలలు దాటితే గనుక టమ్మీ టక్ వ్యాయామంతో ప్రారంభించండి. పొట్టను వెనక్కి లాగుతూ కాసేపు అలాగే ఉంచాలి. కొన్ని సెకన్లు అయ్యాక వదిలేయాలి. ఐదు సెకన్లతో మొదలుపెట్టి నిమిషం వరకూ చేయాలి. దీనివల్ల కండరాలు దృఢంగా మారతాయి. అలాగే వెల్లకిలా పడుకుని ఒక కాలిని వేగంగా పైకెత్తి, తరువాత నిదానంగా దించాలి. ఇదే విధంగా మరో కాలిని ఎత్తి దించాలి. ఆ తరువాత రెండు కాళ్లు పైకెత్తి దించాలి. ఈ వ్యాయామాలు చేస్తున్నప్పుడు ఛాతీ, మెడ ఎత్తకుండా చేయాలి. ఈ రెండూ అయ్యాక కాళ్లనే సైకిల్‌లా తిప్పాలి. రెండు కాళ్లతో ఒకేసారి చేయాలి. ఈ మూడు వ్యాయామాల్ని పదితో మొదలుపెట్టి విరామం ఇస్తూ సంఖ్యను పెంచుకుంటూ వెళ్లాలి.




డా॥ మణిపవిత్ర
యోగా నిపుణురాలు



ఆహా!
aha@eenadu.in




ఇంటికి ధాన్యలక్ష్మి వస్తుంది. అల్లుడూ అమ్మాయి వస్తారు.. మనవలూ, మనవరాళ్లు వస్తారు... పల్లెకు వెలుగు వస్తుంది! సంక్రాంతి కళ వస్తుంది. అమ్మమ్మలకీ, నాయనమ్మలకీ, మేనత్తలకి మాత్రం జంతికలు, బొబ్బట్లు, సకినాలు సరే... కొత్తగా ఏం చేద్దాం అన్న ఆరాటం మొదలవుతుంది. అందుకే ఈసారి పొరుగు రాష్ట్రాల పండగ వంటకాలని మన ఇంట్లోనే వండి... సంక్రాంతి రుచులకు సరిహద్దుల్లేవని చెబుదాం!



.. ఏమి రుచి

సరిహద్దుల్లేని సంక్రాంతి రుచులు





పపాయా ఖర్

కావాల్సినవి: పచ్చిబొప్పాయి తురుము- అరకప్పు, ఎర్రకందిపప్పు- ఐదుకప్పులు, ఉల్లిపాయముక్కలు- ఒకటిన్నర కప్పు, పచ్చిమిర్చి- మూడు, వెల్లుల్లి ముక్కలు- చెంచా, అల్లం తురుము- చెంచా, బిర్యానీ ఆకు- ఒకటి, కొత్తిమీర తరుగు- చెంచా, ఆవనూనె- చెంచాన్నర, ఉప్పు- రుచికి తగినంత, పంచదార- పావుచెంచా, నీళ్లు- అరలీటరు

తయారీ: బొప్పాయి చెక్కు, గింజలు తీసేసి చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. అలాగే కందిపప్పుని కడిగి బొప్పాయి ముక్కలతో కలిపి నీళ్లుపోసి మూడు విజిల్స్ రానివ్వాలి. కడాయిలో నూనె పోసి వేడెక్కాక అందులో ఉల్లిపాయముక్కలు వేసి దోరగా వేగనివ్వాలి. ఇందులోనే వెల్లుల్లి తరుగు, బిర్యానీ ఆకు, అల్లం ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేసి నిమిషం పాటు వేయించుకోవాలి. ఈ తాలింపులోకి ఉడికిన పప్పు, బొప్పాయి మిశ్రమం కలుపుకోవాలి. మరో ఐదునిమిషాలు ఉడికిన తర్వాత దింపుకోవడమే.



నోక్షి పిటా

కావాల్సినవి: బియ్యప్పిండి- రెండు కప్పులు, పంచదార- ఒకటిన్నర కప్పు, ఉప్పు- చెంచా, నీళ్లు- తగినంత, నూనె- వేయించడానికి తగినంత

తయారీ: నీళ్లల్లో తగినంత ఉప్పు వేసి మరిగించుకోవాలి. దీనిలో బియ్యప్పిండి వేసి గట్టిగా ఉండ చేసుకునేందుకు వీలుగా ఉండేలా పిండిని ఉడకనివ్వాలి. పొయ్యి కట్టేసి చల్లారనివ్వాలి. దీనిలో మూడు చెంచాల నూనె వేసి చేత్తో మెదిపి చపాతీ ఉండల్లా చేసుకోవాలి. అప్పడాల కర్రతో మరీ పల్చగా కాకుండా మందంగా ఒత్తుకుని దీనిపై నూనె రాసి ...ఇప్పుడు టూత్‌పిక్‌తో నచ్చిన ఆకృతులు చేసుకుని నూనెలో వేయించుకోవాలి. ఇంకో పక్క పంచదార పాకం పట్టుకోవాలి. కప్పు నీటిలో పంచదార వేసి తీగ పాకం రానివ్వాలి. ఈ పాకంలో నోక్షి పిటాలను వేసుకుంటే తీయని అందమైన ఆహార కళాకృతులు సిద్ధమవుతాయి.



గన్నే కీ ఖీర్

కావాల్సినవి: తాజా చెరకురసం- లీటరు, పచ్చ యాలకులపొడి- చెంచా, వాల్‌నట్స్ పలుకులు- చెంచా, జీడిపప్పు పలుకులు- చెంచా, కడిగి ఇరవై నిమిషాలపాటు నానబెట్టిన బాస్మతి బియ్యం- 100గ్రా, బాదం పలుకులు- చెంచా, ఎండుద్రాక్షలు- చెంచా

తయారీ: తక్కువ మంట మీద పాన్‌ని ఉంచి అందులో చెరకు రసం వేసి మరగనివ్వాలి. దీనిలో నానబెట్టిన బియ్యం, యాలకులపొడి వేసి బాగా కలిపి మంట తగ్గించుకోవాలి. అన్నం అడగంటకుండా గరిటెతో తిప్పుకోవాలి. అన్నం పూర్తిగా ఉడికాక అప్పుడు బాదం, జీడిపప్పు, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్ పలుకులు వేసుకోవాలి. ఒకటి రెండు నిమిషాల పాటు ఉడికిన తర్వాత వడ్డించుకోవాలి.



కల్యాణ పొంగల్

కావాల్సినవి: బియ్యం- కప్పు, పెసరపప్పు- పావుకప్పు, పాలు- కప్పు, నీళ్లు- మూడున్నర కప్పులు, ఉప్పు- తగినంత, జీలకర్ర- చెంచా, మిరియాలు- చెంచా, అల్లం- చెంచా, నెయ్యి- రెండు చెంచాలు, ఇంగువ, కరివేపాకు, జీడిపప్పులు- తగినన్ని

తయారీ: మందపాటి అడుగు ఉన్న పాత్రలో బియ్యం, పెసరపప్పులని విడిగా వేయించుకోవాలి. బియ్యాన్ని మరీ ఎక్కువగా వేయించాల్సిన అవసరం లేదు కానీ పెసరపప్పుని మాత్రం ఎర్రరంగు వచ్చేంతవరకూ వేయించుకోవాలి. వీటిని కడిగి కుక్కర్‌లో వేయాలి. ఇందులో మూడున్నరకప్పుల నీళ్లు, కప్పు పాలు పోసి ఉడికించుకోవాలి. పాలు తప్పనిసరి కాదు కానీ పాల వల్ల వంటకానికి ప్రత్యేకమైన రూపు వస్తుంది. ఇందులోనే జీలకర్ర, మిరియాలు, అల్లం, ఇంగువ, కరివేపాకు, ఉప్పు వేసి బాగా కలిపి కుక్కర్ మూతపెట్టేయాలి. ఐదారు విజిల్స్ వచ్చిన తర్వాత మూత తీసి అన్నాన్ని మెత్తగా మెదుపుకోవాలి. పాన్‌లో నెయ్యి వేసి జీడిపప్పులు, మిరియాలు, జీలకర్ర, కరివేపాకుతో తాలింపు పెట్టుకోవాలి. ఈ తాలింపులో అన్నాన్ని వేసుకుంటే కల్యాణ పొంగలి సిద్ధం అవుతుంది. పల్లీ పచ్చడితో తింటే మహారుచిగా ఉంటుంది.



మసాలా కిచిడీ

కావాల్సినవి: పెసరపప్పు- కప్పు, బియ్యం- కప్పు, ఉల్లిపాయలు- రెండు, బంగాళాదుంపలు- రెండు, కొబ్బరి ముక్కలు- పావుకప్పు, పసుపు - చెంచా, కారం- చెంచా, జీలకర్ర- చెంచా, గరంమసాలాపొడి- చెంచా, వెల్లుల్లిరెబ్బలు- ఆరు, అల్లం ముక్క- చిన్నది ఒకటి, పచ్చిమిర్చి- ఆరు, కొత్తిమీర కట్ట- ఒకటి, నెయ్యి- చెంచా, నూనె- చెంచా, ఉప్పు- తగినంత

తయారీ: ముందుగా పెసరపప్పుని, బియ్యాన్ని అరగంటపాటు నానబెట్టుకోవాలి. ఆలోపు ఉల్లిపాయముక్కలు, బంగాళాదుంప ముక్కలు ఓ మోస్తరు ముక్కలుగా, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లిని చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. కొబ్బరిని మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. కడాయిలో ఒక చెంచా నెయ్యి, ఒక చెంచా నూనె వేసుకుని అందులో ఉల్లిపాయలు వేయించుకోవాలి. ఉల్లిపాయలు ముదురు గోధుమరంగులోకి వచ్చిన తర్వాత జీలకర్ర, సన్నగా తరిగిన అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. ఇప్పుడు కారం, పసుపు, గరంమసాలా పొడి, దంచిన కొబ్బరి, వెల్లుల్లి కూడా వేసుకొని పచ్చివాసన పోయేంతవరకూ వేయించుకోవాలి. దీనిలో పప్పు, బియ్యం కూడా వేసి ఓ రెండు నిమిషాలపాటు వేయించుకోవాలి. ఇందులో చల్లని నీళ్లని కాకుండా వేడినీటిని బియ్యంపైన రెండు అంగుళాలుపైవరకూ వచ్చేటట్టు పోసుకోవాలి. ఇందులోనే బంగాళాదుంప ముక్కలు వేసి నీళ్లు దగ్గరపడి బుడగలు వచ్చే సమయానికి అన్నం ఉడికిందో లేదో చూసుకుని దించేయడమే.

దక్షిణాదిన ఈ పండక్కి దండిగా మిరియాలు వేసి పొంగళ్లు వండితే.. ఉత్తరాదిన పప్పుధాన్యాలు, అన్నం కలిపి వండే కిచిడీలను ప్రత్యేకంగా చేస్తారు. అందుకే ఈ పండగని ఉత్తరాది వాళ్లు కిచిడీ సంక్రాంతి అని కూడా అంటారు. అసోంలో అయితే వైవిధ్యమైన బియ్యాలని వాడి పొంగలి తయారుచేస్తారు. ముఖ్యంగా బోరాసాల్ అనే బియ్యంతో ప్రసాదం చేస్తారు. దీనినే మ్యాజిక్ రైస్ అని కూడా అంటారు. వండాల్సిన అవసరం లేకుండా వాటంతట అవే అన్నంగా మారే బియ్యం వాడతారు. ఈ బియ్యం పొడితోనే మన పూతరేకుల్లాంటి వంటకాల్ని వండుతారు. గుజరాత్‌లో అన్నిరకాల కాయగూరలు వేసి 'ఉందియు' అనే కూర వండుతారు.



ప్ర- జ

జంతికల పిండిని కలిపేటప్పుడు...



మా ఇంట్లో అందరూ తినే పిండి వంటకం జంతికలు. వాటిని ఏ పద్ధతిలో చేస్తే గుల్లగా కరకరలాడేలా వస్తాయో చెప్పండి? –జ్యోతి, గుంటూరు

సాధారణంగా జంతికలు లేదా మురుకులు చేయడానికి బియ్యప్పిండి, మినప్పిండిని వాడుతుంటారు. మినపప్పుని వేయించి పొడికొట్టి కప్పు బియ్యప్పిండికి రెండు చెంచాల మినప్పిండిని వాడతారు. అదే కప్పు బియ్యప్పిండికి నాలుగు చెంచాల మినప్పిండి వేస్తే రుచితో పాటు మంచి సువాసన ఉంటుంది. పిండిలో కారంతో పాటు వాము, గది ఉష్ణోగ్రత వద్ద మెత్తగా ఉండే బటర్ కూడా వేస్తే జంతికలు ఇంకా రుచిగా ఉంటాయి. మినప్పిండి కలిపిన జంతికల పిండిని ఎక్కువ సేపు నిల్వ ఉంచకూడదు. గబగబా వేసుకోవాలి. లేదంటే ఎప్పటికప్పుడు పిండి కలుపుకోవాలి. పిండి ఆరిపోతే జంతికలు గట్టిగా వస్తాయి.

● మరొక పద్ధతి పుట్నాల పప్పుని వాడి చేయడం. కప్పు బియ్యప్పిండికి పావుకప్పు సెనగపిండి రెండు మూడు చెంచాల పుట్నాలపప్పు పొడి వేస్తే జంతికలు రుచిగా ఉంటాయి. అయితే పుట్నాలపప్పుని వేసేటప్పుడు పిండి కలపడానికి చల్లని నీళ్లకు బదులు ఉప్పు వేసి మరిగించిన నీరు కలపాలి. మెత్తగా ఉండే బటర్‌ని కలిపి మరీ జారుగా, మరీ గట్టిగా కాకుండా పిండి కలుపుకోవాలి.

– శ్రీదేవి, హోటల్ మేనేజిమెంట్ నిపుణురాలు

ట్రెండు గురూ!



చీజ్‌టీ... సోయా కేక్!

మొన్న కీటో... నిన్న వేగాన్. మరి ఈ ఏడాది కొత్తగా వచ్చిన పోషకాహార నియమాలేంటి? కొత్త సంవత్సరం.. కొత్త రుచుల కోసం మనసు వెతుకులాడ్డంలో తప్పేముంది? మన పప్పుటమాటా, బిర్యానీ, పులావులు కాకుండా ఈ ఏడాది ట్రెండు అవుతున్న ప్రపంచదేశాల ఆహార నియమాల గురించి తెలుసుకుందాం...

పోషకాలని అందించే పుట్టగొడుగులు, సీవీడ్(సముద్ర నాచు)తో చేసిన వంటకాల ట్రెండు ఈ ఏడాది ఒక్కఊపు ఊపనుందట. ఇక ఆహార నియమాల విషయానికే వస్తే మొన్నటి వరకూ సందడి చేసిన కీటో డైట్ మరుగున పడి ఈ ఏడాది జంతువుల ఉత్పత్తులతో సంబంధం లేని వేగాన్, పాలియో, ఈ రెండూ కలిసిన పెగాన్ వంటివి ఎక్కువమంది అనుసరించడానికి అవకాశం ఉందని అంటున్నారు పోషకాహార నిపుణులు. అబ్బా ఎంత సేపూ... పోషకాల మాటేనా నోరూరించే రుచుల సంగతేంటని అనుకుంటున్నారా? గత సంవత్సరం జపాన్ గ్రీన్‌మచా టీ సందడి చేస్తే ఈ సంవత్సరం చీజ్‌టీ కొత్తగా రానుంది. అవును ఇంతవరకూ చీజ్‌ని తినడమే కానీ తాగడం తెలియని మనకి పౌడర్ చీజ్‌తో చేసిన చీజ్‌టీ కొత్త అనుభూతిని పంచనుంది. అలాగే ఇంతవరకూ ఇండోనేషియాకే పరిమితం అయిన టెంపే మాత్రం ఈసారి మనందరికీ పరిచయం కానుంది. చూడ్డానికి సోయాగింజలతో చేసిన కేకులా ఉండే ఈ వంటకం పులియబెట్టిన సోయాగింజలతో చేస్తారు. ఇండోనేషియ మొత్తం మీద మాంసానికి ప్రత్యామ్నాయంగా వాడుతుంటారు. పేదలు తినే ఆహారంగా ప్రాచుర్యంలో ఉన్న ఈ టెంపే ఇప్పుడు అమెరికాలో హాట్ ట్రెండ్ అయి కూర్చుంది.



పక్కాలోకల్



400 సంవత్సరాల నుంచీ..

బాదంకీజాలీ...







'బాదంకీజాలీ' కావాలి అని ఏ స్వీట్‌షాప్‌కెళ్లి అడిగినా మిమ్మల్ని విచిత్రంగా చూడొచ్చు.. అదేంటన్నట్టుగా! అదే పాతబస్తీలోని ఏ అజీజ్‌బాగ్‌కో వెళ్తే బాదం, జీడిపప్పుల ఘుమఘుమలే మీకు దారిచూపిస్తాయి. అక్కడే మీకు బోనస్‌గా నిజాం నాణేలను పోలిన అచ్చుల మధ్య ఒత్తి చేసే 'అషరఫీ' అనే మరో అద్భుతమైన నిజామీ మిఠాయి కూడా పరిచయం అవుతుంది. ఓ పక్క గ్రైండర్లలో బాదం, జీడిపప్పుని మెత్తగా రుబ్బుతుంటే మరోపక్క సిల్వర్‌వరక్ కాగితాలు పరిచి పొందిగ్గా కత్తిరించే బాదంకీజాలీలు కనిపిస్తాయి. ఈ మిఠాయి చరిత్ర ఈనాటిది కాదు... 400 సంవత్సరాలక్రితం అరబ్‌దేశాల నుంచి వలస వచ్చిన నవాయత్ కుటుంబాలు వారసత్వంగా తెచ్చుకున్న మిఠాయి ఇది. సీక్రెట్ రెసిపీగా చెప్పుకునే ఈ మిఠాయి రుచి మాటల్లో చెప్పడం కష్టమే. జీడిపప్పు, బాదంపప్పులని మెత్తగా రుబ్బి చపాతీల్లా చేసి ప్రత్యేకమైన ముద్రలతో కత్తిరించి బేక్ చేస్తారని చెబుతున్నారు తయారీదారు ఫర్జానీ.

– చిత్ర కథనం: వసంత్

తప్పిపోయిన సర్వే నంబర్ల మాటేమిటి?

- వెబ్‌సైట్‌లో చేర్చాలని కాళ్లరిగేలా తిరుగుతున్న రైతులు
- జేసీ అనుమతి తప్పనిసరి కావడంతో జాప్యం

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్‌లో కనిపించకుండా పోయిన భూముల సర్వే నంబర్లను చేర్చాలంటూ రైతులు తహసీల్దారు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. భూ దస్త్రాల ప్రక్షాళన సందర్భంగా రెవెన్యూ సిబ్బంది 'మా భూమి' వెబ్‌సైట్‌లో ఉన్న భూ దస్త్రాల పాత సమాచారాన్ని తొలగించారు. నవీకరించిన సమాచారాన్ని 'ధరణి'కి అనుబంధంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో సర్వే నంబర్లు తప్పిపోయాయి. కొన్నిచోట్ల గ్రామంలోని పాసుపుస్తకాలకు, మొత్తం భూ విస్తీర్ణానికి మధ్య తేడా రాకుండా చూసేందుకు గ్రామ స్థాయి సిబ్బందే కొన్ని సర్వే సంఖ్యలు తప్పించి చూపారు. మరికొన్నిచోట్ల సాంకేతిక తప్పిదాలతో నమోదు కాలేదు. ఇలా దాదాపు 15 లక్షల సర్వే నంబర్లు తప్పిపోయినట్లు రెవెన్యూ యంత్రాంగం గుర్తించింది. వేలాది పాసుపుస్తకాల్లో భూవిస్తీర్ణాలు తక్కువగా నమోదయ్యాయి. ఈ పొరపాట్లను సరిచేసే క్రమంలో సిబ్బంది ఇప్పటి వరకు పది లక్షల సర్వే నంబర్లను తిరిగి నిక్షిప్తం చేసే ప్రక్రియను చేపట్టారు. అయితే సర్వే నంబరును తిరిగి ఆన్‌లైన్‌లో చేర్చాలంటే ప్రతి ఖాతాకు సంయుక్త కలెక్టర్ (జేసీ) అనుమతి తప్పనిసరి. దీంతో ఈ ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంటోంది.

ఎన్నాళ్లీ నిరీక్షణ?

భూ దస్త్రాలను పకడ్బందీగా నిర్వహించేందుకు దస్త్రాల మార్పిడికి బయోమెట్రిక్ (వేలిముద్ర గుర్తింపు) వ్యవస్థను అమలు చేశారు. ఒక్కసారి అంతర్జాలంలో మార్పులు చేపడితే తిరిగి వాటిని మార్చకుండా పక్కా ఏర్పాట్లు చేశారు. మండల స్థాయిలో తహసీల్దార్లు ఏ మార్పు చేయాలన్నా జేసీ బయోమెట్రిక్‌తో అంతర్జాలంలో అనుమతి ఇవ్వాలి. ఆ తర్వాతే తహసీల్దార్ తన అంతర్జాల ఖాతాలోకి వచ్చే దస్త్రాన్ని డిజిటల్ సంతకం చేసి సర్వే సంఖ్యలను చేర్చుతున్నారు. జేసీలు, తహసీల్దార్లు ఎన్నికల విధులు, ఇతరత్రా పనుల్లో తలమునకలై ఉండడంతో ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని సిబ్బంది చెబుతున్నారు. ఏడాదికాలంగా తమ సర్వే సంఖ్యలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, ఇంకెంత కాలం వేచి చూడాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో పాల్గొనాల్సిందిగా గవర్నర్ నరసింహన్‌ను ఆహ్వానిస్తున్న ఎంపీ కవిత

గవర్నర్‌తో ఎంపీ కవిత భేటీ

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో పాల్గొనాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత గవర్నర్ నరసింహన్‌ను కోరారు. ఆమె శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. 19న ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా అన్నాహజారే హాజరవుతారన్నారు. 20వ తేదీన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని గవర్నర్‌ను కోరారు. 17 లక్ష్యాలతో ఈ సదస్సు నిర్వహించనున్నామని వివరించారు. జాగృతి తరఫున నిర్వహించే కార్యకలాపాలపై కవితను గవర్నర్ అభినందించారు.

కేంద్రీయ విద్యాలయాలకూ హెఫా రుణం

ఈనాడు, హైదరాబాద్: జాతీయ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు రుణాలు మంజూరు చేస్తున్న ఉన్నత విద్యా నిధి సంస్థ(హెఫా) తాజాగా కేంద్రీయ విద్యాలయా(కేవీ)లకూ రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. దేశవ్యాప్తంగా 10 జాతీయ విద్యాసంస్థలతోపాటు 44 కేవీలకు మొత్తం రూ.5,310 కోట్ల రుణం మంజూరు చేయడానికి ఆమోదం తెలుపుతూ ఈ నెల 7న హెఫా కమిటీ నిర్ణయం తీసుకుంది. వాటిలో కేంద్రీయ విద్యాలయాల్లో తెలంగాణలో నిజామాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, భువనగిరి.. ఆంధ్రప్రదేశ్‌లో సత్తెనపల్లి, రాజంపేట ఉన్నాయి. ఒక్కోదానికి రూ.10.93 కోట్లు మంజూరు కానున్నాయి. ఇవన్నీ కొత్తగా మంజూరైన కేంద్రీయ విద్యాలయాలు కాగా.. వాటి భవనాల నిర్మాణాలకు నిధులను ఖర్చు చేస్తారు. వాటిని పర్యవేక్షించే కేంద్రీయ విద్యాలయ సంగఠన్(కేవీఎస్)కు నిధులిస్తారు. ఇక ఐఐటీలకు రూ.815 కోట్లు, ఐఐఎంలకు రూ.1,206.17 కోట్లు, ఎన్ఐటీలకు రూ.182 కోట్లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ రిసెర్చ్ ఎడ్యుకేషన్ (ఐసర్)లకు రూ.1,050 కోట్లు, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు రూ.29.50 కోట్లు ఇచ్చేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం కెనరా బ్యాంకు ద్వారా ఇప్పిస్తుంది. అసలు మొత్తాన్ని కేంద్ర మానవ వనరుల శాఖ చెల్లిస్తుంది. వడ్డీని మాత్రం ఆయా సంస్థలు చెల్లించాలి.





సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లేవారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. చిన్న పిల్లలతో కలిసి వెళ్లడమంటే మహా కష్టం. శనివారం సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్‌లో ఇలా చిన్నారులను బస్సు కిటికిలోంచి లోపలికి ఎక్కించారు. బస్సు వచ్చిందంటే చాలు వారిని ఎత్తుకుని సీట్ల కోసం పరుగులు తీశారు.

వేలాడుతూనే ఊరికి

- రైళ్లలో ఫుట్‌బోర్డు ప్రయాణం

ఈనాడు – హైదరాబాద్

సంక్రాంతికి వెళ్లే ప్రయాణికులతో శనివారం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రైల్వేస్టేషన్లు కిక్కిరిసిపోయాయి. జనరల్ సహా రిజర్వేషన్ బోగీల్లోనూ ఫుట్‌బోర్డులపై వేలాడుతూ ప్రజలు ప్రయాణించారు. బండ్లు స్టేషన్లలోకి రావడమే ఆలస్యం.. ప్లాట్‌ఫారం నుంచి బోగీల్లోకి వెళ్లేందుకు ప్రయాణికుల మధ్య తోపులాటలు జరిగాయి. సికింద్రాబాద్ స్టేషన్‌లో క్యూలైన్లు పెట్టినప్పటికీ రైల్వే పోలీసులు రద్దీని నియంత్రించలేకపోయారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్ల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు రద్దీకి తగ్గట్లుగా రైళ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సికింద్రాబాద్‌తో పాటు విజయవాడ స్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగిపోయింది. ఈ స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించిన ప్రధాన రైళ్లు అన్నింట్లోనూ లోపల కాలు పెట్టేందుకు స్థలం లేకపోవడంతో వేలాడుతూనే వెళ్లారు. ఎలాగైనా లోపల సీటు దొరికించుకోవాలన్న ఉద్దేశంతో ప్రయాణికులు స్టేషన్‌లోకి రైలు రాగానే ఇంజిన్ ముందు నుంచి పట్టాలు దాటుతూ వెళ్లారు. రెండోవైపు నుంచి బోగీల్లోకి ఎక్కేందుకు ప్రయత్నించారు. ముందస్తుగా ప్రకటించకుండా జనసాధారణ్ రైళ్లను చివరి నిమిషంలో వేశారని.. వాటి సమాచారం అందించేవారు లేరని ప్రయాణికులు విమర్శించారు. అవి కూడా విజయవాడ వరకే పరిమితమయ్యాయని.. శ్రీకాకుళం, విజయనగరం వైపు రైళ్లు నడపలేదని మండిపడ్డారు.

నేడో మరో 7 జనసాధారణ్ రైళ్లు

తెలుగు రాష్ట్రాల పరిధిలో ఆదివారం అన్ని జనరల్ బోగీలతో ఉండే 7 జనసాధారణ్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఒక్కో రైలులో 16 జనరల్ బోగీలు ఉంటాయి. కనీసం 1,500 మంది ప్రయాణికులు ఒక్కో రైలులో ప్రయాణించడానికి అవకాశం ఉంది. శనివారం నాడు బయలుదేరిన సమయానికి ఆదివారం కూడా జనసాధారణ్ రైళ్లు ప్రారంభమవుతాయి.



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రద్దీ కారణంగా శనివారం గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో ఫుట్‌బోర్డుపైనే ప్రమాదకరంగా వేలాడుతూ వెళుతున్న ప్రయాణికులు

జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి-65 వాహనాలతో కిక్కిరిసిపోయింది. సంక్రాంతికి హైదరాబాద్ నుంచి తమ సొంత గ్రామాలకు వెళుతున్న ప్రజలు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. లింగోజిగూడెం స్టేజి వరకు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. చౌటుప్పల్ దాటిన ప్రయాణికులు టోల్ చెల్లించి టోల్‌గేట్ అవతలి వైపునకు వెళ్లేందుకు సుమారు గంటన్నర సమయం పట్టింది. శనివారం తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు సుమారు 50 వేల వరకు వాహనాలు వెళ్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద నిలిచిపోయిన వాహనాలు

ప్రవాసుల కోసం కొత్త విధానం

- తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కసరత్తు
- వంద దేశాల్లో పార్టీ విభాగాలు: ఎంపీ కవిత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రసమితి ప్రవాస విభాగాలను వంద దేశాలకు విస్తరిస్తామని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బ్రిటన్, అమెరికాలతో మొదలైన తెరాస ప్రవాస శాఖలు ప్రస్తుతం 33 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని, త్వరలో మరో 67 దేశాల్లో వాటిని ఏర్పాటు చేసి, ఆయా దేశాల్లో గులాబీ జెండాలను ఎగురవేస్తామన్నారు. త్వరలోనే తెలంగాణ ప్రవాసుల విధానాన్ని ప్రభుత్వం ప్రకటిస్తుందని తెలిపారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దీనిపై కసరత్తు చేస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెరాస శ్రేణులు ప్రవాసులకు అండగా ఉండాలన్నారు. తెరాస ప్రవాస విభాగం 8వ వార్షికోత్సవం శనివారం



తెరాస ప్రవాస విభాగం వార్షికోత్సవం సందర్భంగా శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేక్ కోస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, దేవీప్రసాద్ తదితరులు

తెలంగాణ భవన్‌లో ఘనంగా జరిగింది. ఇందులో కవిత ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. "దేశ విదేశాల్లోని ప్రవాసులు తెలంగాణకు గొప్ప ఖ్యాతి తెస్తున్నారు. ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ విదేశాలకు వెళ్లి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఆయన సూచనలతో విదేశాల్లో ఉండే తెలంగాణ బిడ్డలు వివిధ పేర్లతో సంఘాలు పెట్టుకుని పనిచేసిన విషయం తెలంగాణ సమాజం మరువదు. ప్రవాసుల కష్టాలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. అమెరికా, గల్ఫ్ వంటి దేశాల్లో అక్కడి తెలంగాణవాసుల కోసం ఇక్కడ పార్టీకి వారధులుగా ప్రవాస విభాగాలు పనిచేయాలి. ప్రవాసుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసింది. కొత్త ప్రవాస విధానం వచ్చాక పెద్ద ఎత్తున కార్యక్రమాలుంటాయి" అని కవిత తెలిపారు. అంతకుముందు ఆమె తెలంగాణ తల్లికి, ఆచార్య జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రవాస విభాగం వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేకు కోసి పంచారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, బెవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, తెరాస ప్రవాస విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం, బ్రిటన్ అధ్యక్షుడు అశోక్ దూసరి, న్యూజిలాండ్ శాఖ కోశాధికారి అభిలాష్ రంగినేని, అమెరికా ప్రతినిధులు సుధీర్, సురేశ్, రమేశ్, ఖతార్ ప్రతినిధి అభిలాష్ బండి పాల్గొన్నారు.

పదవీ విరమణ వయసు పెంపునకు సిఫార్సు

- ఆచార్యులు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు 65 ఏళ్లు చేయాలన్న కమిటీ
- ముఖ్యమంత్రికి నివేదిక.. ఆయనదే తుది నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) వేతనాలు అందుకునే వర్సిటీల ఆచార్యులు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు పదవీ విరమణ వయసును ఇప్పుడున్న 60 నుంచి 65 ఏళ్లకు పెంచాలని ఉన్నతాధికారులతో కూడిన రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రికి సిఫార్సు చేసింది. ఏడో కేంద్ర వేతన సంఘం ప్రకారం యూజీసీ వేతనాలు అందుకునే ఆచార్యులు, డిగ్రీ అధ్యాపకుల పదవీ విరమణ వయసును 65 సంవత్సరాలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీనివాస్ కన్వీనర్‌గా ఏర్పాటైన కమిటీ శాసనసభ ఎన్నికలకు ముందే ముసాయిదా నివేదికలో సిఫార్సు చేసింది. ఈ నివేదికపై అప్పుడు చర్చించిన విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య.. రెండుమూడు అంశాలపై సందేహాలను లేవనెత్తారు. వాటికి సమాధానం ఇస్తూ తుది నివేదికను కొద్ది రోజుల క్రితం కమిటీ.. ప్రస్తుత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రాకు సమర్పించింది. ఈ క్రమంలో కమిటీ సభ్యులు కూడా అయిన అజయ్‌మిశ్రాతోపాటు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సాధారణ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్ సిన్హా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్‌తోపాటు కమిటీ కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులైన ఉన్నత విద్యామండలి ఛైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, జేఎన్‌టీయూ ఉపకులపతి వేణుగోపాల్‌రెడ్డి, మహాత్మాగాంధీ వర్సిటీ ఉపకులపతి అల్తాఫ్ హుస్సేన్, ఓయూ మాజీ ఉపకులపతి ఆచార్య తిరుపతిరావు సమావేశమై లోతుగా చర్చించారు. ఏడో కేంద్ర వేతన సంఘం ప్రకారం వేతనాలు పెంచడం, ఆచార్యుల వయసును 65 సంవత్సరాలకు పెంచడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా యూజీసీ వేతనాలు అందుకునే వారికీ మెడికల్ రీఎంబర్స్‌మెంట్ వర్తింపజేయాలన్నది కమిటీ ప్రధాన సిఫార్సులు. ఉన్నతాధికారులు కమిటీ అన్ని సిఫార్సులకు ఆమోదం తెలిపారు. పదవీ విరమణ వయసు పెంచడంపై తమకు అభ్యంతరం లేదని, దానిపై తుది నిర్ణయం మాత్రం ముఖ్యమంత్రి తీసుకోవాల్సి ఉంటుందని ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పష్టంచేశారు. కమిటీ ప్రతిపాదనలకు యథాతథంగా ఆమోదం తెలిపిన ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి నివేదికను పంపారు. సిఫార్సులు అమలైతే వర్సిటీలు, డిగ్రీకళాశాలల్లో కలిపి 3 వేల మంది బోధన సిబ్బందికి ప్రయోజనం కలుగుతుంది.

ఏదుల నుంచే డిండికి నీళ్లు!

- కసరత్తు ప్రారంభించిన నీటిపారుదలశాఖ

ఈనాడు, హైదరాబాద్: పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని మళ్లించాలని తాజాగా ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. దీనికి తగ్గట్లుగా మార్పులు చేయడానికి నీటిపారుదల శాఖ కసరత్తు ప్రారంభించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు రెండు టీఎంసీల నీటిని మళ్లించనున్నారు. ఇందులో అర టీఎంసీ నీటిని డిండి ఎత్తిపోతల పథకానికి కేటాయించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మొదటి రిజర్వాయర్ నార్లాపూర్ కాగా, రెండోది ఏదుల రిజర్వాయర్. ఏదుల వరకు రెండు టీఎంసీల నీటిని తీసుకొని, ఈ రిజర్వాయర్ నుంచి ఒకటిన్నర టీఎంసీలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ఆయకట్టుకు, అర టీఎంసీ ఏదుల- వట్టెం రిజర్వాయర్ మధ్య నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి మళ్లించాలన్నది ప్రణాళిక. డిండి ఎత్తిపోతలకు నీటిని మళ్లించడానికి తవ్వే కాలువ వల్ల కల్వకుర్తి ఆయకట్టు ఎక్కువగా పోతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో నార్లాపూర్ నుంచి ప్రస్తుతం ఉన్న డిండి రిజర్వాయర్‌కు నీటిని మళ్లించి అక్కడి నుంచి డిండి ఎత్తిపోతలకు తీసుకొనేలా ప్రత్యామ్నాయాన్ని ఆలోచించారు. తర్వాత ప్రస్తుత డిండి రిజర్వాయర్‌కు పైభాగంలో ఉప్పర వద్ద 0.3 టీఎంసీ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలని, నార్లాపూర్ నుంచి ఇక్కడికి నీటిని తీసుకుని డిండి ఎత్తిపోతల పథకానికి సరఫరా చేయాలని భావించారు. ఇందుకోసం ఓ లిఫ్టును నిర్మించాల్సి ఉంటుంది. తాజాగా నార్లాపూర్ నుంచి కాకుండా ఏదుల- వట్టెం మధ్య నుంచే కాలువ ద్వారా నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిసింది. సీఎం వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో దీనిపై చర్చ జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీని ప్రకారం లిఫ్టు అవసరం లేదు. కాలువ ద్వారా మళ్లించడానికి అవకాశం ఉంటుంది.

పిడుగురాళ్లలో కంపించిన భూమి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో శనివారం భూమి స్వల్పంగా కంపించింది. గంటన్నర వ్యవధిలో నాలుగుసార్లు భూమి స్వల్పంగా కంపించి, పెద్దపెద్ద శబ్దాలు రావడంతో ప్రజలు ఇళ్ల నుంచి భయంతో బయటకు పరుగులు తీశారు. శనివారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో భూమి నుంచి పెద్దశబ్దం విన్పించింది. మళ్లీ 20 నిమిషాల తరువాత 3.50 గంటలకు మరోసారి భూమి నుంచి భారీ శబ్దాలు వచ్చాయి. తరువాత సాయంత్రం 4.33 గంటలకు, 4.57గంటలకు భూమిలోపల పెద్ద శబ్దాలు వెలువడటంతో పాటు స్వల్పంగా భూమి కంపించడంతో జనం ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. పట్టణానికి పక్కనే ఉన్న జానపాడులో కూడా శబ్దాలు వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

మరోసారి భాజపా.. మరోసారి మోదీ

వచ్చే ఎన్నికల్లో ఇదే మా నినాదం: లక్ష్మణ్

ఈనాడు, దిల్లీ: 'మరోసారి భాజపా.. మరోసారి మోదీ' అనే నినాదంతో ఇప్పటి నుంచే లోక్‌సభ ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేయనున్నట్లు భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చెప్పారు. దిల్లీలో భాజపా జాతీయ మండలి సమావేశాల అనంతరం శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల సమావేశాల్లో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా స్ఫూర్తిదాయక ప్రసంగాలతో శ్రేణులకు మార్గనిర్దేశనం చేశారన్నారు. బూత్ స్థాయిలో గెలిస్తేనే పార్టీని, మోదీని గెలిపించినట్లని.. అందుకే బూత్ స్థాయిలో పార్టీని గెలిపించాలని సంకల్పించుకున్నామన్నారు. వ్యవసాయం, సంక్షేమ, ఆర్థిక రంగాల్లో గణనీయమైన మార్పులు.. ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్ల వంటి విప్లవాత్మక సంస్కరణలను ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అభివృద్ధిని ఈ అయిదేళ్ల అభివృద్ధిని పోల్చిచూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోదీకి వ్యతిరేకంగా ఏర్పాటవుతున్న కూటమికి నాయకుడు లేరన్నారు.

22న తెలంగాణకు అమిత్ షా

శాసనసభ ఎన్నికల్లో పార్టీ పరాజయం నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఈ నెల 22న తెలంగాణకు రానున్నారు. హైదరాబాద్ లేదా ఏదైనా జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం కానున్నారు.

అబద్ధాల్లో మోదీ గిన్నిస్ రికార్డు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ఈనాడు, దిల్లీ: అబద్ధాలు చెప్పడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గిన్నిస్ బుక్ రికార్డు ఇవ్వాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్యానించారు. దిల్లీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అయిదు రాష్ట్రాల్లో ఓటమి తాలూకు భయంతో వచ్చే ఎన్నికల్లో గెలవలేమోననే ఆందోళన భాజపా నేతల్లో ఎక్కువైంది. తమ హయాంలో కుంభకోణాలే లేవంటున్న భాజపా నేతలు రఫేల్ ఒప్పందంలో ఏం జరిగిందో ప్రజలకు చెప్పాలి. భాజపా అధ్యక్షుడు అమిత్ షా రామమందిరం నిర్మిస్తామంటున్నారు.. సుప్రీంకోర్టు తీర్పు రాకుండా అది ఎలా సాధ్యమో చెప్పాలి? ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్ల బిల్లులా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్రం ఎందుకు చట్టం చేయడం లేదు? రాజ్యాంగబద్ధ వ్యవస్థలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఆలోక్ వర్మ వ్యవహారంలో మోదీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది. మోదీ, అమిత్ షాల తీరుతో దేశం నాశనమవుతోంది. 2014 ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైన భాజపా.. ఈసారి అధికారంలోకి రాదు' అని నారాయణ ధ్వజమెత్తారు.

హజ్ యాత్రికుల ఎంపికకు ఆన్‌లైన్ డ్రా

తెలంగాణ కోటా కింద 4,169 మందికి అవకాశం

నాంపల్లి, న్యూస్‌టుడే: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్ర- 2019కి సంబంధించి యాత్రికుల ఎంపిక కోసం శనివారం కంప్యూటరైజ్డ్ ఆన్‌లైన్ డ్రాను (ఖుర్రా) నిర్వహించారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో హైదరాబాద్ నాంపల్లి హజ్ హౌస్‌లో తెలంగాణ హజ్ కమిటీ ప్రత్యేకాధికారి ప్రొఫెసర్ ఎస్.ఎ.షుకూర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ కోటా కింద కేటాయించిన 4,169 మంది యాత్రికులకు గాను 70 సంవత్సరాలు నిండిన 484 మంది వృద్ధులకు రిజర్వు కోటా కింద నేరుగా హజ్‌ను సందర్శించే అవకాశం లభించింది. మిగిలిన 3,685 సీట్లకు గాను 12,884 దరఖాస్తులు అందగా ఆన్‌లైన్ డ్రా ద్వారా యాత్రికులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ ఎ.ఇ.ఒ. ఇర్ఫాన్‌షరీఫ్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల మహా కూటమి

ఫిబ్రవరి 7న దిల్లీలో ర్యాలీ

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: మోదీ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని జేఎన్‌యూ (దిల్లీ) విద్యార్థి సంఘం అధ్యక్షుడు సాయి బాలాజీ ఆరోపించారు. వాటిని నిరసించడంతో పాటు మతోన్మాద దాడులపై పోరాడేందుకు జాతీయ స్థాయిలో విద్యార్థి సంఘాల మహాకూటమిని ఏర్పాటు చేశామని ప్రకటించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో శనివారం పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర నాయకుడు ఎం.పరశురాం, టీవీవీ నేతలు మద్దిలేటి, సందీప్, ఇతరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఏబీవీపీ తప్ప ఇతర విద్యార్థి సంఘాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చి, భాజపా సర్కారుకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. ఇందులో భాగంగానే వచ్చే నెల 7వతేదీన 'యంగ్ ఇండియా అధికార్ మార్చ్' పేరిట దిల్లీలోని ఎర్రకోట నుంచి పార్లమెంటు స్ట్రీట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

తరచూ కళాశాలలు మారితే 'బ్లాక్‌లిస్టు'లోకే..

వృత్తి విద్యా కళాశాలల అధ్యాపకులకు జేఎన్‌టీయూహెచ్ కొత్త నిబంధన

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులు తరచూ కళాశాలలు మారితే వారి పేర్లను జేఎన్‌టీయూహెచ్ బ్లాక్‌లిస్టులో పెట్టనుంది. 'తరచూ' అంటే ఏడాదిలో ఎన్నిసార్లనేదీ స్పష్టం చేయలేదు. వచ్చే విద్యాసంవత్సరానికి కళాశాలల అనుమతికి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇటీవల నిబంధనావళి విడుదల చేసిన నేపథ్యంలో వర్సిటీ అనుబంధ గుర్తింపు కోసం జేఎన్‌టీయూహెచ్ నిబంధనావళిని రూపొందించి వెబ్‌సైట్లో ఉంచింది. ఈ నెల 31లోపు కళాశాలల మూసివేతకు దరఖాస్తు చేసుకోవచ్చు. కమిటీ తనిఖీ సమయంలో అధ్యాపకులు ఒక కళాశాలలో కంటే ఎక్కువ కళాశాలల్లో కనిపించినా, కళాశాల మారినప్పుడు తగిన ధ్రువపత్రాలతో వర్సిటీకి సమాచారం ఇవ్వకున్నా.. ఫ్యాకల్టీ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయకున్నా, ఆ పోర్టల్‌లో ఒకటి కంటే ఎక్కువ సార్లు పేరు రిజిస్ట్రేషన్ చేసుకున్నా, రెగ్యులర్ కోర్సు చదువుతూ కళాశాలల్లో పనిచేస్తున్నా అలాంటి వారిని బ్లాక్‌లిస్టులో పెడతారు. జరిమానా, న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని వర్సిటీ పేర్కొంది. జేఎన్‌టీయూహెచ్ నిబంధనలకన్నా అధ్యాపకులు ఎక్కువ సెలవులు తీసుకున్నా కళాశాలకు అనుబంధ గుర్తింపు లభించడం కష్టమే. ఇప్పటివరకు 51 రకాల ఎంటెక్ కోర్సులకు జేఎన్‌టీయూహెచ్ ఆమోదం ఉంది. ఎంటెక్ కృత్రిమ మేధ, డేటా సైన్సెస్ కోర్సులను అదనంగా చేర్చారు.

ఆర్టీసీ బస్సు బీభత్సం

- ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు
- కారు, ఆటో ధ్వంసం
- సికింద్రాబాద్‌లో ఘటన



సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్ వద్ద ప్రమాదానికి కారణమైన బస్సు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లో పాస్‌పోర్ట్ కార్యాలయం వద్ద ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు గాయపడ్డారు. రెండు కార్లు, రెండు ఆటోలు, ద్విచక్ర వాహనం ధ్వంసమయ్యాయి. శనివారం సాయంత్రం 6.10 గంటల సమయంలో మియాపూర్-2 డిపో బస్సు జేఎన్‌టీయూ నుంచి సికింద్రాబాద్‌కు వస్తోంది. బస్సు క్లాక్‌టవర్ ప్రాంతానికి చేరుకున్న సమయంలో డ్రైవర్ బస్సును వేగంగా నడపడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బస్సు మెట్రో పిల్లర్ల మధ్య నుంచి డివైడర్ దాటి రాంగ్‌రూట్‌లో వెళ్తూ కార్లు, ఆటోలు, బైక్‌లను ఢీకొంది. బోయిన్‌పల్లికి చెందిన ఆటోడ్రైవర్ శ్రీనివాస్, యాదాద్రి జిల్లా ఆలేరు కొలనుపాకకు చెందిన ప్రయాణికురాలు దానమ్మ గాయపడ్డారు. వీరిని పోలీసులు గాంధీ ఆసుపత్రి తరలించారు. బస్సు డ్రైవర్ హైమదన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద స్థలాన్ని ఆర్టీసీ ఆర్ఎం రమాకాంత్ పరిశీలించారు. బస్సు బ్రేకులు ఫెయిల్ అయ్యాయని డ్రైవర్ చెబుతున్నప్పటికీ, కంటోన్మెంట్ ఆర్టీసీ అధికారులు పవర్ బ్రేకులు సరిగానే ఉన్నాయని చెప్పారు.

ఈనాడు బిజినెస్ వారాంతం

రూ.1500 కోట్ల మొండి బాకీలు వసూలవుతాయి

సిండికేట్ బ్యాంక్ ఎండీ మృత్యుంజయ్ మహాపాత్ర

ఈనాడు, హైదరాబాద్: సిండికేట్ బ్యాంక్ వచ్చే ఆరు నెలల వ్యవధిలో రూ. 1500 కోట్ల మొండి బాకీలు వసూలవుతాయని భావిస్తోంది. కొన్ని పెద్ద ఖాతాల్లో మొండి బాకీల వసూలు నిమిత్తం ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)లో సిండికేట్ బ్యాంక్ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ తుది దశకు చేరుకుంది. ఆ ఖాతాల్లో సానుకూల తీర్పులు వచ్చే అవకాశం ఉంది. తత్ఫలితంగా మొండి బాకీల వసూళ్లు పెరుగుతాయని ఆశిస్తున్నట్లు సిండికేట్ బ్యాంక్ ఎండీ, సీఈఓ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. శనివారం హైదరాబాద్ వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'దేశవ్యాప్తంగా 1500 మంది ఉద్యోగులను కేవలం బాకీల వసూలుకే కేటాయించాం, 8 శాఖలను పూర్తిగా వసూళ్ల పనిమీదే పెట్టాం. పైగా బాకీల వసూళ్ల వ్యవహారాలను నేరుగా కేంద్ర కార్యాలయం నుంచి సమీక్షిస్తున్నాం' అన్నారాయన.

మొదటి త్రైమాసికంలో లాభాల్లోకి..: సిండికేట్ బ్యాంకుకు గత ఏడాది సెప్టెంబరు నాటికి స్థూల నిరర్ధక ఆస్తులు (జీఎన్‌పీఏ) 12.9 శాతం, నికర నిరర్ధక ఆస్తులు (ఎన్‌ఎన్‌పీఏ) 6.8 శాతం ఉన్నాయి. ముఖ్యంగా ఇటీవల కాలంలో వ్యవసాయ రుణాల్లో రానిబాకీలు ఎక్కువయ్యాయి. వివిధ రాష్ట్రాల్లో రుణ మాఫీ ప్రకటించటం, రుణమాఫీకి రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వటంతో వ్యవసాయ రుణాలు తిరిగి చెల్లించే వారు కూడా ఆగిపోతున్నారు. దీన్ని మినహాయిస్తే ఇతర విభాగాల్లో గత కొంతకాలంగా తాము తీసుకుంటున్న చర్యలతో నిరర్ధక ఆస్తులు తగ్గుతున్నాయని మహాపాత్ర పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి స్థూల నిరర్ధక ఆస్తులు 12 శాతం కంటే తక్కువగా ఉంటాయని, అదేవిధంగా నికర నిరర్ధక ఆస్తులు 6 శాతం కంటే కిందకు దిగివస్తాయని వివరించారు. అంతేగాక మొండి బాకీల వసూళ్లతో వచ్చే ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బ్యాంకు లాభాల్లోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోపక్క రిటైల్ రుణాల్లో అధిక వృద్ధి నమోదు చేయటానికి ప్రయత్నిస్తున్నట్లు మహాపాత్ర తెలిపారు. ముఖ్యంగా గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు అధికంగా ఇస్తున్నట్లు వివరించారు. కార్పొరేట్ రుణాల విషయంలో ఇంకా సానుకూలత కనిపించటం లేదని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఈఎస్‌పీఎస్ (ఎంప్లాయీ షేర్ పర్చేజ్ స్కీమ్) ద్వారా రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లు సమీకరించనున్నామని వెల్లడించారు.

ఏపీ, తెలంగాణాల్లో..: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సిండికేట్ బ్యాంక్ వ్యాపార కార్యకలాపాలు ఆకర్షణీయంగా ఉన్నట్లు హైదరాబాద్ జోనల్ హెడ్ ఎస్. విజయ్‌కుమార్ చెప్పారు. ముఖ్యంగా మొండిబాకీల వసూళ్లలో హైదరాబాద్ జోన్ అగ్రస్థానంలో ఉందన్నారు. తమకు రూ.258 కోట్ల బాకీలు వసూలు లక్ష్యాన్ని నిర్దేశించగా, దాన్ని మించి రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు వెల్లడించారు.



హైదరాబాద్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతున్న సిండికేట్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ అధిపతి ఎస్. విజయ్‌కుమార్, బ్యాంక్ ఎండీ, సీఈఓ మృత్యుంజయ్ మహాపాత్ర

అవెన్యూ సూపర్ మార్ట్స్ లాభం రూ.257 కోట్లు

దిల్లీ: అక్టోబరు-డిసెంబరులో డి-మార్ట్ సూపర్ మార్కెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ నికర లాభం 2.1 శాతం పెరిగి రూ.257 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో నికర లాభం రూ.252 కోట్లుగా నమోదైందని కంపెనీ బీఎస్ఈకిచ్చిన సమాచారంలో వెల్లడించింది. ఇక కార్యకలాపాల ద్వారా సమకూరిన ఆదాయం 33.2 శాతం వృద్ధి చెంది రూ.4094 కోట్ల నుంచి రూ.5,451 కోట్లకు చేరుకుంది. షేరు వారీ ఆర్జన(ఈపీఎస్) రూ.4.12గా నమోదైంది. 2017-18 అక్టోబరు-డిసెంబరులో ఇది రూ.4.03గా ఉంది. కాగా, సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ నాలుగు స్టోర్లను ఏర్పాటు చేసింది.



కొత్త సినిమా విడుదల మీ ఇంట్లోనే

సంక్రాంతి పండుగ అంటేనే కొత్త సినిమాల సందడి.. మిగిలిన పెద్ద పండుగలు, వేసవి సెలవులప్పుడూ ఇలానే ఉంటుంది. ఆయా సందర్భాల్లో ఇళ్లకు వచ్చే బంధుమిత్రులతో కలిసి, అభిమాన కథానాయకుల సినిమాలు చూసేందుకు అధికులు ఇష్టపడుతుంటారు. ఎన్ని థియేటర్లలో ఆడుతున్నా, సామర్థ్యానికి మించి ప్రేక్షకులు వస్తున్నందున, కోరుకున్న ఆటకు టికెట్లు దక్కించుకోవడం కష్టమే అవుతోంది. ఈ బాధ లేమీ పడకుండా, మన ఇంట్లోనూ కొత్త సినిమా విడుదల చేసుకునే వీలుంది. ఇంట్లో హోమ్ థియేటర్ ఉండి, డిజిటల్ ప్రింట్‌లు విడుదల చేసే క్యూబ్ సర్వర్‌కు అనుసంధానమైతే చాలు.. సినిమాను బట్టి రోజుకు రూ.2,000-40,000 చెల్లించి, సౌకర్యవంతంగా, కోరుకున్న సమయంలో తిలకించేవారి సంఖ్య పెరుగుతోంది.

- క్యూబ్ వద్ద లైసెన్స్, సర్వర్ పొందాలి
- రోజుకు రూ.2,000 -40,000 రుసుము
- హోమ్ థియేటర్ సంస్థలే ఇప్పిస్తున్నాయ్

ఈనాడు వాణిజ్య విభాగం

తెలుగు రాష్ట్రాల్లో సినీ అభిమానులు ఎక్కువ. సెలవుల్లో వినోదానికి సినిమాహాళ్లను ఆశ్రయించేవారి సంఖ్య బాగా అధికం. టీవీ చానళ్లు కూడా సినిమాలు, సినీ ఆధారిత కార్యక్రమాలను విస్తృతంగా ప్రసారం చేస్తున్నందున, ఇళ్లలో 43-55 అంగుళాల పెద్ద తెర కలిగిన ఎల్ఈడీలు, స్మార్ట్ టీవీల్లో చూస్తూ ఆనందిస్తున్నారు. అందరూ కలిసి కూర్చునే హాలుతో పాటు పడకగదుల్లో కూడా పెద్ద తెర టీవీలు అమర్చుకుని, టీవీ చానళ్లు ప్రసారం చేసే సినిమాలతో పాటు అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ ప్రీమియం, జీ5, సన్, వీఐయూ.. వంటి యాప్‌లతో కోరుకున్న సినిమాలను వీక్షిస్తున్నారు. వీటికి 5.1 ఆడియో సిస్టమ్ ఏర్పాటు చేసుకుని, హోమ్‌థియేటర్‌గా మార్చుకుంటే, శబ్దనాణ్యత బాగుండి, సినిమా చూసిన అనుభూతి కలుగుతోంది. హాలు (లివింగ్‌రూమ్)లో కుటుంబమంతా కలిసి సినిమా చూసేందుకు ఇది సౌకర్యవంతంగా ఉంటుంది. టీవీ కాకుండా ఇందుకు రూ.30,000-40,000 సరిపోతాయి. అయితే థియేటర్ స్థాయి అనుభూతి కావాలంటే, నాణ్యమైన హోమ్ థియేటర్ ఏర్పాటు చేసుకోవాల్సిందే. ఇందుకోసం ప్రత్యేక గది కేటాయించాలి. విలాసవంత 4 బెడ్‌రూం ఫ్లాట్‌లు, విల్లాలు, డ్యూప్లెక్స్‌లు, సొంతగా నిర్మించుకునే సౌధాల్లో వీలుంటోంది. హోమ్ థియేటర్లు ఏర్పాటు చేసే సంస్థలే, డిజిటల్ ప్రింట్లలో సినిమాలు పంపిణీ చేసే క్యూబ్‌తో ఒప్పందాన్నీ చేసి పెడుతున్నాయి. దేశంలోని ప్రధానమైన 20-25 నగరాల్లో హోమ్‌థియేటర్ వ్యవస్థలు అమర్చిపెట్టే పెద్దస్థాయి సంస్థలు 10 వరకు ఉంటాయని అంచనా.

క్యూబ్ సర్వర్‌కు రూ.4.5 లక్షలు

తెలుగు రాష్ట్రాల్లోని థియేటర్లలో డిజిటల్ విధానంలోనే సినిమాలు ప్రదర్శిస్తున్నారు. ఇందుకు క్యూబ్ సంస్థ డిస్ట్రిబ్యూటర్లున్నారు. వీరి వద్ద లైసెన్స్ తీసుకుని, సర్వర్ ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకు ఒక్కసారి మాత్రమే రూ.4.5 లక్షలు చెల్లించాలి. ఇక కొత్త సినిమాను విడుదల రోజే చూసేందుకు హీరో, డిమాండ్‌ను బట్టి రోజుకు రూ.2,000-40,000 వరకు నిర్మాతలు ఛార్జి చేస్తున్నారు. బాహుబలికి అయితే రూ.75,000 తీసుకున్నారట. రోజులో ఎన్నిసార్లు అయినా చూడొచ్చు. నిర్మాతలతో ఒప్పందం చేసుకునేందుకు క్యూబ్ పంపిణీదార్లే సహకరిస్తుంటారు. కాస్త పలుకుబడి ఉండి, రూ.20-25 లక్షలతో హోమ్ థియేటర్ ఏర్పాటు చేసుకునే వారు ఇందుకు ఉత్సుకత చూపుతున్నారు.

పెద్దగా సమస్యలేమీ రావు.. విక్రయానంతర సేవలు ఇస్తాం

హోమ్ థియేటర్ వ్యవస్థల్లో ప్రతిదానికీ వారంటీ ఉంటుంది. మరమ్మతులు పెద్దగా ఏమీ రావు. 8-10 ఏళ్లు చూస్తాం. విడిభాగాలతో కలిపి, వార్షిక సర్వీస్‌కు 8-10 శాతం తీసుకుంటాం. ఖాతాదారు బడ్జెట్, అవసరానికి అనుగుణంగా మేము డిజైనింగ్ నుంచి పరికరాలు సిఫారసు చేసి, ఏర్పాటు చేస్తాం. ఏసీ, లైటింగ్ వినియోగదారులే కొనుక్కోవాలి. గత 18 ఏళ్లలో తెలుగు రాష్ట్రాలతో పాటు, ఇతర ప్రాంతాల్లో కలిపి 1,000కి పైగా అసెంబుల్ చేశాం. అధికులు సగటున రూ.20-25 లక్షలు వెచ్చిస్తున్నారు. అకౌస్టికల్ సొసైటీ ఆఫ్ అమెరికా గుర్తింపు ఉన్న సంస్థ మాదే. అమరావతి, విశాఖపట్నం, భీమవరం వంటి ప్రాంతాల్లో కూడా గిరాకీ పెరుగుతున్నందున, ప్రత్యేకంగా ఫ్రాంఛైజీలు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నాం.

శేషారెడ్డి, ఎండీ, వెక్టర్ సిస్టమ్స్

ఎంత ఖర్చవుతుందంటే..

కనీసం 10X15 అడుగుల విస్తీర్ణం కలిగిన గదిని ప్రత్యేకంగా హోమ్‌థియేటర్ కోసం కేటాయించ గలిగితే చక్కని సదుపాయాలు ఏర్పాటు చేసుకోవచ్చు. రూ.3 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకు వెచ్చిస్తున్నవారున్నారు. మల్టీప్లెక్స్‌ల తరహాలో కావాలంటే కనీసం రూ.20-25 లక్షలు పెట్టాల్సిందే. బయటి శబ్దాలు లోపలికి - సినిమా శబ్దహోరు గది బయటకు రాకుండా చేసే ఏర్పాట్లు మన్నికైన ఫ్లోరింగ్, కార్పెట్లు, ఏసీ, అత్యాధునిక ప్రొజెక్టర్, సౌండ్‌సిస్టమ్, మన్నికైన తెర, విశ్రాంతిగా కూర్చునేందుకు రిక్లైనర్ కుర్చీలు, సోఫాల వంటివి తాహతుకు తగ్గట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. అమెజాన్ ఫైర్‌స్టిక్, బ్లూరే ప్లేయర్, ఆపిల్ టీవీ వంటి వాటితో యాప్ ప్రసారాలనూ పెద్ద తెరలపై చూడొచ్చు.

ప్రొజెక్టర్

బెన్‌క్యు, ఎప్సన్, సోనీ, పానసోనిక్, బార్కో వంటి కంపెనీలవి రూ.50,000-50 లక్షల వరకు లభిస్తున్నాయి.

తెర

భిన్న రకాలున్నాయి. 80 - 400 అంగుళాలవి వాడుతున్నారు. స్పీకర్లు వంటివి ఏమీ కనపడని రకం ధర ఎక్కువ. సౌండ్ సిస్టమ్స్ కనపడేవి మరో రకం. రీవెర్బ్ వంటివి వాడుతున్నారు. రూ.2 -15 లక్షల మేర వీటి ధర ఉంటుంది. గోడపై ప్రత్యేక రంగు వేసి, తెరలా వాడుకోవచ్చు. కెనడా నుంచి దిగుమతి అయ్యే స్క్రీన్‌గో బ్రాండ్ ఎక్కువగా వాడుతున్నారు. ఇందుకు రూ.10,000-12,000 అవుతుంది.

సౌండ్‌సిస్టమ్

డాల్బీ అట్మోస్, బోస్, మేయర్, బీ అండ్ డబ్ల్యు, మానిటర్ ఆడియో వంటి కంపెనీల స్పీకర్లు, ఆడియో సిస్టమ్ వూఫర్, యాంప్లిఫైయర్లతో కలిపి రూ.40,000-రూ.2 కోట్ల వరకు ఉన్నాయి. తెరపై పాత్రలు మాట్లాడుతున్న వైపు నుంచే శబ్దం వచ్చేందుకు, స్పష్టతను బట్టి ధరలు మారుతుంటాయి.

ఏవీ రిసీవర్

తెరను బట్టి ఆడియో, వీడియో రిసీవర్ల అవసరం ఉంటుంది. ఇవి రూ.25,000-25 లక్షల వరకు లభిస్తున్నాయి.

అకౌస్టిక్స్

ఐసొలేషన్ (గది నుంచి బయటకు శబ్దం రాకుండా), గదిలో శబ్దస్పష్టత బాగుండేలా, రీసౌండ్ రాకుండా (రీఇన్‌ఫోర్స్‌మెంట్) ఏర్పాట్లకు చదరపు అడుగుకు రూ.150-2500 వసూలు చేస్తున్నారు. గదిని బట్టి ఇది మారుతుంది. లైటింగ్ ఏర్పాట్లు కూడా ఆహ్లాదకరంగా, అనుగుణంగా చేస్తారు.

రిక్లైనర్స్

అత్యధికులు రిక్లైనర్లు అమర్చుకుంటున్నారు. ఇవి రూ.25,000-6 లక్షల వరకు అవుతున్నాయి. 6-15 సీట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఆటోమేషన్

ప్రొజెక్టర్, చానల్, సౌండ్.. ఇలా ప్రతిదానికీ విడిగా రిమోట్‌లు కాకుండా ఒక్క ఐప్యాడ్‌తో చేసుకోవచ్చు. గదిలోకి రాగానే లైట్లు వెలగడం, ఏసీ ఆన్ చేసుకోవడం వంటి ఆటోమేషన్‌కు మరో రూ.లక్ష వరకు వెచ్చిస్తున్నారు.

30 నిమిషాల్లోనే వెబ్‌సైట్, యాప్

- నెలవారీ నిర్వహణ ఖర్చు చెల్లిస్తే చాలు
- చిన్న సంస్థలకు సాఫ్ట్‌వేర్ సేవలు

ఈనాడు - హైదరాబాద్

పెద్ద సంస్థలైనా... చిన్న కిరాణా దుకాణమైనా ఈరోజుల్లో సాంకేతిక సాయం తప్పనిసరి. పదేపదే చేసే ఒక పనిలో మానవ ప్రమేయం అక్కర్లేకుండా చూడటం ద్వారా పనిలో వేగం పెరుగుతుంది. కానీ.. ఈ సాంకేతికతను అభివృద్ధి చేయడం, దాని నిర్వహణ కాస్త వ్యయప్రయాసలతో కూడుకున్నదే. ఈ ఇబ్బందితోనే చాలా సంస్థలు డిజిటల్ వైపు అడుగులు వేయడానికి ఇష్టపడటం లేదు. ఈ ఇబ్బందులనే తమ వ్యాపార అవకాశంగా మార్చుకున్న సంస్థే ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్. సాంకేతికతను ఒక సేవలా (సర్వీస్) అందిస్తోన్న ఈ సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణ కుప్ప (రామ కుప్ప). హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ.. చిన్న సంస్థల నుంచి.. పేరు పొందిన కొన్ని ప్రముఖ కంపెనీల వరకూ సాఫ్ట్‌వేర్ సేవలను అందిస్తోన్న ఆన్‌గో ఫ్రేంవర్క్ ప్రస్థానమిదీ..



అంకురం

ఆన్‌గో ఫ్రేంవర్క్

ఒక వ్యాపారానికి అవసరమైన డిజిటల్ సేవలను సగటున 30 నిమిషాల్లోనే అందించాలి అనే లక్ష్యంతో ప్రారంభమైన ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ ప్రస్తుతం భారత్‌తోపాటూ దుబాయ్, మధ్య ప్రాచ్య దేశాలకూ విస్తరించింది. తక్కువ ఖర్చుతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీలకు టెక్నాలజీని అందిస్తూ.. నెలవారీ నిర్వహణ ఖర్చులు వసూలు చేయడం దీని ప్రత్యేకత. విద్యాభ్యాసం పూర్తయి బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో ఉద్యోగంలో చేరిన రామ్ దృష్టంతా ఎప్పుడూ 'ఆటోమేషన్' చుట్టూ తిరుగుతూ ఉండేది. మైండ్‌ట్రీ, మోటారోలాలో ఈ అంశంపైనే ఎక్కువగా పనిచేసేవారు. ఈ అనుభవంతోనే 2009లో ఉద్యోగం మానేసి సొంతంగా క్రియేటివ్ ఎక్స్‌పర్ట్స్ కన్సల్టింగ్ అనే ఐటీ కంపెనీ ప్రారంభించారు. అయితే, పెద్ద సంస్థలకు మొబిలిటీకి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి, అందించేవారు. 'ఈ సమయంలోనే నేను కొన్ని విషయాలు గమనించాను. సాంకేతిక అభివృది, దాని నిర్వహణ ఖర్చుతో కూడుకున్నది. సమయం కూడా ఎక్కువగా పడుతోంది. దీంతోపాటు ఎప్పటికప్పుడు మారే టెక్నాలజీ గురించి తెలుసుకుంటూ ఉండాలి. ఇవన్నీ కాస్త క్లిష్టంగా ఉండటంతో పెద్ద కంపెనీలు కూడా పూర్తిస్థాయి డిజిటల్‌లోకి మారేందుకు ఇబ్బంది పడుతున్నాయని అర్థం అయ్యింది. ఇలా పెద్ద కంపెనీలకే కాకుండా చిన్నస్థాయి సంస్థలకూ టెక్నాలజీని ఒక సర్వీస్‌లాగా అందించాలనుకున్నాం. అంటే అన్నీ మేమే చూసుకుంటాం, ఆయా సంస్థలు నెలవారీ నిర్వహణ ఖర్చు చెల్లిస్తే చాలు అనే విధంగా ఒక సంస్థను ప్రారంభించాలనుకున్నా. ఇలా.. 2013 నుంచి దీనిపైనే పనిచేశాం. చివరకు అంతా సిద్ధం చేసుకొని, మే 2015 లో నా శ్రీమతి అనసూయ అఖిలతో కలిసి ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ ప్రారంభించాం. మొదట్లో మా దగ్గర ఉన్న రూ.1.2 కోట్లనే పెట్టుబడిగా పెట్టాం.' అని వివరించారు రామకృష్ణ.

430 విభాగాల్లో...

ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ పనితీరును పరీక్షించేందుకు దాదాపు 1000 వ్యాపార సంస్థలకు పూర్తి ఉచితంగా సాఫ్ట్‌వేర్, వెబ్‌సైట్లను తయారు చేసి ఇచ్చారు. వాటిని కొన్నాళ్లపాటు నిర్వహించి, అందులో వచ్చే సాంకేతిక ఇబ్బందులేమున్నాయో తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అలా నవంబరు 2015లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిందీ సంస్థ. ప్రస్తుతం కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీ, ఈఆర్‌పీ, వాలెట్ ప్రోగ్రామింగ్‌లాంటి అన్ని రకాల టెక్నాలజీలతో ఈ సంస్థ సిద్ధంగా ఉంది. దాదాపు 430 రకాలు, 10,300 విభాగాలు ఇలా ఎప్పటికప్పుడు వ్యాపారాలకు సంబంధించిన సమాచారాలను విశ్లేషిస్తూ అందుకు అనువైన సాంకేతికతలను అందిస్తోంది. అరగంట నుంచి ఒక గంట వ్యవధిలో ఎస్ఎంఈలకు కావాల్సిన విధంగా డిజిటల్ సేవలు సిద్ధంగా ఉంటాయి. 'ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో ఏదైనా విక్రయించాలని అనుకొని, మమ్మల్ని సంప్రదిస్తే.. కేవలం 30 నిమిషాల్లోనే అతను వ్యాపారం ప్రారంభించేలా చేయగలం. వారికి అవసరమైన వెబ్‌సైట్, యాప్ వంటివన్నీ తయారు చేసి అందిస్తాం. శిక్షణ కూడా ఇస్తాం' అని చెప్పారు రామకృష్ణ. ఇప్పటి వరకూ 74 పెద్ద సంస్థలు, 1100ల ఎస్ఎంఈలకు ఈ సంస్థ సాంకేతిక సేవలను అందించింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 400 కంపెనీల వరకూ ఉన్నాయి. దుబాయి, మధ్య ప్రాచ్య దేశాల నుంచి 20 కంపెనీలు ఉన్నాయి. ఎస్‌బీఐ కార్డ్, లోహితా రైస్, బెల్ బ్రాండ్ రైస్‌లాంటి పలు సంస్థలు ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్ సేవలను పొందుతున్నాయి. సంస్థలకు సాంకేతిక సాయం అందించినందుకు గాను విభాగం, సాంకేతిక స్థాయిని బట్టి నెలకు రూ.2,000 నుంచి రూ.7లక్షల వరకూ నిర్వహణ ఖర్చును వసూలు చేస్తున్నారు. సాంకేతిక సహకారం, స్టోరేజీ, రక్షణ తదితర అన్ని అంశాలూ వారే చూసుకుంటారు.



విస్తరణ దిశగా...

గత ఆర్థిక సంవత్సరంలో రూ.3కోట్ల టర్నోవర్‌ను సాధించిన ఆన్‌గో ఫ్రేమ్‌వర్క్, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ.7.4కోట్ల టర్నోవర్‌ను సాధించింది. 2020కల్లా 10,000 సంస్థలకు సేవలను విస్తరించడంతోపాటు రూ.70 కోట్ల టర్నోవర్‌ను సాధించేందుకు ప్రయత్నిస్తున్నట్లు రామకృష్ణ తెలిపారు. అమెరికా, దుబాయ్, జోర్డాన్, ఒమెన్, ఉక్రెయిన్ తదితర దేశాల్లోని పలు సంస్థలతో చర్చిస్తున్నట్లు చెప్పారు. 'ఇప్పటి వరకూ రూ.10 కోట్లను సమీకరించాం. మా టెక్నాలజీని మార్కెటింగ్ చేసేందుకు హాకీస్టిక్ మీడియా అనే అంకురాన్ని కొనుగోలు చేశాం. క్లౌడ్ సేవల కోసం ఆలీబాబాతో ఒప్పందం కుదుర్చుకున్నాం. విస్తరణ చేపట్టేందుకు రూ.35 కోట్లను సమీకరించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతం మా సంస్థలో 102 మంది పనిచేస్తున్నారు. మరో మూడు నెలల్లో కొత్తగా 50 మందిని తీసుకునే ఆలోచనతో ఉన్నాం' అని వివరించారు.

యెస్ బ్యాంక్ తాత్కాలిక ఛైర్మన్‌గా బ్రహ్మదత్




దిల్లీ: నాన్ ఎగ్జిక్యూటివ్ తాత్కాలిక ఛైర్మన్‌గా బ్రహ్మదత్‌ను నియమించినట్లు యెస్ బ్యాంక్ శనివారం ప్రకటించింది. 'బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం, 1949 నిబంధనల కింద యెస్ బ్యాంక్ బోర్డు పార్ట్ టైం ఛైర్మన్‌గా దత్ నియామకానికి ఆర్‌బీఐ ఆమోద ముద్ర వేసినట్లు జనవరి 11, 2019 తేదీతో ఉన్న లేఖలో వెల్లడించింది. దత్‌కు 70 ఏళ్లు వచ్చే సమయం వరకు అంటే జులై 4, 2020 వరకు ఆ బాధ్యతల్లో ఉంటార'ని యెస్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. జులై 2013 నుంచి దత్ బ్యాంక్ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా ఉంటున్నారని.. గత అయిదున్నరరేళ్లుగా అన్ని ఉప-కమిటీల్లోనూ ఆయన బాధ్యతలను నిర్వహించారని యెస్ బ్యాంక్ తెలిపింది. ప్రస్తుతం ఆయన నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీకి అధ్యక్షుడిగా ఉన్నారు.

ఐఏఎస్ అయిన దత్ తన 37 ఏళ్ల వృత్తి జీవితంలో కర్ణాటక ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలలో పలు బాధ్యతలను నిర్వహించారు. పదవీ విమరణకు ముందు కేబినెట్ సెక్రటేరియట్, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖలలో కార్యదర్శిగా పనిచేశారు. ఇక యెస్ బ్యాంక్ బోర్డులో ప్రస్తుతం ముకేశ్ సభర్వాల్, సుభాశ్ కాలియా, అజయ్ కుమార్, ప్రతిమ షెరాయ్, ఉత్తమ్ ప్రకాశ్ అగర్వాల్, టి.ఎస్. విజయన్, రాణా కపూర్(ఎండీ, సీఈఓ)లున్నారు.

కొత్త ఎండీ, సీఈఓగా రజత్ మోంగా?

రాణా కపూర్ స్థానంలో కొత్త ఎండీ, సీఈఓ కోసం వెతుకులాట కొనసాగుతోంది. అయితే యెస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ రజత్ మోంగా, ఒక విదేశీ బ్యాంక్ సీఈఓను ఇందు కోసం ఎంపిక చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కపూర్ స్థానంలో బాధ్యతలు స్వీకరించగలిగే వ్యక్తులను కొంత మందిని ఎంపిక చేసినట్లు బ్యాంకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఈ వారం మొదట్లో పేర్కొన్న సంగతి తెలిసిందే.



కోడిగుడ్లు

12న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	443	వరంగల్	445
చిల్లరగా (ఒక గుడ్డు)	5.05	విశాఖపట్నం	445
బెంగళూరు	455	చెన్నై	450
13వ తేదీకి		చిత్తూరు	443
విజయవాడ/గోదావరి	443	నమక్కల్	435

సిరి

ఆదాయపు పన్ను.. ఆధారాలతో సిద్ధంకండి



ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరకు వస్తోంది. చాలామంది ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ఏ పాలసీ తీసుకోవాలి.. ఎక్కడ పెట్టుబడి పెట్టాలి అని ఆలోచిస్తున్న తరుణమిది. ఏప్రిల్ నుంచి ఏ మాత్రం ప్రణాళిక లేనివారు, ఇప్పుడు ఒకేసారి పెట్టుబడులు పెట్టేందుకు చూస్తుంటారు. పెట్టుబడులు పెట్టి, పన్ను మినహాయింపు పొందిన వారు వాటికి సంబంధించిన ఆధారాలు యాజమాన్యానికి చూపించాల్సిన సమయమూ వచ్చేసింది. ఈ కీలక సమయంలో పన్ను ఆదా విషయంలో ఎలా అడుగులు వేయాలి.. తెలుసుకుందాం!

సంపాదించిన ఆదాయం.. పరిమితి దాటినప్పుడు చట్టం నిర్దేశించిన శ్లాబుల ప్రకారం పన్ను చెల్లించాల్సిందే. 60 ఏళ్లలోపు వారు రూ.2,50,000 ఆదాయం దాటినప్పుడు పన్ను చెల్లించాలి. 60-80 ఏళ్ల వయసులో ఉన్నవారు రూ.3,00,000 వరకూ పన్ను చెల్లించక్కర్లేదు. 85 ఏళ్లు దాటినవారికి రూ.5లక్షల వరకూ ఎలాంటి పన్నూ లేదు. అదే సమయంలో పన్ను భారం తగ్గించేందుకు ఆదాయపు పన్ను చట్టం కొన్ని వెసులుబాట్లనూ కల్పించింది. సెక్షన్ 80సీ ప్రకారం పలు పెట్టుబడి పథకాల్లో మదుపు చేయడం ద్వారా రూ.1,50,000 వరకూ పన్ను మినహాయింపు పొందవచ్చు. సెక్షన్ 80డీ ప్రకారం ఆరోగ్య బీమా కోసం చెల్లించిన ప్రీమియానికి రూ.25 వేల వరకూ (తల్లిదండ్రుల కోసం పాలసీ తీసుకుంటే అదనంగా రూ.25 వేలు, వారు సీనియర్ సిటిజన్లయితే రూ.30వేల వరకూ), సీనియర్ సిటిజన్లు వైద్య బీమా తీసుకుంటే రూ.30వేల దాకా పన్ను మినహాయింపు వర్తిస్తుంది. దీంతోపాటు గృహరుణానికి చెల్లించే వడ్డీ, జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో పెట్టిన రూ.50,000 లకూ పన్ను మినహాయింపు కోసం చూపించుకోవచ్చు. విద్యారుణానికి చెల్లించిన వడ్డీకి కూడా సెక్షన్ 80ఈ ప్రకారం పూర్తి మినహాయింపు ఉంటుంది.

ఆదా ఒక్కటే సరిపోతుందా?

చట్టం కల్పించిన వెసులుబాట్లను ఉపయోగించుకునేందుకు నిర్ణీత పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి. ఇందులో ప్రధానంగా ఈపీఎఫ్, వీపీఎఫ్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్, జీవిత బీమా, పన్ను ఆదా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఈఎల్ఎస్ఎస్‌లవంటివే కాకుండా.. పిల్లల ఫీజులు, గృహరుణం అసలు ఇలా అనేకం ఉంటాయి. చాలామంది పన్ను ఆదా కోసం ఎంచుకునే పథకాల్లో పెట్టుబడికి హామీ ఉందా లేదా అని చూస్తుంటారు. సురక్షిత పథకాలు 7-8 శాతం మించి రాబడి ఇవ్వవన్నది తెలిసిందే. అయినప్పటికీ.. చాలామంది ఈ పథకాలను మాత్రమే పరిశీలిస్తుంటారు. అంతకన్నా ఎక్కువ రాబడి వచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ.. నష్టభయం ఉండటంతో వాటిని ఎంచుకునేందుకు ఇష్టపడరు. ఈఎల్ఎస్ఎస్‌లను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పిల్లల ఫీజులు, జీవిత బీమా కూడా నిజానికి పెట్టుబడులు కావు. పెట్టుబడి పథకాలు ఎంచుకునేప్పుడు పన్ను ఆదా ఒక అదనపు అవకాశంగా చూడాలి. పన్ను ఆదా కోసం అవసరమైనంత మేరకే ఈ నిర్ణీత పెట్టుబడుల్లో పెట్టాలి.

ఇంకా ఎంత పొదుపు?

2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను.. పన్ను ఆదా కోసం మీరు పెట్టిన పెట్టుబడులు, చెల్లించిన బీమా ప్రీమియాలు, పిల్లల ఫీజులు అన్నీ కలిపి ఎంత అయ్యాయో లెక్కలేసుకోండి. వాటికి సంబంధించిన రశీదులన్నీ తీసి పెట్టండి. మీ సంస్థలోని సంబంధిత విభాగాన్ని సంప్రదించి, అన్ని వివరాలూ సమర్పించండి. ఇంకా ఎంత పొదుపు చేసేందుకు అవకాశం ఉందో తెలుసుకోండి. ఒకవేళ మీరు ఇప్పటికే పూర్తి పెట్టుబడులు పెడితే.. వారు మీ వద్ద నుంచి ఎక్కువ పన్ను వసూలు చేయకుండా చూసుకోవచ్చు. మీరు ఆధారాలు సమర్పించేలోపే అధికంగా టీడీఎస్ పడినా బాధపడకండి. రిటర్నులు సమర్పించి, రిఫండు పొందే అవకాశం ఉంది.

❑ పథకాలను ఎంచుకునేప్పుడు వాటిలో ఎంత కాలం కొనసాగించాలన్నదీ ముఖ్యమే. ఉదాహరణకు పీపీఎఫ్ ఖాతాను కనీసం 15 ఏళ్లు కొనసాగించాలి. జీవిత బీమా పాలసీలకూ నిర్ణీత వ్యవధి ఉంటుంది. తక్కువ వ్యవధి ఉండాలంటే.. ఈఎల్ఎస్ఎస్‌లే ముందు వరుసలో ఉంటాయి. వీటి కనీస వ్యవధి మూడేళ్లే.

పన్ను జమ అవుతోందా?

మీరు చెల్లించిన ఆదాయపు పన్ను శాఖకు జమ అవుతుందా లేదా తెలుసుకునేందుకు ఫారం 26ఏఎస్‌ను పరిశీలించవచ్చు. దీనికోసం ఇన్‌కంట్యాక్స్‌ఇండియా ఈఫైలింగ్ వెబ్‌సైటులో లాగిన్ అయితే సరిపోతుంది. పన్ను జమకు సంబంధించిన వివరాలు ప్రతి మూడు నెలలకోసారి మొబైల్ నెంబరుకు సందేశం వస్తుంటాయి. కాబట్టి, మీ మొబైల్ నెంబరును ఈఫైలింగ్ వెబ్‌సైటులో అప్‌డేట్ చేసుకోండి..

ఇవన్నీ చూసుకోండి..

మీ ఆదాయాన్ని బట్టి, యాజమాన్యం మీకు వర్తించే పన్నును మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) విధిస్తుంది. దీన్ని తప్పించుకోవాలంటే.. మీరు పన్ను ఆదా కోసం పెట్టిన ప్రతి పెట్టుబడినీ యాజమాన్యానికి సమర్పించాల్సి ఉంటుంది.

బీమా: జీవిత బీమా పాలసీలు తీసుకుంటే.. మీరు తీసుకున్న పాలసీకి సంబంధించి చెల్లించిన ప్రీమియం రశీదు నకళ్లు సమర్పించాలి. యులిప్, టర్మ్, ఎండోమెంట్, మనీ బ్యాక్ పాలసీ ఏదైనా దానికి చెల్లించిన ప్రీమియానికి పన్ను ఆదా ఉంటుంది. దీంతోపాటు ఆరోగ్య బీమా పాలసీకి చెల్లించిన ప్రీమియం రశీదునూ ఇవ్వండి.

మ్యూచువల్ ఫండ్లు: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి పన్ను ఆదాకు సరిపోవు. ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్)లో మదుపు చేసినప్పుడే పన్ను ఆదా వర్తిస్తుంది.

ప్రజా భవిష్య నిధి: సాధారణంగా ఈపీఎఫ్‌ను జీతం నుంచే మినహాయిస్తారు. కాబట్టి దీనికి ప్రత్యేకంగా ఆధారం చూపక్కర్లేదు. ప్రజా భవిష్య నిధి, జాతీయ పొదుపు పత్రాలు, కిసాన్ వికాస పత్రాల్లాంటివి ఎంచుకుంటే వాటికి సంబంధించిన రశీదులు సమర్పించాలి.

జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్): రూ.50వేల వరకూ ఇందులో మదుపు చేసి, సెక్షన్ 80సీకి అదనంగా పన్ను మినహాయింపు పొందవచ్చు. దీన్ని ఎంచుకున్నప్పుడు, ఆ చెల్లింపులకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడం మర్చిపోకండి.

పిల్లల ఫీజు: పన్ను అసెసీ గరిష్ఠంగా ఇద్దరు పిల్లలకు చెల్లించిన ట్యూషన్ ఫీజును మినహాయింపు కోసం చూపించుకోవచ్చు.

రుణాలు: గృహరుణానికి చెల్లించిన వడ్డీకి రూ.2,00,000 వరకూ, అసలు సెక్షన్ 80సీ మినహాయింపు పరిమితి మేరకు పన్ను ఆదా కోసం చూపించవచ్చు. మీ బ్యాంకును సంప్రదించి, రుణ చెల్లింపులకు సంబంధించిన ఆధారాలు తీసుకొని, వెంటనే యాజమాన్యానికి ఇవ్వండి.

ఇంటి అద్దె: అద్దె ఇంట్లో ఉన్నప్పుడు ఇంటి అద్దె భత్యానికి (హెచ్ఆర్ఏ) మినహాయింపు చూపించుకోవచ్చు. దానికి సంబంధించిన రశీదును వెంటనే మీ కార్యాలయంలో సమర్పించండి.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. వడ్డీ రేట్లు

స్వల్పకాలమైనా.. దీర్ఘకాలమైనా.. సురక్షితంగా ఉండే పెట్టుబడి పథకాల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లదే అగ్రస్థానం. ఇటీవల బ్యాంకులూ వీటి వడ్డీ రేట్లను సవరించాయి. ఈ నేపథ్యంలో రూ.కోటి లోపు డిపాజిట్లపై వివిధ వ్యవధులకు కొన్ని బ్యాంకులు అందిస్తున్న వడ్డీ రేట్ల వివరాలు మీ కోసం...

బ్యాంకు	వ్యవధి (ఏళ్లలో)			
	ఏడాది లోపు	1-2	2-3	3-5
ఆంధ్రా బ్యాంక్	6.60	6.80	6.75	6.75
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.50	6.85	6.70	6.70
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.70	6.70	6.50
కెనరా బ్యాంక్	6.40	7.10	6.70	6.20
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6.35	6.80	6.50	6.50
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	6.25	6.60	6.75	6.80
ఐడీబీఐ బ్యాంక్	6.50	7.05	7.05	7.20
ఇండియన్ బ్యాంక్	6.50	6.75	6.50	6.00
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.50	6.75	6.75	6.75
పంజాబ్ నేషనల్ బ్యాంక్	6.35	6.85	6.75	6.25
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.40	6.80	6.80	6.85
సిండికేట్ బ్యాంక్	6.35	6.80	6.60	6.60
యూకో బ్యాంక్	6.35	6.60	6.50	6.50
యూనియన్ బ్యాంక్	6.75	6.75	6.70	6.85
విజయా బ్యాంక్	6.60	6.80	6.80	6.80
యాక్సిస్ బ్యాంక్	7.10	7.35	7.50	7.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.10	7.30	7.40	7.25
ఐసీఐసీఐ బ్యాంక్	6.75	7.10	7.50	7.50
ఇండస్‌ఇండ్ బ్యాంక్	7.50	8.00	7.50	7.50
కొటక్ బ్యాంక్	7.00	7.40	7.25	7.10
కరూర్ వైశ్యా బ్యాంక్	6.90	7.25	7.25	7.00
సౌత్ ఇండియన్ బ్యాంక్	6.90	7.60	7.10	7.00
తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్	6.75-7.10	7.00	6.60	6.60
ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్	6.85-7.05	7.05	7.05	7.05
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్	6.90-7.50	7.10-7.50	7.00	6.60
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్	6.50-7.50	8.00	7.00	7.00
తెలంగాణ గ్రామీణ బ్యాంక్	6.60-7.10	7.25	6.60	6.60
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్	6.50-7.25	7.25	7.00	7.00
సప్తగిరి గ్రామీణ బ్యాంక్	6.50-6.75	7.25	7.25	7.25

వడ్డీ రేట్లు శాతాల్లో. జనవరి 12, 2019 నాటికి. (సీనియర్ సిటిజన్లకు 0.25 నుంచి 0.75 శాతం అదనం). ఇవి ఎప్పటికప్పుడు మారవచ్చు. పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పూర్తి వివరాలకు మీ బ్యాంకును సంప్రదించండి. - www.BankBazaar.com

కుటుంబానికి ఇవ్వండి.. ధీమా

తక్కువ ప్రీమియంతో ఎక్కువ రక్షణ కల్పించేది టర్మ్ పాలసీ. ముఖ్యంగా చిన్న వయసులోనే పాలసీ ఎంచుకోవడం వల్ల దీర్ఘకాలంలో ప్రీమియం భారం తగ్గుతుంది. 25-30 ఏళ్ల వారు.. పూర్తిగా రక్షణకే పరిమితం అయ్యే టర్మ్ పాలసీని ఎంచుకునేప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి. అవేమిటో చూద్దామా!



సాధారణంగా 25-30 ఏళ్ల వయసులో ఉన్న వారు జీవిత బీమా పాలసీ గురించి పెద్దగా పట్టించుకోరు. 'నాకేం అవుతుంది? ఇప్పటి నుంచీ బీమా పాలసీ అవసరమా?' ఇలా ఉంటాయి వారి ఆలోచనలు. నేటి యువత అవకాశాల వెంట పరుగులు తీస్తోంది. ఎన్నో ఆశలు, కోరికలు తీర్చుకునేందుకు ఎంతటి కష్టాన్నైనా లెక్క చేయడం లేదు. ఆర్థికంగా స్థిరత్వం సాధించేందుకు సరైన ఆర్థిక ప్రణాళికల విషయంలో మాత్రం కాస్త నిర్లక్ష్య ధోరణే కనిపిస్తూ ఉంటుంది. ముఖ్యంగా తనపై ఆధారపడిన వారు ఉన్నప్పుడు.. వారికి తగిన ఆర్థిక రక్షణ కల్పించడంలో అశ్రద్ధ తగదు.

ప్రపంచవ్యాప్తంగా చూసినా.. 20-30 ఏళ్ల వయసులో ఉన్నవారు జీవిత బీమా పాలసీలు తమ కోసం కాదన్నట్లుగానే ఉంటున్నారు. కానీ, ఇది పొరపాటు. చిన్న వయసులోనే టర్మ్ పాలసీల్లాంటివి తీసుకోవడం వల్ల తక్కువ ప్రీమియంతో గరిష్ఠ రక్షణ లభిస్తుంది. వయసు పెరగడం, ధూమపానంలాంటి అలవాట్లతో ప్రీమియం భారం కావచ్చు. కొన్నిసార్లు ఏదైనా అనుకోని వ్యాధులు వస్తే.. పాలసీ తీసుకోవడం కష్టం కావచ్చు.

బాధ్యతలు పెరిగినా..

ఆదాయం పెరిగినప్పుడు ఖర్చులు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంటాయి. బాధ్యతలూ అధికం అవుతుంటాయి. అందుకే, ఎంత మొత్తానికి బీమా పాలసీ తీసుకోవాలనే విషయంలో ఎప్పటికప్పుడు ఓ సందేహం వస్తూనే ఉంటుంది. సాధారణంగా వార్షికాదాయానికి 10-15 రెట్ల వరకూ జీవిత బీమా ఉండేలా చూసుకోవడం ఎప్పుడూ అవసరం. ఆర్జించే వ్యక్తికి అనుకోనిది జరిగినప్పుడు.. ఆ ఆదాయాన్ని భర్తీ చేసేలా బీమా ఉండాలన్నది గుర్తుంచుకోండి. ఎంత వ్యవధికి పాలసీ తీసుకోవాలన్నదీ ముఖ్యమే. సాధారణంగా పదవీ విరమణ చేసే వరకూ పాలసీ రక్షణ కొనసాగేలా చూసుకోవడం ఎప్పుడూ మంచిది.

అంచనా వేసుకోండి...

టర్మ్ పాలసీని ఎంచుకునే ముందు మీ ప్రస్తుత పరిస్థితులను అంచనా వేసుకోవాలి. ✤ వయసెంత? ✤ విద్యా రుణం, వాహన, గృహరుణాల్లాంటివేమైనా ఉన్నాయా? ✤ కుటుంబం మొత్తం ఆర్థికంగా మీపైనే ఆధారపడి ఉందా? ✤ మీ కుటుంబానికి ఉన్న భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాలేమిటి? ✤ మీ జీవన శైలి ఆధారంగా నెలకు మీకెంత ఖర్చవుతోంది? ఇలాంటి అంశాలన్నింటినీ వివరంగా రాసిపెట్టుకోండి. ఆ తర్వాత ఎంత మొత్తం పాలసీ తీసుకోవాలనే విషయంపై స్పష్టత వస్తుంది.

చెల్లింపు సంగతేమిటి?

ఇప్పుడు చాలా బీమా సంస్థలు పాలసీ పరిహారం చెల్లింపులో రకరకాల పద్ధతులు ప్రవేశపెట్టాయి. పాలసీదారుడికి ఏదైనా జరిగినప్పుడు ఏక మొత్తంలో పరిహారం ఇస్తుంటాయి చాలా పాలసీలు. ఇలాంటి సందర్భాల్లో ఈ డబ్బు దుబారా ఖర్చు అయ్యే ప్రమాదం ఉంది. దీనికన్నా.. కొంత ఏక మొత్తంగా.. తర్వాత నెలనెలా క్రమానుగతంగా చెల్లించే పాలసీలను ఎంచుకోవచ్చు. ఇందులో ఏటా చెల్లింపు మొత్తం కూడా పెరుగుతూ ఉంటుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, అవసరాలను బట్టి, ఏ చెల్లింపు విధానాన్ని ఎంచుకోవాలనే విషయాన్ని నిర్ణయించుకోవాలి.

సరైన సంస్థ నుంచి..

టర్మ్ బీమా పాలసీ తీసుకోవడం ఎంత ముఖ్యమో.. ఆ పాలసీని సరైన బీమా సంస్థ నుంచి తీసుకోవడమూ అంతే ప్రధానం. పాలసీదారుడు లేనప్పుడు.. అతని బాధ్యతను నెరవేర్చాల్సిన బీమా సంస్థ పరిహారం ఇవ్వకుండా ఇబ్బంది పెట్టకూడదు. అందుకే.. పాలసీని ఎంచుకునేప్పుడు.. బీమా సంస్థ పేరు, దాని యాజమాన్యం ఎవరు అనేది పరిశీలించాలి. ఐఆర్‌డీఏ మార్గదర్శకాల మేరకు చెల్లింపులు సరిగ్గానే చేస్తున్నారా తెలుసుకోవాలి. పాలసీదారులకు అందించే సేవలు సంతృప్తిగా ఉన్నాయా చూడాలి. ఆ తర్వాతే ఆ బీమా సంస్థ నుంచి పాలసీ తీసుకోవాలి.

బీమా అవసరాలను టర్మ్ పాలసీ తీరుస్తుంది. అదే సమయంలో కుటుంబ ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చేందుకు సరైన పథకంలో మదుపు చేయడమూ అవసరం అని మర్చిపోకండి.

- **అనిల్‌కుమార్ సింగ్,** సీఐఓ, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్

అప్పు తీర్చడం మేలేనా?

›› మరో మూడేళ్లలో మా అమ్మాయి వివాహం చేయాలనుకుంటున్నాను. అందుకోసం నెలకు రూ.15,000 పెట్టుబడి పెట్టాలని ఆలోచన. కాస్త అధిక రాబడి వచ్చేలా ఎలా మదుపు చేస్తే బాగుంటుంది? - శ్రీనివాస్

అధిక రాబడి రావాలంటే.. నష్టభయం ఉన్న పథకాల్లో మదుపు చేయాల్సి ఉంటుంది. మీకు మూడేళ్ల సమయమే ఉంది కాబట్టి, మీరు పెట్టిన పెట్టుబడికి రక్షణ ఉంటూ.. కాస్త మంచి రాబడిని ఆర్జించేలా ఉండాలి. మీకు ఉన్న అవసరాలకు అనుగుణంగా బ్యాంకులో రికరింగ్ డిపాజిట్ చేసుకోవడమే మార్గం. ఇందులో దాదాపు 7శాతం వరకూ రాబడి వస్తుంది.

›› నేను 18 నెలల క్రితం రూ.3 లక్షల వ్యక్తిగత రుణం తీసుకున్నాను. వడ్డీ 12.5 శాతం. నెలకు రూ.6,800 చెల్లిస్తున్నాను. ఇప్పుడు నా దగ్గర డబ్బులు సర్దుబాటు అయ్యాయి. రుసుములతో కలిపి రూ.2,45,300 చెల్లించాల్సి వస్తోంది. ఈ రుణం తీర్చేయాలా? లేకపోతే అలాగే కొనసాగించాలా? పెట్టుబడి పెడితే లాభం వస్తుందా? - బాలాజీ

వ్యక్తిగత రుణంపై 12.5శాతం వడ్డీ చెల్లిస్తున్నారు కాబట్టి, మీ దగ్గర ఉన్న డబ్బుతో ఈ రుణాన్ని తీర్చేయడమే మంచిది. వేరే పెట్టుబడి పథకాలను ఎంచుకున్నా.. 12.5శాతం కన్నా అధిక రాబడి ఆర్జిస్తామని కచ్చితంగా చెప్పలేం. రుణం తీర్చేయడం వల్ల మీకు వడ్డీ ఆదా అవుతుంది. మీరు ఇప్పుడు చెల్లిస్తున్న ఈఎంఐని పెట్టుబడి పెట్టుకోవడం ఉత్తమం. ఐదేళ్ల వరకూ డబ్బు అవసరం లేదనుకుంటే.. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయండి.



›› మా అమ్మానాన్నలు ఇద్దరూ సీనియర్ సిటిజన్లే. వారికోసం ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలనే ఆలోచనతో ఉన్నాను. సాధారణ బీమా సంస్థలు అందించే పాలసీలతో పోలిస్తే.. బ్యాంకుల ద్వారా తీసుకుంటే తక్కువ ప్రీమియం ఉంటోంది. ఇలా తీసుకోవచ్చా? ఏమైనా చిక్కులు ఉంటాయా? - వెంకట్

మీ అమ్మానాన్నలు సీనియర్ సిటిజన్లు కాబట్టి, వారికి ఏ రకమైన ఆరోగ్య ఇబ్బందులు లేకపోతే.. సాధారణ బీమా సంస్థల నుంచి ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవచ్చు. ఈ పాలసీ తీసుకునే ముందు ఎలాంటి ఉప పరిమితులు, సహ చెల్లింపు (కో పేమెంట్)లాంటివి లేకుండా చూసుకోవాలి. ఈ పాలసీల్లో సాధారణంగా ప్రీమియం కాస్త అధికంగానే ఉంటుంది. బ్యాంకులు అందించే పాలసీలు బృంద బీమా కోవలోకి వస్తాయి. కాబట్టి, ప్రీమియం కొద్దిగా తక్కువే. అయితే, ఉప పరిమితులు, సహ చెల్లింపు నిబంధనలు ఉండే అవకాశం ఉంది. సాధారణ బీమా సంస్థల నుంచి పాలసీ రాని పక్షంలో బ్యాంకుల నుంచి తీసుకునే ప్రయత్నం చేయండి.

›› నా వయసు 52 ఏళ్లు. ప్రైవేటు ఉద్యోగిని. పదవీ విరమణకు ఇంకా 6 ఏళ్ల సమయం ఉంది. నెలకు రూ.25,000ల చొప్పున ఈ ఆరేళ్లూ మదుపు చేయాలనుకుంటున్నాను. పింఛను ఇచ్చే పాలసీల గురించి విన్నాను. వీటిని తీసుకోవచ్చా? ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా? - కరుణాకర్

ఇప్పుడున్న పరిస్థితుల్లో పదవీ విరమణ తర్వాత 20-25 ఏళ్ల వరకూ జీవిస్తామని అంచనా. పదవీ విరమణ తర్వాత కొన్ని ఖర్చులు పెరుగుతాయి. పదవీ విరమణ నాటికి సాధ్యమైనంత ఎక్కువ మొత్తం జమ చేసుకునేందుకు ప్రయత్నించాలి. మీరు పెట్టాలనుకుంటున్న రూ.25,000లలో రూ.10,000 వీపీఎఫ్‌లో మదుపు చేయండి. మిగతా రూ.15,000 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో ఎస్ఐపీ ద్వారా మదుపు చేయండి. మీరు పదవీ విరమణ చేశాక.. మీ దగ్గర సమకూరిన డబ్బుతో అప్పుడున్న పరిస్థితుల ప్రకారం యాన్యుటీ పాలసీని కొనుగోలు చేయొచ్చు. లేదా పెట్టుబడిని మ్యూచువల్ ఫండ్లలో కొనసాగిస్తూ.. క్రమానుగతంగా వెనక్కి తీసుకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చు. పెట్టుబడి కోసం... యాక్సిస్ బ్లూ చిప్ ఫండ్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఈక్విటీ ఫండ్, మిరే అసెట్ ఇండియా ఈక్విటీ ఫండ్లను పరిశీలించవచ్చు.

›› నేను రెండేళ్ల నుంచి నెలకు రూ.6,000 గోల్డ్ ఫండ్లలో మదుపు చేస్తున్నాను. వీటివల్ల పెద్దగా లాభం వచ్చినట్లు అనిపించడం లేదు. పెట్టుబడి ఆపేసి, డబ్బు వెనక్కి తీసుకోవాలని అనుకుంటున్నాను. మరో మూడేళ్ల తర్వాత బంగారం కొనాలంటే.. ఎలాంటి పెట్టుబడిని ఎంచుకోవాలి? - యశోద

గోల్డ్ ఫండ్లు సాధారణంగా బంగారం ధరలను బట్టే పనిచేస్తాయి. గత రెండేళ్లుగా బంగారంలో పెద్దగా లాభాలు రాలేదు. మీకు మూడేళ్ల సమయం ఉంది.. ఒకవేళ మీరు పెట్టే పెట్టుబడితో బంగారం కొనాలని అనుకుంటే.. ఈ గోల్డ్ ఫండ్లలోనే మదుపు కొనసాగించండి. బంగారం కావాలనుకున్నప్పుడు ఈ డబ్బును వెనక్కి తీసుకొని, కొనుగోలు చేయండి.

- **తుమ్మ బాల్‌రాజ్,** సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్



చెట్టు కథ చెబుతుంది

చెట్టుపై కనిపిస్తున్నది క్యూఆర్ కోడ్. దీన్ని ప్రత్యేక చరవాణి యాప్‌తో స్కాన్‌చేస్తే వృక్ష చరిత్ర తెలుస్తుంది. దేశ రాజధానిలోని లోధీ గార్డెన్స్‌లో అన్ని చెట్లనూ దిల్లీ నగర పాలక మండలి (ఎన్‌డీఎంసీ) ఇలాంటి కోడ్‌లతో అనుసంధానిస్తోంది.



స్మార్ట్ సాధువు

అలహాబాద్‌లోని త్రివేణీ సంగమంలో కుంభమేళా కోసం విచ్చేసిన సాధువుల సౌకర్యార్థం ప్రత్యేక గుడారాలు ఏర్పాటుచేశారు. అక్కడ శనివారం ఓ సాధువు ల్యాప్‌టాప్‌పై పనిచేస్తూ ఇలా కనిపించారు.



విన్యాసం ఒంటెబట్టింది

రాజస్థాన్‌లోని బీకానేర్‌లో అంతర్జాతీయ ఒంటెల ఉత్సవం శనివారం మొదలైంది. తొలిరోజు ఓ ఒంటె ఇలా విన్యాసం చేస్తూ అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది.

విపక్షాలది అవినీతి ఆరాటం

- కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన పార్టీలు ఆ పార్టీతోనే కలుస్తున్నాయి
- ఏ అవినీతికీ పాల్పడకపోతే సీబీఐని అడ్డుకోవడమెందుకు?
- భాజపా జాతీయ సమ్మేళనంలో విరుచుకుపడ్డ ప్రధాని మోదీ



దిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో శనివారం రెండో రోజు భాజపా జాతీయ సమ్మేళనానికి హాజరైన నితిన్ గడ్కరీ, మురళీమనోహర్ జోషీ, అరుణ్ జైట్లీ, పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అడ్వాణీ, రాజ్‌నాథ్ సింగ్, సుష్మాస్వరాజ్

దిల్లీ: భాజపాకు వ్యతిరేకంగా ఒక్కటవుతున్న విపక్షాలను లక్ష్యంగా చేసుకుని ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. 'జాతీయ స్థాయిలో ఏర్పాటవుతున్న మహాకూటమి' ఒక విఫల ప్రయత్నమనీ... అవినీతి, ఆశ్రిత పక్షపాతాన్ని పెంచి పోషించే బలహీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే దాని లక్ష్యమని ఆయన మండిపడ్డారు. భాజపా మాత్రం సమగ్రాభివృద్ధి దిశగా సమర్థ పరిపాలనను అందించడంపైనే గురి పెట్టుకుందన్నారు. అయోధ్యలో రామాలయ సమస్యకు పరిష్కారం కనుగొనడం కాంగ్రెస్ పార్టీకి సుతరామూ ఇష్టం లేదనీ, తన న్యాయవాదుల ద్వారా దీన్ని అడ్డుకుంటోందని ఆరోపించారు. శనివారమిక్కడ భాజపా జాతీయ సమ్మేళనం చివరి రోజు సదస్సులో మోదీ ప్రసంగించారు.

"భావసారూప్యతను బట్టి రాజకీయ పార్టీలు కలవడం సాధారణం. కానీ... కాంగ్రెస్‌కూ, దాని సంస్కృతికి విరుద్ధంగా పుట్టిన పార్టీలే ఇప్పుడు ఆ పార్టీతో చేతులు కలుపుతున్నాయి. ప్రధానిని కుర్చీలోంచి దించేయాలన్న ఏకైక లక్ష్యంతోనే అవి కలుస్తున్నాయి! దృఢమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే అవినీతిని అంతం చేయవచ్చని మేం భావిస్తున్నాం. విపక్షాలు మాత్రం 'తమ దుకాణాలు' ఎక్కడ మూతపడిపోతాయోనని భయపడుతున్నాయి. అవినీతికి వంతపాడే బలహీనమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే ఉద్దేశంతో ఒక్కటవుతున్నాయి. తమ సర్కారు వస్తే బంధువులకు మేలు చేసుకోవచ్చన్నది వాటి ఆలోచన. అందుకే వారు 'అందరం కలుద్దాం. అందరం వికసిద్దాం' అని చెప్పుకొంటున్నారు.

సీబీఐని ఎందుకు అడ్డుకుంటున్నారు?

ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు... కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు తమ అనుమతిని ఉపసంహరించుకున్నాయి. ఎందుకు? ఏ అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని భయపడుతున్నారు? నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యూపీఏ సర్కారు సీబీఐని వాడుకుని ఏళ్ల తరబడి వేధింపులకు గురిచేసింది. కానీ... నేనెన్నడూ దర్యాప్తు సంస్థకు అడ్డుపడలేదు.

అవినీతి మచ్చలేని సర్కారు మాది

దేశ చరిత్రలోనే అవినీతి అంటని తొలి సర్కారుగా మా ప్రభుత్వం నిలిచింది. అవినీతికి తావులేకుండా దేశాన్ని నడపవచ్చని భాజపా రుజువు చేసింది. ఎవరి హక్కులకూ భంగం కలుగకుండా... ఆర్థికంగా వెనుకబడిన తరగతుల యువతకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10% రిజర్వేషన్‌ను తీసుకొచ్చాం.

అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేస్తాం

గత ప్రభుత్వాలు రైతులను ఓటు బ్యాంకుగానే చూశాయి. ఎన్నికల్లో లబ్ధి కోసం తాత్కాలిక ఉపశమనాలను మాత్రమే కలిగించాయి. మేం మాత్రం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. దీర్ఘకాలిక విధానాలను, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తున్నాం. 2020 నాటికి అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు రేయింబవళ్లు కృషి సలుపుతున్నాం. ఇప్పటికే ఉత్పత్తి ధరకు 1.5 రెట్లు సమానమైన మద్దతు ధరను అందిస్తున్నాం." అని మోదీ పేర్కొన్నారు.

కుమారస్వామి ఓ గుమాస్తా

మహాకూటమి కర్ణాటకలో తన తొలి సర్కారును ఏర్పాటు చేసింది. అక్కడ ముఖ్యమంత్రి కుమారస్వామిని కాంగ్రెస్ పార్టీ ఓ గుమాస్తాగా వాడుకుంటోంది. ఆయన కూడా తాను ముఖ్యమంత్రినన్న విషయాన్ని మర్చిపోయి, బాధను దిగమింగే పనిలో పడిపోయారు.

10% కోటాకు రాష్ట్రపతి ఆమోదం

103వ రాజ్యాంగ సవరణగా గుర్తింపు

ఈనాడు, దిల్లీ: జనరల్ కేటగిరీలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు ఆమోదించిన బిల్లు చట్టరూపం సంతరించుకొంది. దీనిపై శనివారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేయడంతో చట్టంగా మారింది. 124వ రాజ్యాంగసవరణ బిల్లుగా పార్లమెంటు ఆమోదం పొందిన ఈ అంశం రాష్ట్రపతి ఆమోదముద్రతో 103వ రాజ్యాంగ సవరణ చట్టంగా రూపాంతరం సంతరించుకొంది. రిజర్వేషన్ల కల్పన కోసం రాజ్యాంగంలోని 15, 16 అధికరణాలను సవరించాల్సి వచ్చింది. ఇది ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందన్నదానిపై కేంద్ర సామాజిక న్యాయం, సాధికార మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేయాల్సి ఉంటుంది. చట్టం అమలుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేస్తూ ఆ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుంచి ఇది కార్యరూపంలోకి వస్తుంది. రూ.8లక్షల వరకు వార్షికాదాయం, అయిదు ఎకరాల్లోపు భూమి, వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలోపు ఇల్లు, నోటిఫై చేసిన ప్రాంతాల్లో 100 చదరపు గజాల్లోపు, నోటిఫై చేయని ప్రాంతాల్లో 200 గజాల్లోపు స్థలం ఉన్న కుటుంబాలు మాత్రమే ఈ కోటా ఉపయోగించుకోవడానికి అర్హత పొందాయి. ఆ విధివిధానాలను అధికారికంగా ధ్రువీకరిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది.

మూడు రాష్ట్రాల ఫలితాలతో నిరాశ వద్దు

లోక్‌సభ ఎన్నికలే భాజపాకు ముఖ్యం: అమిత్ షా

దిల్లీ: ఇటీవల 3 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ప్రతికూల ఫలితాలతో పార్టీ కార్యకర్తలెవరూ నిరుత్సాహపడవద్దని భాజపా అధ్యక్షుడు అమిత్ షా కోరారు. "మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మన ప్రత్యర్థులు గెలిచారు తప్ప మనం ఓడిపోలేదు. భాజపా పట్టు కోల్పోలేదు." అంటూ ఉత్సాహం నింపారు. భాజపా జాతీయ సమ్మేళనంలో అమిత్ షా శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై ఆయన ధ్వజమెత్తారు. దేశ రాజకీయాలను 'కులతత్వం, బంధుప్రీతి, బుజ్జగింపులు' అనే మూడు రుగ్మతలు పట్టిపీడిస్తుండటానికి కాంగ్రెస్‌దే బాధ్యత అని విమర్శించారు. యూపీ, బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో కనుమరుగైన కాంగ్రెస్‌కు మాత్రమే ఓటమి అనేది వర్తిస్తుందన్నారు. భాజపాకు లోక్‌సభ ఎన్నికలు చాలా ముఖ్యమని, ఈసారి ఘనవిజయం సాధిస్తే పంచాయతీల నుంచి పార్లమెంటు దాకా సుదీర్ఘకాలం పార్టీ పాలన సాగిస్తుందన్నారు.

ప్రధాని వ్యాఖ్యలు ఆశ్చర్యపరిచాయి

సీఎం కుమారస్వామి

ఈనాడు డిజిటల్, బెంగళూరు: తనను కాంగ్రెస్ చేతిలో గుమస్తాగా ప్రధాని వ్యాఖ్యానించడం ఆశ్చర్యపరిచిందని కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ట్విటర్‌లో స్పందించారు. తాను ఏనాడూ అనని మాటల్ని మోదీ ఎలా ఉటంకిస్తారని నిలదీశారు. మోదీ వ్యాఖ్యలపై మాజీ ప్రధాని దేవెగౌడ కూడా తీవ్రంగా మండిపడ్డారు. గతంలో తాము భాజపాతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామనీ, మూడు నెలల్లోనే విడిపోయామని గుర్తుచేశారు.

ముమ్మారు తలాక్‌ను నిషేధిస్తూ మళ్లీ అత్యవసర ఆదేశం

దిల్లీ: ముమ్మారు తలాక్‌ను నిషేధిస్తూ మరోసారి అత్యవసర ఆదేశం (ఆర్డినెన్స్) జారీ అయింది. దీనిపై శనివారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేశారు. దీనిపై రూపొందించిన బిల్లు ఇంకా పార్లమెంటు ఆమోదం పొందకపోవడంతో గత సెప్టెంబరులో అత్యవసర ఆదేశం జారీ చేశారు. దాని కాలపరిమితి ఈ నెల 22న ముగియనుండడంతో మళ్లీ జారీ చేయాల్సి వచ్చింది. ఈ బిల్లు ప్రస్తుతం రాజ్యసభ పరిశీలనలో ఉంది.

మరో రెండు కూడా...

భారత వైద్య మండలి సవరణ బిల్లు-2018, కంపెనీల సవరణ బిల్లు-2019లపై కూడా రాష్ట్రపతి అత్యవసర ఆదేశాలు జారీ చేశారు.



ముంబయిలో సీఐఐ సదస్సులో గవర్నర్ విద్యాసాగర్ రావు, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు

దీర్ఘకాలిక సంస్థాగత మార్పులతో వ్యవసాయరంగానికి కొత్త బలం

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ముంబయి: దీర్ఘకాలిక సంస్థాగత మార్పుల ద్వారా మన వ్యవసాయ రంగాన్ని మరింత పరిపుష్టం, శక్తిమంతం చేసుకోవాలంటూ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు శనివారం పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని ఆయన భారత మౌలిక సంస్కృతిగా అభివర్ణించారు. అరవైశాతం భారత జనాభా వ్యవసాయం మీద బతుకుతున్నట్లు చెప్పారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి వ్యవసాయ రంగంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరల పతనం, పెట్టుబడి భారం బాగా పెరిగిపోవడంతో ఓ వైపు ఆ రంగం ఎదుర్కొంటున్న ఒడుదొడుకుల నేపథ్యంలో ఉపరాష్ట్రపతి శనివారం చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

పది వేల పెట్రోల్‌పంపుల కేటాయింపునకు బ్రేక్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాజస్థాన్ హైకోర్టు నోటీసులు

జోధ్‌పుర్: రాజస్థాన్‌లో పదివేల పెట్రోల్‌పంపుల కేటాయింపులను చేపట్టవద్దని ఆ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రదీప్ నంద్‌రాజోగ్, జస్టిస్ పి.ఎస్.భాటిలతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఒకేసారి ఇంత భారీ స్థాయిలో పెట్రోల్ పంపుల కేటాయింపుతో అనేక ఇబ్బందులు తలెత్తుతాయని, నిబంధనలను కూడా పాటించలేదని బీర్బల్‌రామ్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు.

పక్కాగా ఓటర్ల జాబితాలు

రాష్ట్రాల సీఈవోలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ దిశానిర్దేశం

ఈనాడు, దిల్లీ: సార్వత్రిక ఎన్నికలకు ఓటర్ల జాబితాలు పక్కాగా ఉండేలా చర్యలు చేపట్టాలని, సవరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోడా రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారుల(సీఈవోల)కు దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్రాల అధికారులతో నిర్వహించిన రెండు రోజుల సదస్సు శనివారం ముగిసింది. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల నిర్వహణకు సూక్ష్మస్థాయిలో ఏర్పాట్లు, ఈవీఎంలు వీవీప్యాట్‌ల మదింపు తదితర అంశాలు అజెండాగా సదస్సు సాగింది.

ఆయుష్మాన్ భారత్‌కు డబ్ల్యుఐపీవో కితాబు

దిల్లీ: భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకానికి 'ప్రపంచ మేధో సంపద సంస్థ' (డబ్ల్యుఐపీవో) డైరెక్టరు జనరల్ ఫ్రాన్సిస్ గర్రీ ప్రశంసలు లభించాయి. ఆయన ఈ పథకాన్ని బహుదా శ్లాఘించారు. 'డబ్ల్యుఐపీవో డైరెక్టరు జనరల్ ఫ్రాన్సిస్ ఇక్కడి ఆయుష్మాన్ భారత్ సీఈవోను కలుసుకున్నారు. వేలాది మందికి ఉచితంగా వైద్యసేవలను అందించే ఈ పథకం ఎంతో ప్రశంసనీయమైనదని ఆయన పేర్కొన్నారు' అంటూ డబ్ల్యుఐపీవో శనివారం ట్వీట్ చేసింది.

ఆలోక్ బదిలీ చాలా చాలా తొందరపాటు

- సీవీసీ దర్యాప్తును పర్యవేక్షించిన మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.పట్నాయక్ వ్యాఖ్య

దిల్లీ: సీబీఐ మాజీ డైరెక్టర్ ఆలోక్ వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.పట్నాయక్ వ్యాఖ్యానించారు. ఆయనను బదిలీ చేయాలన్న అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయం 'చాలా చాలా తొందరపాటు నిర్ణయం' అని పేర్కొన్నారు. వర్మపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) చేపట్టిన దర్యాప్తును సుప్రీం కోర్టు సూచనల మేరకు జస్టిస్ పట్నాయక్ పర్యవేక్షించిన సంగతి తెలిసిందే. ఆయనపై సీవీసీ ఇచ్చిన నివేదికలోని అంశాలేవీ తన అభిప్రాయాలు కావని పట్నాయక్ స్పష్టం చేశారు. వర్మపై జరిగిన విచారణ మొత్తం సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ అస్థానా ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సాగిందన్నారు. సీవీసీ తనకు పంపిన దర్యాప్తు నివేదికపై అస్థానా సంతకం ఉందని, అయితే ఆయన వ్యక్తిగతంగా సీవీసీ ఎదుట హాజరై వాంగ్మూలం ఇవ్వలేదని చెప్పారు. వర్మను బదిలీ చేయాలని ప్రధాని, విపక్ష నేత, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయించడం, దీనికి అంగీకరించని వర్మ పదవీ విరమణకు సిద్ధపడటం తెలిసిందే. జస్టిస్ పట్నాయక్ తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ఈ కమిటీ మరోసారి సమావేశమై, వర్మను తిరిగి సీబీఐ డైరెక్టర్‌గా నియమించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ డిమాండ్ చేశారు. సీవీసీని దుర్వినియోగం చేయడం ద్వారా సీబీఐ డైరెక్టర్‌ను ప్రభుత్వం తప్పించిందని ఆరోపించారు. "అవినీతి కేసులో దర్యాప్తును ఎదుర్కొంటున్న అస్థానా చేసిన ఆరోపణల ఆధారంగా వర్మను బదిలీ చేయడం విడ్డూరంగా ఉంది" అని పేర్కొన్నారు.

తొందరపాటు చర్యే: శివసేన

ముంబయి: సీబీఐ డైరెక్టర్‌గా ఆలోక్‌వర్మ తొలగింపును "తొందరపాటు చర్య"గా భాజపా మిత్రపక్షం శివసేన అభివర్ణించింది. ఆయనకు కనీసం తన వాదన వినిపించే అవకాశం కూడా ఇవ్వలేదని, కేంద్రప్రభుత్వం తప్పుడు సంప్రదాయాన్ని నెలకొల్పిందని విమర్శించింది. ఆలోక్‌వర్మ తొలగింపు, ఆపై కేంద్ర అగ్నిమాపక శాఖ-హోంగార్డుల డైరెక్టర్ జనరల్‌గా బదిలీకి ప్రధాని మోదీయే కారణమని తన అధికారిక పత్రిక "సామ్నా"లో రాసిన సంపాదకీయంలో విమర్శలు గుప్పించింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జనవరి 8న సీబీఐ డైరెక్టర్‌గా పునఃనియామకమైన ఆలోక్‌వర్మను ప్రధాని మోదీ నేతృత్వంలోని కమిటీ తొలగించి, అగ్నిమాపకశాఖ డీజీగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

చోరీపై ఫిర్యాదు చేశాడని వృద్ధుడిని కొట్టిచంపారు

మహారాష్ట్రలో దారుణం

పాల్‌ఘర్: చోరీకి పాల్పడినట్లు తమపై పోలీసులకు ఫిర్యాదు చేశాడన్న కోపంతో మహారాష్ట్రలో 9 మంది మూకగా వెళ్లి ఓ వృద్ధుడిని గొంతు నులిమి, తీవ్రంగా కొట్టిచంపారు. పాల్‌ఘర్ జిల్లా వసయీకి చెందిన రామ్‌చంద్ర రౌత్ (70)పై శుక్రవారం సాయంత్రం నిందితులు దాడికి పాల్పడ్డారు. అతన్ని ఆసుపత్రికి తరలించేటప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఇంతవరకు 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తన పావురాలను కొందరు దొంగిలించినట్లు రౌత్ శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులు అతని ఇంటికి వెళ్లి ఎందుకు ఫిర్యాదు చేశావని నిలదీస్తూ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో హిందూ మహిళ

పోటీకి దిగాలని తులసి గ్యాబర్డ్ నిర్ణయం



వాషింగ్టన్: అమెరికా తదుపరి అధ్యక్ష ఎన్నికల బరిలో నిలవాలని నిర్ణయించుకున్నట్లు డెమోక్రటిక్ నేత, కాంగ్రెస్‌లోని హిందూ సభ్యురాలు తులసి గ్యాబర్డ్ వెల్లడించారు. వారంలోగా ఈ విషయంపై అధికారిక ప్రకటన చేస్తానని ఆమె వివరించారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. తాను మరోసారి బరిలోకి దిగుతానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. ఆయన్ను ఢీకొట్టేందుకు డెమోక్రటిక్ నేతలు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. ఆ పార్టీ ప్రాతినిధ్యం కోసం 12 మంది దాకా నేతలు పోటీలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జాబితాలో భారత సంతతి సెనేటర్ కమలా హ్యారిస్ పేరు కూడా ఉంది. హవాయి నుంచి ఇప్పటివరకూ తులసి నాలుగు సార్లు అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. 2012లో కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి హిందువుగా ఆమె ఘనత సాధించారు. అమెరికా సైన్యంలో పనిచేసిన అనుభవమూ తులసికి ఉంది. ఇరాక్ యుద్ధంలో ఆమె పాల్గొన్నారు. అమెరికాలోనే పుట్టిపెరిగిన తులసి యుక్త వయసులో ఉండగా హిందూ మతాన్ని స్వీకరించారు.

పారిస్‌లోని బేకరీలో పేలుడు

పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ఓ బేకరీలో గ్యాస్ లీకేజీ కారణంగా శక్తిమంతమైన పేలుడు సంభవించింది. శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరో 47 మంది క్షతగాత్రులయ్యారు. వారిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. గ్యాస్ లీకేజీని అగ్నిమాపక సిబ్బంది ఆపేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పేలుడు చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన భవనంలో బేకరీతోపాటు రెస్టారెంట్, కొన్ని నివాసాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

'అత్యయిక' యోచన లేదు: ట్రంప్

- 22వ రోజుకు చేరిన యూఎస్ ప్రతిష్టంభన

వాషింగ్టన్: అమెరికా-మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి సంబంధించి నిధుల కోసం జాతీయ అత్యయిక పరిస్థితిని ప్రకటించే అంశాన్ని ఇంతవరకు పరిశీలించలేదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. రౌండ్ టేబుల్ చర్చల్లో ఆయన శుక్రవారం ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అత్యయిక పరిస్థితి విధించడం లాంటి అంశంతో ముందుకెళ్లేందుకు వీలున్నప్పటికీ ఇంతవరకు దాన్ని ఎంచుకోవాలని అనుకోవడం లేదన్నారు. నిధుల విషయమై ఓటింగ్ ద్వారా నిర్ణయించేందుకు శాసనకర్తలు ముందుకు రావడాన్నే తాను అభిలషిస్తున్నట్లు తెలిపారు.

అమెరికా చరిత్రలో తొలిసారిగా..

సరిహద్దు గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్న ట్రంప్ డిమాండ్‌ను డెమోక్రాట్లు తిరస్కరించిన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం పాక్షికంగా మూతపడిన వ్యవహారం శనివారం రికార్డు స్థాయిలో 22వ రోజుకు చేరింది. అమెరికా చరిత్రలో ఇంత సుదీర్ఘకాలం ఇలాంటి ప్రతిష్టంభన నెలకొనడం ఇదే తొలిసారి. 1995-96లో బిల్‌క్లింటన్ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో 21 రోజుల పాటు ప్రభుత్వం పాక్షికంగా మూతపడింది. ఇప్పటికీ ఈ విషయంలో ఎవరి తరఫు నుంచీ రాజీ అనేది కనిపించడం లేదు.

భారత్‌లో అసహనం, ఆగ్రహం

- పాలకుల మనస్తత్వమే ఇందుకు కారణం
- యూఏఈలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



దుబాయ్: భారత్ గత నాలుగున్నరేళ్లలో తీవ్ర స్థాయిలో అసహనాన్ని, ఆగ్రహాన్ని చవిచూసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం అధికారంలో ఉన్నవారి మనస్తత్వమే ఇందుకు కారణమని విమర్శించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పర్యటనలో ఉన్న ఆయన శనివారం ఐఎంటీ దుబాయ్ వర్సిటీ విద్యార్థులతో ముచ్చటించారు. భారత్ బహుళ సిద్ధాంతాలను ఇమడ్చుకోగలదని చెప్పారు. ఒకే సిద్ధాంతాన్ని ప్రజల నెత్తిన రుద్దే పరిస్థితి ఉండదన్నారు. "భారత్‌కు అనేక సిద్ధాంతాలు తరలివచ్చాయి. వాటిని భారత్ తీర్చిదిద్దింది. అవి కూడా ఈ దేశాన్ని తీర్చిదిద్దాయి. ఇతరుల అభిప్రాయాలను ఆలకించడమూ భారత సిద్ధాంతాల్లో భాగమే. సహనమనేది భారత సంస్కృతిలో భాగం. గత నాలుగున్నరేళ్లలో దేశంలో జరుగుతున్న పరిణామాలు ఆవేదన కలిగిస్తున్నాయి. వివిధ వర్గాల నడుమ ఎంతో అసహనం, ఆగ్రహం, విభజనను చూశాం. నాయకత్వ తీరులో సహనం ఉంటే అదే సందేశం వ్యాప్తి చెందుతుంది. సాధారణంగా భారత్‌లో సహనశీలత ఎక్కువ. ఇతరుల అభిప్రాయాలకు గౌరవం ఉంటుంది. మళ్లీ అలాంటి వాతావరణం రావాలి" అని పేర్కొన్నారు.

పాత్రికేయులను కాల్చిచంపే, అభిప్రాయాలను వ్యక్తంచేసినందుకు అవతలివారిపై దాడులు చేసే తరహా భారత్‌ను తాను కోరుకోవడంలేదని రాహుల్ పేర్కొన్నారు. "దీన్ని మార్చాలనుకుంటున్నాం. రానున్న ఎన్నికల్లో అదే సవాల్" అని పేర్కొన్నారు. దేశంలో ఆకలి కేకలు వంటి పెద్ద సవాళ్లు ఉన్న నేపథ్యంలో క్రీడలకు అధిక ప్రాధాన్యమివ్వడం కష్టమవుతుందన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక పరివర్తన అవసరమని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యవసాయ వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సంధానం కాలేదన్నారు. చిన్న, మధ్య తరహా వ్యాపారాలు పెద్ద కంపెనీలుగా ఎదిగేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చేలా దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో పరివర్తన అవసరమని చెప్పారు. ఆరోగ్య పరిరక్షణ విషయంలో భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయన్నారు.

కేజ్రీవాల్ కుమార్తెను అపహరిస్తామని ఇ-మెయిల్

దిల్లీ: ఆప్ అధ్యక్షుడు, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కుమార్తెను అపహరిస్తామని బెదిరింపు ఇ-మెయిల్ వచ్చిందని అధికారులు శనివారం వెల్లడించారు. జనవరి 9న ముఖ్యమంత్రి కార్యాలయానికి వచ్చిన ఈ ఇ-మెయిల్ గురించి దిల్లీ పోలీస్ కమిషనరు అమూల్య పట్నాయక్‌కు సమాచారమిచ్చామన్నారు. స్పందించిన పట్నాయక్.. కేజ్రీవాల్ కుమార్తె రక్షణకు ప్రత్యేకంగా ఓ పోలీసు అధికారిని నియమించారని, ఇ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకోవాలని 'సైబర్ సెల్' పోలీసులను ఆదేశించారన్నారు.

'అసోం ఒప్పందం'పై సిఫార్సుల కమిటీకి బాలారిష్టాలు

గువాహటి, దిల్లీ: అసోం ఒప్పందంలోని ఆరో నిబంధనపై సిఫార్సులు చేయడానికి కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీకి ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. కమిటీ అధ్యక్షుడిగా కేంద్రప్రభుత్వం నియమించిన ఎం.పి.బెజ్‌బారువా శనివారం బాధ్యతలు స్వీకరించడానికి నిరాకరించారు. దీంతో తొమ్మిది మంది సభ్యులతో కూడిన కమిటీలో ఐదుగురు ఇప్పటివరకు వైదొలగినట్లైంది. కేంద్రంతో అసోం గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు జనవరి 6న కేంద్రం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఒప్పందంలోని ఆరో నిబంధన ప్రకారం అస్సామీలకు అసోం అసెంబ్లీ, స్థానిక సంస్థల్లో ఎంతమేరకు ప్రాతినిధ్యం కల్పించాలో ఈ కమిటీ సిఫార్సులు చేయాల్సి ఉంది. "అస్సామీ ప్రజల నాగరికత, సామాజిక, భాష, సాంస్కృతిక పరిరక్షణకు తీసుకోవాల్సిన రాజ్యాంగపరమైన, శాసనపరమైన, కార్యనిర్వాహక అంశాలపై కమిటీని ఏర్పాటు చేశారు. ఇటీవల పౌరసత్వ సవరణ బిల్లుకు ఆమోదం లభించడంతో కమిటీ నుంచి అసోంకు చెందిన నలుగురు సభ్యులు తప్పుకున్నారు. ఎవరికోసం కమిటీ వేశారో వారి ప్రతినిధులే లేనప్పుడు, నేను అధ్యక్షుడిగా పని చేయడానికి తగిన వాతావరణం లేదని భావిస్తున్నాను" అని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు రాసిన లేఖలో బెజ్‌బారువా పేర్కొన్నారు. ఈయన గతంలో కేంద్ర పర్యాటకశాఖ కార్యదర్శిగా పనిచేశారు.

ఛాంపియన్స్



సింధు గెలిచినా.. హైదరాబాద్ ఔట్

పీబీఎల్ ఫైనల్లో ముంబయి

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ నాలుగో సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ హైదరాబాద్ హంటర్స్ కథ ముగిసింది. కెప్టెన్ సింధు గెలిచినా జట్టుకు ఓటమి తప్పలేదు. శనివారం జరిగిన సెమీస్‌లో హంటర్స్ 2-4 తేడాతో ముంబయి రాకెట్స్ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో బోడిన్- కిమ్ జోడీ 14-15, 12-15తో జంగ్- లీ యాంగ్ జంట చేతిలో ఓడడంతో హంటర్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ముంబయి రాకెట్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ 15-8, 15-7తో మార్క్‌పై గెలవడంతో ముంబయి 3-0తో ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత హంటర్స్ ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న మహిళల సింగిల్స్‌లో సింధు 15-6, 15-5తో శ్రేయాన్సిపై గెలిచి ఆధిక్యాన్ని 2-3కు తగ్గించింది. అయితే రెండో పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో లీ హ్యాన్ 13-15, 6-15తో అండర్స్ చేతిలో ఓడడంతో హంటర్స్‌కు ఓటమి తప్పలేదు. ఆదివారం జరిగే ఫైనల్లో బెంగళూరు రాప్టర్స్‌తో ముంబయి రాకెట్స్ టైటిల్ కోసం తలపడనుంది.

నేడే ఫైనల్
బెంగళూరు × ముంబయి
రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌- 1లో



రఫా వస్తున్నాడు కొత్త సర్వీసుతో!

మెల్‌బోర్న్: కెరీర్‌ను పొడిగించుకునే లక్ష్యంతో ఉన్న స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ తొలిసారి సర్వీసును కొత్తగా ప్రయత్నిస్తున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన సర్వీసు భిన్నంగా ఉండబోతోందని నాదల్ వెల్లడించాడు. గత సెప్టెంబర్ తర్వాత తొలిసారి బరిలో దిగుతున్న రఫా.. జేమ్స్ డక్‌వర్త్‌తో తొలి రౌండ్ ఆడనున్నాడు. "ఒక్కోసారి కొన్ని విషయాలను మెరుగుపరుచుకోవాల్సి ఉంటుంది. నా కెరీర్‌లో ఇలా చాలా అంశాల్లో మార్పులు చేసుకున్నా. కొత్త సర్వీస్ కూడా అలాంటిదే. ఇప్పటివరకు ఈ సర్వీసుతో ఆడలేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్లో అది ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం" అని నాదల్ అన్నాడు. "నాదల్ సర్వీసులో వేగాన్ని పెంచి దూకుడుగా ఉండేలా చేశాం. ఇప్పటివరకు రఫా సర్వీస్ యాక్షన్ కాస్త నెమ్మదిగా ఉంది. బంతి రాకెట్‌కు తగిలేలోపే శక్తి తగ్గిపోతుంది. ఈ ఇబ్బందిని అధిగమించడానికే మార్పులు చేశాం" అని నాదల్ కోచ్ కార్లోస్ మోయా అన్నాడు.



పసిడితో మెరిసిన కార్తీక్

ఖేలో ఇండియా యూత్ క్రీడలు

పుణె: ఖేలో ఇండియా యూత్ క్రీడల్లో తెలంగాణ వెయిట్‌లిఫ్టర్ కార్తీక్ సత్తాచాటాడు. శనివారం జరిగిన అండర్-17 బాలుర వెయిట్‌లిఫ్టింగ్ (89 కేజీలు)లో పసిడి సాధించాడు. హాకీంపేటలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన కార్తీక్ మొత్తం 258 కేజీల (స్నాచ్‌లో 112 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 146 కేజీలు) బరువు ఎత్తి అగ్రస్థానంలో నిలిచాడు.

టెస్టు సిరీస్‌లో చారిత్రక విజయంతో ఫేవరెట్‌గా వన్డే సిరీస్‌లోకి అడుగుపెట్టిన టీమ్ ఇండియా.. తొలి మ్యాచ్‌లో బోల్తా కొట్టింది. మంచి అవకాశాల్ని ఉపయోగించుకోలేక మ్యాచ్‌ను కంగారూలకు సమర్పించుకుంది. బౌలర్లు ప్రత్యర్థిని కట్టడి చేసినట్లే చేసి పట్టువిడిస్తే.. ఛేదనను పేలవంగా ఆరంభించిన భారత్‌ను రోహిత్ శర్మ (133; 129 బంతుల్లో 10×4, 6×6) అద్భుత పోరాటంతో పోటీలో నిలబెట్టినా, సహచరుల నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందలేదు. కష్ట కాలంలో మహేంద్రసింగ్ ధోని (51; 96 బంతుల్లో 3×4, 1×6) సంయమనం ఇన్నింగ్స్‌కు స్థిరత్వం తెచ్చింది కానీ.. బంతుల వృథాతో చేసిన నష్టాన్ని పూడ్చకుండానే అతను వెనుదిరిగాడు. జే రిచర్డ్ సన్ (4/26) సంచలన బౌలింగ్‌తో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.



జే రిచర్డ్‌సన్
(4/26)

ఒక్కడు పోరాడాడు



రోహిత్ శర్మ
133

● రోహిత్ అద్భుత శతకం ● అయినా భారత్‌కు తప్పని ఓటమి
● రిచర్డ్‌సన్ విజృంభణ.. మెరిసిన హాండ్స్‌కాంబ్ ● తొలి వన్డే ఆసీస్‌దే

సిడ్నీ

టీ20 సిరీస్ సమం.. టెస్టు సిరీస్ మనదే.. ఈ ఊపులో వన్డే సిరీస్ కూడా గెలిచి ఆస్ట్రేలియా పర్యటనను ఘనంగా ముగించాలని ఆశించిన టీమ్‌ఇండియాకు.. సిరీస్ ఆరంభ పోరులో ఎదురు దెబ్బ తగిలింది. శనివారం తొలి వన్డేలో భారత్ 34 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. మొదట ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. ఆరంభంలో తడబడ్డ ఆసీస్‌ను ఖవాజా (59; 81 బంతుల్లో 6×4), షాన్ మార్ష్ (54; 70 బంతుల్లో 4×4) ఆదుకోగా.. హాండ్స్‌కాంబ్ (73; 61 బంతుల్లో 6×4), స్టాయినిస్ (47 నాటౌట్; 43 బంతుల్లో 2×4, 2×6) మెరుపులతో ఆతిథ్య జట్టు మెరుగైన స్కోరు సాధించింది. అనంతరం 4 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ భారత్‌ను ధోనితో కలిసి రోహిత్ రక్షించే ప్రయత్నం చేశాడు. ధోని వెనుదిరిగాక కూడా పోరాటాన్ని కొనసాగించి భారత్‌ను గెలిపించేందుకు విశ్వ ప్రయత్నం చేశాడు. కానీ చివర్లో అతను వెనుదిరగడంతో టీమ్‌ఇండియా అవకాశాలకు తెరపడింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' జే రిచర్డ్‌సన్‌తో పాటు బెరెన్‌డార్ఫ్ (2/39) కూడా భారత్‌ను దెబ్బ తీశాడు. రెండో వన్డే మంగళవారం అడిలైడ్‌లో జరుగుతుంది.

ధావన్ 0.. కోహ్లి 3.. రాయుడు 0: 289.. భారత బ్యాటింగ్ బలం ప్రకారం ఇదేమీ అంత కష్టమైన లక్ష్యమేమీ కాదు. పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో భారత్ సులువుగానే ఈ లక్ష్యాన్ని ఛేదిస్తుందనుకున్నారంతా. కానీ అది అసాధ్యమైన లక్ష్యంగా మారిపోవడానికి ఎంతో సమయం పట్టలేదు. 3/4.. 4 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు ఇది. బెరెన్‌డార్ఫ్ వేసిన తొలి ఓవర్ చివరి బంతికి ధావన్ (0) వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోగా.. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో జే రిచర్డ్‌సన్ భారత్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. మూడు బంతుల వ్యవధిలో కోహ్లి (3), రాయుడు (0)లను ఔట్ చేశాడు. లెగ్ ఫ్లిక్ ఆడబోయి విరాట్.. ఫార్వర్డ్ స్క్వేర్‌లో స్టాయినిస్‌కు దొరికిపోయాడు. ఈ షాక్ నుంచి తేరుకునే లోపే రాయుడిని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు రిచర్డ్‌సన్. రాయుడు సమీక్ష కోరినా ఫలితం లేకపోయింది. నాలుగో ఓవర్లోనే ధోని క్రీజులోకి వచ్చేశాడు. అప్పటికి 12 బంతులాడిన రోహిత్ ఖాతా తెరవలేదు. ఘోర పరాజయం తప్పదనిపిస్తున్న దశలో ధోని అండతో రోహిత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. పరిస్థితి చాలా కఠినంగా ఉండటంతో ధోని.. మరీ జిడ్డుగా ఆడాడు. అతను తొలి 37 బంతుల్లో చేసింది 6 పరుగులే. సిక్సర్‌తో రెండంకెల స్కోరుకు చేరిన ధోని.. తర్వాత అడపా దడపా షాట్లు ఆడాడు. రోహిత్ మాత్రం కుదురుకున్నాక రెచ్చిపోయాడు. మైదానం నలువైపులా అందమైన షాట్లతో అలరించాడు. 62 బంతుల్లో అతడి అర్ధశతకం పూర్తయింది. లైయన్ బౌలింగ్‌లో అతను బాదిన ఓ సిక్సర్.. ఆస్ట్రేలియా డ్రెసింగ్ రూం దగ్గర పడటం విశేషం.



కోహ్లి
3

ఆసీస్ ఐదే ఎక్కువ..: 30 ఓవర్లకు స్కోరు 133/3. ఆస్ట్రేలియా అన్నే ఓవర్లకు ఇంకో ఐదు పరుగులే ఎక్కువ చేసింది. రోహిత్, ధోని కుదురుకోవడంతో భారత్‌కు మంచి అవకాశాలే ఉన్నాయనిపించింది. 93 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన ధోని.. వేగం పెంచేలా కనిపించాడు. కానీ దురదృష్టం అతడిని వెంటాడింది. బెరెన్‌డార్ఫ్ అతడిని ఎల్బీగా ఔట్ చేశాడు. సమీక్ష కోరితే ధోని నాటౌట్‌గా తేలేవాడు కానీ.. భారత్‌కు రివ్యూ లేదు. దీంతో 137 పరుగుల వద్ద భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత మరో ఎండ్ నుంచి రోహిత్‌కు సహకారం కరవైంది. అతను ఒత్తిడిలో పడి కొన్ని ఓవర్ల పాటు షాట్లు ఆడలేదు. సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోయింది. మరోవైపు కార్తీక్ (12), జడేజా (8) పేలవ షాట్లు ఆడి వెనుదిరిగారు. భారమంతా రోహిత్ మీదే పడింది. అయినా అతను మెరుపు షాట్లతో భారత్‌ను లక్ష్యం వైపు నడిపించే ప్రయత్నం చేశాడు. 110 బంతుల్లో శతకం పూర్తి చేసిన రోహిత్.. తర్వాత జోరు మరింత పెంచాడు. ఐతే 26 బంతుల్లో 68 పరుగులు చేయాల్సిన స్థితిలో స్టాయినిస్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన రోహిత్.. మ్యాక్స్‌వెల్‌కు దొరికిపోవడంతో భారత్ పరాజయం ఖరారైంది. భువనేశ్వర్ (29) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించింది.

ఆ మెరుపులే తేడా..: అంతకు ముందు ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో చాలా వరకు భారత బౌలర్లదే ఆధిపత్యం. భువనేశ్వర్ (2/66), కుల్‌దీప్ (2/54), జడేజా (1/48), షమి (0/46) కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆసీస్ బ్యాట్స్‌మెన్ ఒత్తిడి ఎదుర్కొన్నారు. ఫించ్ (6) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. కేరీ (24) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ఖవాజా, షాన్ మార్ష్ నిలకడగానే ఆడినా.. స్కోరు మాత్రం నియంత్రణలోనే ఉంది. కీలక సమయంలో వీరు ఔటవడంతో ఆసీస్ కష్టాల్లో పడింది. క్రీజులో కుదురుకున్న హాండ్స్‌కాంబ్, హిట్టర్ అయిన స్టాయినిస్ ఉన్నప్పటికీ 37-43 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా నమోదవలేదు. కానీ చివర్లో కథ మారిపోయింది. హాండ్స్‌కాంబ్, స్టాయినిస్ భారీ షాట్లు ఆడటంతో చివరి 7 ఓవర్లలో ఏకంగా 80 పరుగులొచ్చాయి. ఈ మెరుపులే ఫలితాన్ని మార్చాయి.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: కేరీ (సి) రోహిత్ (బి) కుల్‌దీప్ 24; ఫించ్ (బి) భువనేశ్వర్ 6; ఖవాజా ఎల్బీ (బి) జడేజా 59; షాన్ మార్ష్ (సి) షమి (బి) కుల్‌దీప్ 54; హాండ్స్‌కాంబ్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 73; స్టాయినిస్ నాటౌట్ 47; మ్యాక్స్‌వెల్ నాటౌట్ 11; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (50 ఓవర్లలో 5 వికెట్లకు) **288**; **వికెట్ల పతనం:** 1-8, 2-41, 3-133, 4-186, 5-254; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-0-66-2; ఖలీల్ అహ్మద్ 8-0-55-0; షమి 10-0-46-0; కుల్‌దీప్ యాదవ్ 10-0-54-2; జడేజా 10-0-48-1; రాయుడు 2-0-13-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టాయినిస్ 133; ధావన్ ఎల్బీ (బి) బెరెన్‌డార్ఫ్ 0; కోహ్లి (సి) స్టాయినిస్ (బి) రిచర్డ్‌సన్ 3; రాయుడు ఎల్బీ (బి) రిచర్డ్‌సన్ 0; ధోని ఎల్బీ (బి) బెరెన్‌డార్ఫ్ 51; కార్తీక్ (బి) రిచర్డ్‌సన్ 12; జడేజా (సి) షాన్ మార్ష్ (బి) రిచర్డ్‌సన్ 8; భువనేశ్వర్ నాటౌట్ 29; కుల్‌దీప్ (సి) ఖవాజా (బి) సిడిల్ 3; షమి (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టాయినిస్ 1; ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (50 ఓవర్లలో 9 వికెట్లకు) **254**; **వికెట్ల పతనం:** 1-1, 2-4, 3-4, 4-141, 5-176, 6-213, 7-221, 8-247, 9-254; **బౌలింగ్:** బెరెన్‌డార్ఫ్ 10-2-39-2; రిచర్డ్‌సన్ 10-2-26-4; సిడిల్ 8-0-48-1; లైయన్ 10-1-50-0; స్టాయినిస్ 10-0-66-2; మ్యాక్స్‌వెల్ 2-0-18-0





వాళ్ల స్థానాల్లో మయాంక్, శంకర్!

దిల్లీ: టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య స్థానాలను మయాంక్ అగర్వాల్, విజయ్ శంకర్ భర్తీ చేసే అవకాశం ఉంది. ఆస్ట్రేలియాతో రెండో వన్డే మంగళవారం అడిలైడ్‌లో జరగనుంది. అప్పటిలోగా వీరిద్దరూ వన్డే జట్టుతో కలిసే అవకాశం ఉందని సమాచారం. ఆస్ట్రేలియాతో అరంగేట్ర టెస్టులో మంచి ప్రదర్శన చేసిన మయాంక్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. మరోవైపు భారత్-ఎ తరఫున విజయ్ శంకర్ న్యూజిలాండ్ పర్యటనలో అద్భుతంగా రాణించాడు. విజయ్ ఇప్పటికే టీ20ల్లో భారత్ తరఫున అరంగేట్రం చేశాడు.

వేగంగా విచారణ.. వద్దువద్దు!: ఓ టీవీ కార్యక్రమంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన పాండ్య, రాహుల్‌లపై విచారణ త్వరగా ముగించాలని పాలకుల కమిటీ (సీఓఏ) ఛైర్మన్ వినోద్ రాయ్ భావిస్తోండగా.. సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ అందుకు భిన్నమైన వ్యాఖ్యలు చేసింది. విచారణ కోసం పాండ్య, రాహుల్‌లను స్వదేశానికి రప్పించడంతో ఆస్ట్రేలియాలో భారత వన్డే జట్టు సభ్యుల సంఖ్య 15 నుంచి 13కు చేరిన సంగతి తెలిసిందే. "రెండో వన్డే సమయానికి విచారణ పూర్తిచేయాలి. ఒక ఆటగాడి ప్రవర్తన కారణంగా సిరీస్‌లో జట్టు బలాన్ని దెబ్బతీయడం సరికాదు" అని ఎడుల్జీకి పంపిన ఈమెయిల్‌లో రాయ్ పేర్కొన్నాడు. "విచారణ విషయంలో తొందరేం వద్దు. అలా చేయడం వల్ల వ్యవహారాన్ని కప్పిపుచ్చినట్లవుతుంది" అన్నది ఎడుల్జీ వాదన.

ధోని నాలుగో స్థానంలో రావాలి

సిడ్నీ: వన్డేల్లో నాలుగో స్థానానికి ధోనీనే సరిపోతాడని భారత వైస్‌కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. కొంత కాలంగా ఈ స్థానంలో అంబటి రాయుడు ఆడుతుండటం, అతడికి కోహ్లి మద్దతుగా నిలుస్తున్న నేపథ్యంలో రోహిత్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి "ధోని నాలుగో స్థానంలో రావడం జట్టుకు మేలు చేస్తుందని నా వ్యక్తిగత అభిప్రాయం. కానీ ఆ స్థానంలో రాణిస్తున్న రాయుడు ఉన్నాడు. అయితే జట్టు కూర్పు విషయంలో తుది నిర్ణయం మాత్రం కెప్టెన్, కోచ్‌లదే. ధోని నాలుగో స్థానంలో వస్తే నాకైతే సంతోషమే" అని రోహిత్ తెలిపాడు. తొలి వన్డే ధోని మరీ నెమ్మదిగా ఆడాడన్న విమర్శలపై అతను స్పందిస్తూ.. "ధోని తన కెరీర్లో దాదాపు 90 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. తొలి వన్డేలో అతను బ్యాటింగ్‌కు వచ్చేటప్పటికే టీమ్‌ఇండియా మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. పైగా ఆస్ట్రేలియా బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేస్తున్నారు. అలాంటి సందర్భాల్లో 100 భాగస్వామ్యం నమోదు చేయడం సులభం కాదు. క్రీజులో కుదురుకునేందుకు సమయం కావాలి. నేను కూడా వేగంగా పరుగులు చేయలేకపోయా. అప్పుడే మరో వికెట్ పడి ఉంటే పరిస్థితి ఘోరంగా ఉండేదని జాగ్రత్తగా ఆడాం. ధోని కొన్నేళ్లుగా జట్టు అవసరాలకు తగ్గట్లు ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయడానికి సిద్ధంగా ఉంటున్నాడు. ధోని ఔట్ కాగానే మ్యాచ్ కఠినంగా మారుతోందని అనిపించింది. జడేజా కీలక ఇన్నింగ్స్ ఆడతాడేమో అని అనుకున్నా. కానీ సాధించాల్సిన రన్‌రేట్ ఎక్కువగా ఉన్నపుడు ఏ ఆటగాడైనా ఒత్తిడికి గురి కావడం మామూలే" అని రోహిత్ పేర్కొన్నాడు.

ధోని.. ఇప్పుడు అసలైన 10 వేలు

భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ మహేంద్రసింగ్ ధోని వన్డేల్లో 10 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. అదేంటి.. కొన్ని నెలల కిందటే ఈ మార్కును దాటేశాడు కదా అంటారా? ఐతే అప్పటికి ఆసియా ఎలెవన్ తరఫున అతను సాధించిన 174 పరుగులు కూడా కలిపితే 10 వేలు అయ్యాయి. ఐతే ఇప్పుడు భారత జట్టు తరఫున మాత్రమే 10 వేల మైలురాయిని అందుకున్నాడు. ఆస్ట్రేలియాతో శనివారం తొలి వన్డేకు ముందు 9,999 పరుగులతో ధోని.. తొలి పరుగుతోనే ఆ ఘనత సాధించాడు. భారత్ తరఫున ధోని పరుగులు 10,050 కాగా.. మొత్తం 10,224. ధోనికిది 330వ వన్డే. మహి సగటు 49.75 కాగా.. అతడి ఖాతాలో 9 శతకాలు, 67 అర్ధశతకాలు ఉన్నాయి. మొత్తంగా వన్డేల్లో 10 వేల పరుగుల మైలురాయిని అందుకున్న 13వ ఆటగాడతను.



ధోని
51




ఒలివర్
(5/51)

పాక్‌కు మళ్లీ కష్టాలే

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్‌ను ఇప్పటికే 0-2తో కోల్పోయిన పాకిస్థాన్‌కు వైట్‌వాష్ తప్పేలా లేదు. మూడో టెస్టులోనూ ఆ జట్టు కష్టాల్లో పడింది. తొలి రోజు దక్షిణాఫ్రికాను 262 పరుగులకే కట్టడి చేసిన పాక్.. తర్వాత పెద్ద స్కోరేమీ చేయలేదు. 185 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 17/2తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు.. ఒలివర్ (5/51), ఫిలాండర్ (3/43), రబాడ (2/41)ల ధాటికి విలవిలలాడింది. ఒక దశలో 53 పరుగులకే 4 వికెట్లు కోల్పోయిన పాక్.. బాబర్ అజామ్ (49), సర్ఫరాజ్ అహ్మద్ (50)ల పోరాటంతో 169/5తో మంచి స్థితికి చేరుకుంది. కానీ సఫారీ బౌలర్లు 16 పరుగుల తేడాలో 5 వికెట్లు తీసి పాక్ ఇన్నింగ్స్‌ను ముగించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా.. ఆట ఆఖరుకు 135/5తో నిలిచింది. ఆమ్లా (42), డికాక్ (34) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం 212 పరుగుల ఆధిక్యంలో ఉన్న దక్షిణాఫ్రికా.. పాక్ ముందు పెద్ద లక్ష్యాన్ని నిలిపేలా ఉంది.

రాష్ట్రాల హక్కులను హరిస్తే ఊరుకోం

- రాష్ట్రంలో కేసుకు ఎన్ఐఏకి ఏం సంబంధం
- కోర్టుకూ వెళ్తాం
- జాతీయ అంశంగా చేస్తాం
- మోదీపై చంద్రబాబు ధ్వజం
- జగన్ కేసును ఎన్ఐఏకి అప్పగించడాన్ని నిరసిస్తూ లేఖ



ఈనాడు, అమరావతి: జగన్ కేసును కేంద్ర ప్రభుత్వం ఎన్ఐఏకి (జాతీయ దర్యాప్తు సంస్థ) అప్పగించడాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా నిరసించారు. జగన్‌ను కాపాడటానికి మోదీ ప్రభుత్వం తప్పుడు విధానాలను అనుసరిస్తోందని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రం హక్కుల జోలికొస్తే సహించబోమని, అధికారాల్ని కాపాడుకోవడానికి ఎంతవరకైనా వెళ్లి పోరాడతామని గట్టిగా హెచ్చరించారు. కేంద్రంపై లేఖల యుద్ధానికి తెరతీశారు. అందులో భాగంగా శనివారం జగన్ కేసును ఎన్ఐఏకి అప్పగించడాన్ని నిరసిస్తూ హోంశాఖ లేఖ రాశారు. త్వరలో జయప్రకాశ్ నారాయణ నివేదికలోని అంశాలను అమలు చేయాలని కోరుతూ మరో లేఖ రాయనున్నారు. ఈ నేపథ్యంలో ఉండవల్లిలోని ప్రజావేదికలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

కోర్టుకెళ్తాం..

కేంద్రం అనుసరిస్తున్న వైఖరి సమాఖ్య, సార్వభౌమ స్ఫూర్తిని కాలరాసేలా ఉంది. దీనికి నిరసనగానే ప్రధానికి లేఖ రాశా. దీనిపై కోర్టుకూ వెళతాం. మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్ఐఏని విమర్శించారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అధికారాల్ని తన చేతుల్లోకి తీసుకోవాలనుకుంటున్నారా? జగన్‌పై కేసుని ఎన్ఐఏకి అప్పగిస్తారా? అసలు ఈ కేసుకీ, ఎన్ఐఏకీ ఏం సంబంధం? కేంద్రం వద్ది ప్రాంతాల్లో పంచాయితీలు పెడతామంటే ఊరుకోం. ఇది కేవలం ఏపీకి సంబంధించిన వ్యవహారం కాదు. 29 రాష్ట్రాలకు సంబంధించిన అంశం. దీన్ని జాతీయ స్థాయిలో చర్చకు పెడతాం. కేంద్రం అధికారాలేంటో, రాష్ట్రం అధికారాలేంటో నిగ్గు తేలుస్తాం.

జేపీ కమిటీ నివేదికపై కేంద్రానికి లేఖ..

మేం భాజపాతో విభేదించి బయటకు వచ్చింది ప్రత్యేక హోదా సహా విభజన హామీలు, ప్రత్యేక చట్టంలో పొందుపరిచిన అంశాల్ని సాధించుకోవడానికే. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఒక నిపుణుల కమిటీని వేసి రాష్ట్రానికి కేంద్రం నుంచి రూ.75వేల కోట్లు రావాలని తేల్చారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ అధ్యర్యంలోని నిపుణుల కమిటీ కూడా రూ.75వేల కోట్లు రావాలని తేల్చింది. అది మా పార్టీనో, ప్రభుత్వ అధినేతగా నేను చెప్పిన మాటో కాదు. తటస్థులుగా ఉన్న మేధావులు చెప్పిన మాట. వారిపై గౌరవం ఉంటే ప్రధాని ఆ నివేదికనైనా అమలు చేయాలి. దీనిపై ప్రధానికి లేఖ రాయబోతున్నా. రాష్ట్రంపై ప్రధాని అంత కక్షతో వ్యవహరిస్తుంటే ఇక్కడి భాజపా నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదు.

మోదీకి రాసిన లేఖలో ఏముందంటే...

'విశాఖపట్నం విమానాశ్రయంలో వైకాపా అధ్యక్షుడు జగన్‌పై జరిగిన కోడి కత్తి దాడి కేసును ఎన్ఐఏకి అప్పగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకునేలా కేంద్ర హోం మంత్రిత్వశాఖకు ఆదేశాలు జారీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా, అభ్యంతరాలనూ అడగకుండా ఈ కేసును ఎన్ఐఏకి ఎలా అప్పగిస్తారు? ఈ కేసులో 'ద సప్రెషన్ ఆఫ్ అన్‌లాఫుల్ యాక్ట్స్ ఎగైనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్- 1982 సెక్షన్ 3(ఎ) (1) (ఎ) ఎంత మాత్రమూ వర్తించదు. జగన్‌పై జరిగిన దాడికి, విమానయాన భద్రతకు సంబంధం లేదు. ఇది వ్యక్తిపై జరిగిన దాడి. ప్రజా సింగ్ చందర్‌పాల్ సింగ్ వర్సెస్ ఎన్ఐఏ కేసులో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత చర్య ఉంది. 2014 మేలో చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో జరిగిన బాంబు పేలుళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మృతి చెందగా 14మంది గాయపడ్డారు. ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించాలన్న కేంద్ర ప్రతిపాదనను తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. మీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వమే నాడు తమిళనాడు అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఆ కేసును ఇవ్వలేదు. ఇప్పుడు అప్రజాస్వామికంగా జగన్‌పై జరిగిన దాడిని జాతీయ స్థాయి కేసుగా చూపిస్తూ అప్పగించింది. కేంద్ర హోం మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు అందిన 24 గంటల వ్యవధిలోనే జగన్‌పై జరిగిన దాడి కేసులో ఎన్ఐఏ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ ఆరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను మావోయిస్టులు హతమార్చిన ఘటన కేసు నమోదులో మాత్రం చాలా జాప్యం చేశారు. ఎన్ఐఏ-2008 చట్టం ప్రకారం.. అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ నేరాలు, స్మగ్లింగ్, మాదక ద్రవ్యాలు, నకిలీ నోట్ల సరఫరా తదితర అంశాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు బాధ్యతలను మాత్రమే ఆ సంస్థ చేపట్టాలి. అందుకు విరుద్ధంగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు' అని అన్నారు.

ఐకానిక్ వంతెనకు శంకుస్థాపన

నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సంబంధించి రెండు కీలకమైన ప్రాజెక్టులకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శంకుస్థాపన చేశారు. తొలుత రూ.1387 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ వంతెనకు, రూ.745.65 కోట్లతో రాజధాని తాగునీటి అవసరాలకు నిర్మించే నీటిశుద్ధి ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.



కవి కొండి మల్లారెడ్డికి పురస్కారం అందజేసి సత్కరిస్తున్న ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, తెరవే రాష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు తదితరులు

అసలు సిసలైన తెలంగాణ కవి 'అలిశెట్టి'

మల్లారెడ్డికి పురస్కార ప్రదానంలో వక్తలు

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాజంతో సంబంధ బాంధవ్యాలు పెంచుకొని ఎన్నో రచనలు చేసిన అలిశెట్టి ప్రభాకర్ అసలు సిసలైన తెలంగాణ కవి అని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ తిరుమల్‌రావు అభివర్ణించారు. శనివారం కరీంనగర్‌లో తెరవే ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాకు చెందిన కవి, రచయిత కొండి మల్లారెడ్డికి అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని శాశ్వత పురస్కార ప్రదాత ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అందించారు. ఈ సందర్భంగా తిరుమల్‌రావు మాట్లాడుతూ.. అలిశెట్టి సామాన్యుల కోసం కవిత్వాన్ని రాసి వారికే అంకితం చేశారన్నారు. సమాజ దుర్గతులను కవిత్వంగా మలిచి ప్రజలకే అందించే వారు కవులని, ఆ కవితా దృష్టి కొండిరెడ్డి సాధ్యమన్నారు. తెలంగాణ కవుల్లో అలిశెట్టి.. దాశరథి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారన్నారు. చిన్న చిన్న కవితలతో అలిశెట్టి రాసిన 'చరణం' కవితలతో సమాజానికే చురకలు అందించారని చెప్పారు. రెండు చరణాలతో కవితలు రాసిన కవి అలిశెట్టి ఒక్కరే అని, ఆయన కవిత్వంలో రెండు చరణాలే కానీ భావం విస్తృతంగా ఉంటుందన్నారు. అలిశెట్టి భావజాలంతోనే దళిత బహుజన వర్గాలకు రాస్తున్న 'కొండి మల్లారెడ్డి పురస్కారానికి నిజంగా అర్హులన్నారు. పురస్కార గ్రహీత కొండి మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. అన్నవరం ప్రభాకర్ కొండి మల్లారెడ్డి సాహిత్యాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంజయ్య, జూకంటి జగన్నాథం, ప్రసాదరావు, గాజోజు నాగభూషణం, సి.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆబ్కారీ' పథకాల్లో రెండు

బెవరేజెస్ ఉద్యోగులకూ వర్తింపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఆబ్కారీ శాఖలో అమలవుతున్న ఆరోగ్య సహాయత, సహాయత బీమా పథకాలను బెవరేజెస్ కార్పొరేషన్ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. వీటిని ఆదివారం జలవిహార్ వద్ద సభలో బెవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్, ఆబ్కారీ ముఖ్యకార్యదర్శి సోమేశ్ కుమార్, ఉద్యోగుల గౌరవాధ్యక్షుడు ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు ప్రారంభిస్తారు. రాష్ట్రంలోని 19 మద్యం డిపోలతో పాటు సంబంధిత రాష్ట్ర కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులందరికీ ఇవి అమలవుతాయి. ఆరోగ్య సహాయత ద్వారా ఉద్యోగులకు నగదు రహిత వైద్యసేవలు అందుతాయి. సహాయత బీమా ద్వారా ఆయా ఉద్యోగులకు ప్రమాద బీమాతో పాటు ఇతరత్రా సేవలు అందుతాయని బెవరేజెస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సత్యం, ప్రధాన కార్యదర్శి సంఘం, ఆబ్కారీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి జీటీ జీవన్ చెప్పారు.

పాత పంటల ఆరోగ్య జాతర

- చిరుధాన్యాల సాగు పెంచడమే ప్రధాన లక్ష్యం
- రెండు దశాబ్దాలుగా సంక్రాంతి పర్వదినాల్లో నిర్వహణ

ఈనాడు - సంగారెడ్డి



ఊరూరా తిరుగుతూ ప్రజల్లో చైతన్యం పరిచే బృందం

అందరినీ చల్లంగా చూడాలి తల్లీ.. అంటూ గ్రామాల్లో ఆలయాల వద్ద ఏటా జాతరలు నిర్వహిస్తుంటారు. గ్రామ దేవతలకు మొక్కి అన్నదానం కోరుకుంటారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలో 20 ఏళ్లుగా ఒక జాతర జరుగుతోంది. ఇక్కడ మొక్కులు చెల్లించడం, నైవేద్యాలు సమర్పించడం ఉండవు. ఆరోగ్య సమాజమే లక్ష్యంగా సాగే పాత పంటల జాతర ఇది. భోజనమంటే అన్నమే అని భావించే నేటి సమాజాన్ని చిరుధాన్యాల వైపు మళ్లించే అపురూపమైన వేదిక ఇది. దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అయిదు వేల మంది మహిళా రైతుల భాగస్వామ్యంతో ఇది కొనసాగుతుంది. మనం మరిచిపోతున్న కొర్రలు, సామలు, ఊదలు, అవిసెలు, జొన్నలు, సజ్జలు, రాగులు.. ఇలా పాత పంటల ప్రాధాన్యాన్ని ఈ తరానికి తెలియజేస్తూ సేంద్రియ సాగుకూ ఊతమిచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం దీని ప్రత్యేకత. 1999వ సంవత్సరంలో ప్రారంభమైన జాతర ఈ ఏడాదితో 20 వసంతాలు పూర్తి చేసుకుంటోంది. ఈనెల 14న జహీరాబాద్ మండలం అర్జునాయక్‌తండాలో ప్రారంభమై ఫిబ్రవరి 13న రురురసంగం మండలం మాచునూరులో ముగియనుంది.

ఈసారి కొత్త గ్రామాల్లో...

అందంగా అలంకరించిన 16 బండ్లపై చిరుధాన్యాలు ఉంచి గ్రామాల్లో తిప్పుతారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల ప్రాముఖ్యాన్ని ఆయా గ్రామాల ప్రజలకు వివరిస్తారు. స్థానిక రైతులకు ఈసాగుపై అవగాహన పెంచుతారు. గతంలో ప్రతిసారీ దాదాపుగా అవే గ్రామాల్లో ఏటా జాతరను నిర్వహించేవారు. ఈసారి గతంలో ఎన్నడూ వెళ్లని పల్లెలను ఎంపిక చేశారు. జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి మండలాల్లోని 23 గ్రామాల్లో ఈసారి జాతర జరగనుంది. వీరి మహత్తర ప్రయత్నం 20 వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా పాత పంటల సాగు పెంచేలా చొరవ తీసుకోవడం గమనార్హం. తొలిదశలో ఆరు జిల్లాల్లోని 36 మండలాలను ఎంపిక చేసిన వ్యవసాయశాఖ చిరుధాన్యాలను పండించిన రైతులకు హెక్టారుకు రూ.6 వేలు రాయితీ ప్రోత్సాహాన్ని అందించనుంది.

గురుకుల ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించండి

యూటీఎఫ్ డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలల్లో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి తగ్గించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.రాములు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయుల సదస్సులో ఆయన మాట్లాడారు. గురుకులాలకు శాశ్వత భవనాలు, కనీస సౌకర్యాలు లేకున్నా సర్దుకుని ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారని చెప్పారు. అయితే బోధనేతర పనులు అప్పగించి అదనంగా పనిచేయిస్తున్నారని, ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. గురుకుల విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ క్రోడీకరించి త్వరలోనే నివేదికను అధికారులకు అందజేస్తామని, స్పందించకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షురాలు దుర్గాభవాని, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నర్సిరెడ్డి, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయ నేతలు మార్గరెట్, విజయలక్ష్మి, గణేష్ గౌడ్, దామోదర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రికి రూ.40 కోట్ల విరాళం

- పారిశ్రామిక వేత్త వెలమాటి చంద్రశేఖర్ జనార్దనరావు దాతృత్వం



దాత చంద్రశేఖర జనార్దనరావు

ఈనాడు డిజిటల్, ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో క్యాన్సర్ ఆసుపత్రి, కార్డియాలజీ బ్లాకుల భవనాల నిర్మాణానికి పారిశ్రామికవేత్త వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు రూ.40 కోట్ల విరాళం అందించారు. ఈ భవన నిర్మాణాలకు శనివారం వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దాత చంద్రశేఖర జనార్దనరావును ఆమె అభినందించారు. డబ్బు చాలామంది దగ్గర ఉంటుంది కానీ ఇలాంటి మహత్తర కార్యక్రమాలు చేయడానికి ముందుకు రారని అన్నారు. సమాజానికి ఉపయోగపడేవిధంగా ఇంత పెద్ద మొత్తంలో విరాళం ఇవ్వడం జిల్లా ప్రజలు చేసుకున్న అదృష్టమని కొనియాడారు. పారిశ్రామిక వేత్త వెలమాటి చంద్రశేఖర జనార్దనరావు పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో జన్మించారు. పదోతరగతి వరకు కొవ్వలిలోనే విద్యాభ్యాసం చేశారు. విజయవాడలోని లయోలా కళాశాలలో ఇంటర్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సును అభ్యసించారు. అనంతరం బిర్లా టెక్నికల్-ఎగ్జిక్యూటివ్ సర్వీసులో చేరి కోల్‌కతాలోని హిందుస్థాన్ మోటార్సులో రెండేళ్లు పనిచేశారు. ఆ తరువాత హైదరాబాదులో సొంతంగా రిఫ్రిజిరేటర్ కంప్రెసర్ తయారీ సంస్థను ప్రారంభించారు. 1965లో వెల్‌జన్ హైడ్రేయర్ ప్రైవేటు లిమిటెడ్‌ను స్థాపించారు. 1973లో వెల్‌జన్ డెనిసన్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. స్వగ్రామమైన కొవ్వలి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు అదనపు భవనాలు, వర్క్‌షెడ్, ప్రయోగశాలలు ఏర్పాటుకు ఆయన గతంలో విరాళం ఇచ్చారు. ఏలూరులోని సర్ సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 2000లో టెక్నాలజీ కేంద్రం ఏర్పాటుకు రూ.2 కోట్ల భూరి విరాళం ఇచ్చారు. హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి రూ.10 కోట్లు, 2014లో హుద్‌హుద్ తుపాను బాధితుల సహాయార్థం రూ.కోటి విరాళం ఇచ్చారు. గతేడాది ఏలూరు జిల్లా ఆసుపత్రిలో తలసేమియా రోగుల చికిత్స కేంద్రం భవనానికి రూ.కోటి విరాళం ఇచ్చారు.

కాలగర్భంలోకి రెండు పాత ప్లాంట్లు

- కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్కేంద్రం ప్రారంభం
- నిబంధనల ప్రకారం పాతవి మూసివేత

ఈనాడు - హైదరాబాద్

కొత్తగూడెంలో 800 మెగావాట్ల కొత్త విద్యుత్కేంద్రం నిర్మాణం పూర్తయి ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తి ప్రారంభం కావడంతో పాత ప్లాంట్లను మూసివేసేందుకు జెన్‌కో చర్యలు ప్రారంభించింది. తాజాగా 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యమున్న 6వ యూనిట్‌లో ఉత్పత్తి నిలిపేసింది. ఇంతకుముందే 60 మెగావాట్ల సామర్థ్యమున్న 3వ యూనిట్‌నూ ఆపేసిన విషయం తెలిసిందే. దీంతో మొత్తం 180 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యమున్న రెండు ప్లాంట్లు కాలగర్భంలో కలిశాయి. ఈ కేంద్రాల్ని నిర్మించి 50ఏళ్లు దాటినందున వాటి నుంచి కాలుష్యం అధికంగా విడుదలవుతోంది. విద్యుదుత్పత్తి సగటు వ్యయమూ కొత్త వాటికన్నా అధికమవుతుండటం ప్రధాన సమస్యగా మారింది. ఎలా చూసినా పాత వాటితో నష్టమేనని తేలడంతో కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాలు అమలు చేయడమే శ్రేయస్కరమని జెన్‌కో నిర్ణయానికి వచ్చింది.

ఏ విద్యుత్కేంద్రమైనా నిర్మాణం పూర్తయిన తరవాత పాతికేళ్ల వరకే సక్రమంగా పనిచేస్తుంది. కానీ కొత్తగూడెంలోని పాతప్లాంట్లు ఏకంగా 50 ఏళ్ల పాటు నిరంతరాయంగా పనిచేశాయి. మొత్తం 720మెగావాట్లను ఉత్పత్తి చేసే 8 పాత ప్లాంట్లను మూసివేయాలనే షరతు పెట్టి 800 మెగావాట్ల కొత్త విద్యుత్కేంద్రం నిర్మాణానికి మూడేళ్ల క్రితం కేంద్ర పర్యావరణ శాఖ అనుమతించింది. కొత్తదాని నిర్మాణానికి ముందే మూసివేయాలని చెప్పినా నిర్మాణం పూర్తయిన తరవాత 2019లోగా మూసేస్తామని తెలంగాణ జెన్‌కో హామీ ఇచ్చింది. ఇటీవల కొత్త కేంద్రంలో వాణిజ్య ప్రాతిపదికన విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. దీంతో పాత 8 ప్లాంట్లను దశలవారీగా మూసివేసే చర్యల్లో భాగంగా రెండింటిలో ఉత్పత్తి ఆపివేసింది.

★ కొత్తగూడెంలో గతంలో మొత్తం ఆరు దశల్లో 11 ప్లాంట్లను నిర్మించారు. వీటిలో తొలి 4 దశల్లో నిర్మించిన 8 ప్లాంట్లను మూసివేయాలని కేంద్ర పర్యావరణశాఖ ఆదేశించింది. మొట్టమొదటగా ఒకటో దశ పేరుతో 1965-67లో 1, 2వ ప్లాంట్లు నిర్మించారు. 1967-69 మధ్యకాలంలో 2వ దశకింద 3, 4 ప్లాంట్లు నిర్మించారు. 3వ ప్లాంటును ఇటీవలే మూసివేశారు. సాంకేతిక సమస్యలు రావడంతో మరమ్మతు కోసం ప్రయత్నించగా భారీ వ్యయం అవుతుందని తేలడంతో మూసివేయడమే లాభదాయకమని ఉత్పత్తి ఆపేశారు. 3వ దశలోని 6వ ప్లాంటును తాజాగా ఆపారు. ఇవి మూసివేసినందున తెలంగాణకు ఎలాంటి విద్యుత్ సమస్యలు రావని జెన్‌కో వర్గాలు తెలిపాయి.

కొత్తగూడెంలో మూసివేయనున్న పాత విద్యుత్కేంద్రాల వివరాలు

దశ	ఎన్ని ప్లాంట్లు	ఒక్కో ప్లాంటు ఉత్పత్తి సామర్థ్యం (మెగావాట్లు)	మొత్తం ఉత్పత్తి
మొదటి	2	60	120
రెండవ	2	60	120
మూడో	2	120	240
నాలుగో	2	120	240
మొత్తం	8	-	720

తెగొద్దు జీవన ఆధారం

పతంగులు ఎగురవేయడానికి వాడుతున్న చైనా మాంజా.. పక్షుల పాలిట మృత్యుగీతంగా మారుతోంది. దీని కారణంగా వాటి రెక్కలు, గొంతులు తెగి చనిపోతున్నాయి. చిన్నారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చైనా మాంజాను నిషేధించింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో అటవీశాఖ అధికారులు పతంగుల విక్రయాల దుకాణాల్లో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మాంజా కారణంగా గతంలో గాయపడిన వారి చిత్రాలతో రూపొందించిన కరపత్రాలను ప్రదర్శిస్తున్నారు. ఎవ్వరూ చైనా మాంజాను విక్రయించకుండా.. వినియోగించకుండా తనిఖీలు చేస్తున్నారు.

-ఈనాడు, సంగారెడ్డి



మాంజా కారణంగా నిజామాబాద్ జిల్లాలో 2010 జనవరి 15 రోజున రెక్క తెగి చనిపోయిన ఎనిమిది అడుగుల విదేశీ కొంగను చూపుతున్న స్థానికుడు(పాతచిత్రం)



సంగారెడ్డిలో గాలిపటాల దుకాణంలో దారాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు.

ఒప్పందం ప్రకారమే వడ్డీరేటు


డీఆర్‌టీ తీర్పును సవరించిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఇంటి కోసం తీసుకున్న రుణ బకాయిలు చెల్లింపుల్లో... ఒప్పందం ప్రకారం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని తెలంగాణ హైకోర్టు తేల్చిచెప్పింది. అంతకుముందు వడ్డీ చెల్లించాలంటూ రుణ వసూళ్ల ట్రిబ్యునల్ (డీఆర్‌టీ) ఇచ్చిన తీర్పును సవరిస్తూ ఉత్తర్వులిచ్చింది. బకాయి చెల్లింపుల్లో భాగంగా హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు 18శాతం వడ్డీతో రూ.10.43 లక్షలు చెల్లించాలంటూ డీఆర్‌టీ ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కె.శ్రీరంగప్రసాద్ పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ పి.కేశవరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది పి.శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, బకాయి చెల్లించాలంటూ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులపై తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. అయితే వడ్డీ 18 శాతం చెల్లించాలనడం సరికాదన్నారు. 11.5 శాతం వడ్డీగా కార్పొరేషన్‌తో రుణ ఒప్పందం కుదిరిందని చెప్పారు. ఆ ప్రకారమే ఒప్పందం ఉన్నట్లు కార్పొరేషన్ తరఫు న్యాయవాదీ తెలిపారు. వాదనలను విన్న ధర్మాసనం... వడ్డీరేట్లు తీసుకున్న రుణాలు ఆధారంగా ఉంటాయని, అయితే ఇతర వాణిజ్య అవసరాలకు తీసుకున్న వాటి కంటే ఇంటి కొనుగోలుకు తీసుకున్న రుణానికి వడ్డీ తక్కువగా ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో, ఒప్పందం పరిధిని దాటి 18 శాతం వడ్డీ చెల్లించాలంటూ ట్రిబ్యునల్ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని స్పష్టంచేసింది. రుణ బకాయిని 11.5 శాతం వడ్డీతో చెల్లించాలంటూ పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది.

పులిదాడిలో పశువుల కాపరి మృతి

చంపిన తర్వాత అక్కడే తిష్ఠ వేసిన వైనం

బల్లార్ష, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రంవద్ద పశువులను మేపుకొంటున్న ఓ వ్యక్తిపై పులి దాడి చేసి, హతమార్చింది. ఈ విషాద సంఘటన మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా బ్రహ్మపురి తాలూకాలోని హడది గ్రామంలో శనివారం వెలుగుచూసింది. హడది గ్రామానికి చెందిన దివాకర్ గెడమ్ (45) గ్రామ పరిసరాలలోని తన వ్యవసాయ భూమి వద్ద పశువులను మేపుకొంటున్నాడు. అతనితోపాటు మరో ఇద్దరు పశువుల కాపరులు ఉన్నారు. పక్కనే ఉన్న అమలోనాలా కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లిన దివాకర్‌పై అక్కడే మాటువేసి ఉన్న పులి ఒక్కసారిగా దాడి చేసింది. దివాకర్ అరుపులు విన్న తోటి కాపరులు సంఘటనా స్థలంలోకి చేరుకున్నారు. అప్పటికే దివాకర్‌ను చంపేసిన పులి అక్కడే తిష్ఠ వేసింది. దీంతో భయపడిన వారు గ్రామస్థుల సహకారంతో పులిని తరిమేశారు. అనంతరం అటవీశాఖ అధికారులు సంఘటనాస్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పులి బారినుంచి కాపాడాలని కోరారు. గ్రామస్థులకు రక్షణ కల్పిస్తామని, మృతుని కుటుంబానికి నష్ట పరిహారాన్ని అందిస్తామని అధికారులు నచ్చజెప్పి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం బ్రహ్మపురికి తరలించారు.



సూర్యాపేట జిల్లా ఉయ్యాలవాడ గ్రామ శివారులోని మూసీ ప్రాజెక్ట్ శిఖంలో నాట్లు వేస్తున్న రైతులు

ఉపాధికి ఊతం.. ఉమ్మడి సేద్యం

పలువురు రైతులు ఒక్కటై పంటలు పండించి కొంతమందికి ఉపాధిని కల్పిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని మూసీ ప్రాజెక్టు శిఖం జలాల ప్రాంతం ప్రస్తుతం ఎండిపోయింది. అక్కడికి సమీపంలో ఉన్న జాజిరెడ్డిగూడెం మండలంలోని ఉయ్యాలవాడ, కొత్తగూడెం, కుమ్మరిగూడెం, సూర్యాపేట మండలం సోలిపేట గ్రామాలకు చెందిన సుమారు 120 మంది అన్నదాతలు 500 ఎకరాల్లో సామూహికంగా పంటలు సాగుచేయడానికి సన్నద్ధమవుతున్నారు. నాట్లు వేయడంతో పాటు మందులు పిచికారీ, కోయడం, అమ్మడం..ఇలా అంతా కలసికట్టుగా చేసి వచ్చిన సొమ్మును సమానంగా పంచుకుంటారు. వానాకాలంలో నీటితో కళకళలాడే ఈ ప్రాంతం యాసంగి వేళకు ఎండిపోతుంది. ఆ సమయంలో వరి సహా పలు పంటలు సాగుచేసి ఉపాధి పొందడం ఏటా ఇక్కడ పరిపాటి. - ఈనాడు, సూర్యాపేట

అహ్మద్ పటేల్ ఎన్నికపై 6 అంశాలను తేల్చనున్న హైకోర్టు

అహ్మదాబాద్: రాజ్యసభ సభ్యుడిగా కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ ఎన్నికను సవాలు చేస్తూ భాజపా నేత బల్వంత్ సిన్హ్ రాజ్‌పుత్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో తేల్చాల్సిన వాటిగా ఆరు అంశాలను గుజరాత్ హైకోర్టు శుక్రవారం నమోదు చేసింది. ఓటింగ్‌ను ప్రభావితం చేసేందుకు పటేల్ గానీ ఆయన ఎన్నికల ఏజెంట్ గానీ ముడుపులు ముట్టజెప్పారా? 2017 ఆగస్టులో ఎన్నిక వెల్లడిని ప్రకటించేవారా? కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు ఓట్లు వేయకుండా తిరస్కరించడం, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు 'చెల్లని ఓట్లు'గా వేయడం ఫలితంపై ప్రభావం చూపాయా? వంటి అంశాలను హైకోర్టు తేల్చనుంది. ఈ నెల 18న తదుపరి విచారణ జరగనుంది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00